PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 225 | విజయవాడ, బుధవారం 20 మార్చి 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 20 March 2024 | Rs

పరాయిపంచన కేంద్రీయ విద్యాసంస్థలు

- పూర్తి కాని కేంద్రీయ విశ్వవిద్యాలయ భవనాలు
- నేటికీ టెండర్ల దశలోనే గిరిజన విశ్వవిద్యాలయం
- వసతుల కొరతతో విద్యార్థులకు ఇబ్బందులు

2

ఆర్‌సిబి పేరు మార్పు

న్యూఢిల్లీ : ఐపిఎల్‌లోని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సిబి) జట్టు తన పేరులో చిన్న మార్పు చేసింది. ప్రస్తుతం ఈ జట్టు పేరు ఆంగ్లంలో Royal Challengers Bangalore అని రాస్తున్నారు. దీనిని స్వల్ప మార్పులు చేసి Royal Challengers Bengaluruగా మార్చింది. ఈ విషయాన్ని ట్వీట్ చేసింది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఆర్‌సిబి అన్‌బాక్స్ ఈవెంట్ నిర్వహిస్తోన్న వేళ ఈ ప్రకటన వచ్చింది. అలాగే, కొత్త జెర్సీ ధరించిన జట్టు సభ్యులతో కూడిన ఫొటోనూ ఆర్‌సిబి 'ఎక్స్'లో షేర్ చేసింది. మేమంతా నూతన 'కవచం'తో సిద్ధంగా ఉన్నామని పేర్కొంది. ఐపిఎల్ భారీ అభిమానగణం ఉన్న జట్లలో ఆర్సీబీ ఒకటి. ఇప్పటి మూడుసార్లు ఫైనల్‌కు వెళ్లి రన్నరప్‌గా సరిపెట్టుకుంది. ఈసారైనా టైటిల్ కల నెరవేరాలని అభిమానులు కోరుకుంటున్నారు. మార్చి 22న చెన్నై, ఆర్‌సిబి మధ్య జరిగే మ్యాచ్‌తో ఐపిఎల్-2024 సీజన్ ప్రారంభం కానుంది.

అటకెక్కిన కులగణన!

- ప్రింటింగ్ నిలిపేయాలని ప్రభుత్వ నిర్ణయం
- అధికారపార్టీ చేతికి సర్వే వివరాలు?



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

అత్యంత అట్టహాసంగా నిర్వహించిన కులగణను రాష్ట్ర ప్రభుత్వం అటకెక్కించినట్లుగా తెలిసింది. విశ్వసనీయ వర్గాలు తెలిపిన సమాచార ప్రకారం కులగణన పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా సేకరించిన సర్వే వివరాలను పక్కన పెట్టేయనున్నారు. గతంలో ఈ సర్వే వివరాలను పుస్తకరూపంలో తీసుకురావాలని నిర్ణయించినప్పటికీ తాజాగా ఆ నిర్ణయాన్ని మార్చుకున్నారు. ప్రింటింగ్ పనులు నిలిపివేయాలని ఆదేశాలు జారీ అయినట్లు సమాచారం. కులగణనలో సేకరించిన వివరాలు అసమగ్రంగా ఉండడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. ప్రభుత్వంలోని ఒక సీనియర్ అధికారి దీనిని ధృవీకరించారు. దీంతో కులగణన కార్యక్రమం అటకెక్కినట్టేనని ఆయన వ్యాఖ్యానించారు. 2011-12లో దేశ వ్యాప్తంగా ఈ తరహాలోనే ఒక సర్వే నిర్వహించారని, అది కూడా ఇప్పటివరకు గెజిట్ కాలేదని ఆయన గుర్తుచేస్తుండటం విశేషం. అయితే, కులగణన వివరాలు ఎంత అసమగ్రంగా ఉన్నప్పటికీ, అవి అధికారపార్టీ చేతికి ఇప్పటికే అందినట్లు భావిస్తున్నారు. ఇతర పార్టీలకు అందుబాటులో లేకపోవడంతో ఎనికల వేళ వైసిపికి ఇది ఎంతగానో ఉపయోగపడే అవకాశం ఉంది.

సచివాలయాల శాఖ వద్దే....

ఇప్పటికి వరకు కులగణన వివరాలు ప్రణాళిక శాఖ వద్దకు కూడా చేరలేదని తెలిసింది. ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించింది ప్రణాళిక శాఖే అయినప్పటికీ, సర్వే చేసింది మాత్రం వార్డు, గ్రామ సచివాలయాల కార్యదర్శులు. వారికి వాలంటీర్లు సహకరించారు. గత నెల 20వ తేదికే వివరాల సేకరణ పూర్తయినప్పటికీ, అవి సచివాలయాల శాఖ వద్దే నిలిచిపోయినట్టు చెబుతున్నారు.

ఉపకులాలపై ఆరా...

గతంలో పలు సర్వేల ద్వారా కులాల వివరాలు సేకరించినప్పటికీ వాటిల్లో ఉప కులాల వివరాలు మాత్రం లేవని అధికారులు చెబుతున్నారు. తాజాగా చేసిన కులగణనలో ఉప కులాల వారీగా ఎంత మంది జనాభా ఉన్నారన్న అంశంపై ప్రధానంగా దృష్టిసారించారు. క్షేత్రస్థాయిలో ప్రాధాన్యతలను నిర్ధారించుకోవడానికి ప్రభుత్వాధినేతలకు, విధాన రూపకర్తలకు ఈ సమాచారం ఎంత కీలకమో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అయితే, అధికారులు మాత్రం ఉపకులాలకు సంబంధించిన అంశాలను చెప్పడానికి ప్రజలు ఆసక్తి చూప లేదని అంటున్నారు.

సహకరించని ప్రజలు...

కులాల వివరాలే కాకుండా వారి ఆర్థిక పరిస్థితి, ఆస్తులు, ఇళ్లలో ఉన్న పశువుల వివరాలు, గొర్రెలు, వంట కోసం వినియోగిస్తున్న గ్యాస్, విద్యుత్ స్టౌ, వంట చెరకు, గోబర్ గ్యాస్, బయో ఇంధనం వంటి విధానాలను కూడా తెలుసుకోవాలని ప్రయత్నించారు. వారి జీవన విధానం, ఆదాయ వనరులు, వారికి ఉన్న వ్యవసాయ భూమి, ఇళ్లు వంటి వాటిపైనా వివరాలతోపాటు, 50 సెంట్లు కన్నా తక్కువ వ్యవసాయ భూమి ఉన్న వారు, అంతకు మించి భూమి ఉన్న వారి వివరాలను కూడా సేకరించాలన్నది కుల గణన లక్ష్యం. ఇటువంటి కీలక సమాచారాన్ని సర్వేలో కోరుతుండడంతో ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చిందని అధికారులు చెబుతున్నారు. ఈ వివరాలకు ఆధార్‌ను కూడా అనుసంధానం చేయాలని నిర్ణయించడం కూడా ప్రజల వ్యతిరేకతకు కారణమని అంటున్నారు. మారుమూల, గిరిజన ప్రాంతాల్లో నెట్‌వర్క్ సౌకర్యం లేకపోవడం కూడా సర్వేకు ఇబ్బందులు కలిగించిందని సమాచారం.

3 వారాల్లోగా చెప్పండి

సిఎఎపై కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం • విచారణ ఏప్రిల్ 9కి వాయిదా



ధర్మాసనం సభ్యులు జస్టిస్ పార్థివాలా, జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ మనోజ్‌మిశ్రా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో


పౌరసత్వ (సవరణ) నిబంధనలపై స్టే కోరుతూ దాఖలైన పిటిషన్లపై మూడువారాల్లోగా స్పందించాలని సుప్రీం కోర్టు మంగళవారం కేంద్రాన్ని ఆదేశించింది. పౌరసత్వ (సవరణ) చట్టం-2019 రాజ్యాంగపరమైన చెల్లుబాటును సవాల్ చేస్తూ, ఈ పిటిషన్లపై విచారణ పూర్తయ్యేవరకు స్టే విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను మంగళవారం నాడు తిరిగి విచారణకు చేపట్టిన చీఫ్ జస్టిస్ డి వై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య రాజ్యాంగ ధర్మాసనం ఈ మేరకు కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. జస్టిస్ జెబి పార్థివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా ఈ ధర్మాసనంలో సభ్యులుగా ఉన్నారు. కేంద్రం తరపున వాదనలు వినిపించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా నాలుగు వారాల గడువు కావాలని కోరారు. ఆయన అభ్యర్థనను కోర్టు తోసిపుచ్చింది. మూడు వారాల్లోగా పిటీషన్లకు వివరణ ఇవ్వాల్సిందేనని స్పష్టం చేసింది. సిఎఎ చెల్లుబాటును సవాల్ చేయడంతోబాటు, దీని అమలుకు ఈ నెల 11న జారీ చేసిన నిబంధనలపై స్టే కోరుతూ కేరళ ప్రభుత్వం, డివైఎఫ్ఐ, ఐయుఎంఎల్, ఇతర సంఘాలు, వ్యక్తుల నుంచి మొత్తం 236 పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై ఏప్రిల్ 2లోగా ఐదు పేజీలకు మించకుండా సమాధానాన్ని ఏప్రిల్ 8లోగా దాఖలు చేయాలని ధర్మాసనం కేంద్రాన్ని ఆదేశించింది. అనంతరం ఈ కేసు తదుపరి విచారణను ఏప్రిల్ 9కి వాయిదా వేసింది.

సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా నాలుగు వారాల గడువు కోరడంపై కొద్దిసేపు వాడిగా వేడిగా వాద ప్రతివాదాలు జరాగాయి. నాలుగువారాల గడువు చాలా ఎక్కువ అని పిటిషనర్ల తరపు న్యాయవాది కపిల్ సిబాల్ అభ్యంతరం లేవనెత్తారు. చట్టం తెచ్చిన నాలుగేళ్ల తరువాత అకస్మాత్తుగా ఇప్పుడే ఈ నిబంధనలు నోటిపై చేయడమేంటని ఆయన ప్రశ్నించారు. అంతర్జాతీయ చట్టం ప్రకారం పౌరసత్వం మంజూరు చేసిన తరువాత మీరు దానిని వెనక్కి తీసుకోలేరు అని సిబల్ అన్నారు.. "వారు చట్టబద్ధమైన నిబంధనలపై స్టే కోరుతున్నారు" అని సొలిసిటర్ జనరల్ ఆక్షేపించారు.. మేము నోటిపై చేయడం లేదని గతంలో చెప్పిన కేంద్రం ఎన్నికల ముంగిట దీనిని ముందుకు తేవడంలో ఉద్దేశమేమిటో అర్థమవుతుందన్నారు.

పెండింగ్‌లో ఉన్నందున పౌరసత్వాన్ని మంజూరు చేయొద్దు

పిటిషనర్ల తరపున మరో సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ తన వాదనలు వినిపిస్తూ ఈ అంశం కోర్టులో పెండింగ్‌లో ఉన్నందున నిబంధనల ప్రకారం ఎటువంటి పౌరసత్వాన్ని మంజూరు చేయకూడదని ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు.. "పౌరసత్వం మంజూరు చేయబడిందా? లేదా? అనేది పిటిషనర్లపై ప్రభావం చూపదు" అని సొలిసిటర్ జనరల్ బదులిచ్చారు. " అది కాదు ముఖ్యం, సిఎఎ రాజ్యాంగ చెల్లుబాటు ఏమిటన్నదే ప్రధానం' అని జైసింగ్ కౌంటర్ ఇచ్చారు.

1995 నాటి పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 2ని కేంద్రం సవరిస్తూ ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, పాకిస్తాన్‌లో ఉన్న హిందూ, సిక్కు, బౌద్ధ, జైన్, పార్శీ, క్రైస్తవులకు మాత్రమే పౌరసత్వాన్ని ఇస్తామని చెప్పింది. మతం ఆధారంగా పౌరసత్వం ఇవ్వడమంటే కొందరి పట్ల వివక్ష చూపడమేనని, ఇది రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్లు పేర్కొన్నారు.



సిపిఎం రాష్ట్ర కార్యాలయం వద్ద జెండా తొలగింపు

- గోడపై రాసిన పార్టీ పేరునూ తొలగించాలని హుకుం
- కలెక్టరుకు పార్టీ ఫిర్యాదు

2

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

- విఆర్ న్యాయకళాశాల స్టూడెంట్స్ ఫెస్ట్‌లో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

5

షిప్‌యార్డు ప్రయివేటీకరణతో తీవ్ర నష్టం

- విశాఖలో రిటైర్డ్ ఉద్యోగుల నిరసన

3

ఇంటింటికీ 'పాంచ్ న్యాయ్'

- సిద్ధమైన కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో
- దేశం మార్పును కోరుకుంటోంది: ఖర్గే



సిడబ్ల్యుసి సమావేశానికి హాజరైన సోనియాగాంధీ, మల్లికార్జునఖర్గే, రాహుల్‌గాంధీ తదితరులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను అట్టడుగు స్థాయి దాకా తీసుకెళ్లేందుకు రోడ్డు మ్యాప్‌ను రూపొందించామని సిడబ్ల్యుసి సమావేశం అనంతరం ఆ పార్టీ నాయకులు కెసి వేణుగోపాల్, జైరాం రమేష్ మీడియాకు వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికల కోసం రూపొందించిన ఎన్నికల మ్యానిఫెస్టోలో 'పాంచ్ న్యాయ్'పై కేంద్రీకరించినట్లు వారు తెలిపారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఇంటింటికీ గ్యారంటీ మంత్రంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సిడబ్ల్యుసి పిలుపునిచ్చింది. మంగళవారం నాడిక్కడ జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి) సమావేశం మ్యానిఫెస్టోలో పేర్కొన్న హామీలపై లోతుగా చర్చించిందని, దీనికి తుది ఆమోదం, మ్యానిఫెస్టో విడుదల తేదీలను ఖరారు చేసే అధికారం పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఈ సమావేశం అప్పగిస్తూ తీర్మానం చేసింది. రాహుల్ గాంధీ ఇటీవల నిర్వహించిన భారత్ జోడో న్యాయ్ యాత్రను సిడబ్ల్యుసి కొనియాడింది. ప్రజల మధ్య నిరంతరం ఉంటూ వారి బాధలను అర్థం చేసుకోడానికి ఇది తోడ్పడిందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. ఈ మ్యానిఫెస్టో సాధారణ పత్రం కాదని, ప్రజల జీవితాలను మార్చే పత్రమని ఆయన అన్నారు. కోట్లాది మందితో మాట్లాడిన తరువాత 'ఉపాధిలో విప్లవం' తీసుకొచ్చేందుకు, అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం పెంచేందుకు ఇది రోడ్డు మ్యాప్‌గా ఉంటుందని అన్నారు.

సిడబ్ల్యుసి సమావేశం నిర్ణయాలను ఆ పార్టీ నేతల కెసి వేణుగోపాల్, జై రాం రమేష్ మంగళవారం నాడిక్కడ విలేకరుల సమావేశంలో వెల్లడిస్తూ, 'పాంచ్ న్యాయ్' పేరుతో ఐదు అంశాలపై మొత్తం 25 గ్యారంటీలను కాంగ్రెస్ ఇస్తుందన్నారు. మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన ఈ సిడబ్ల్యుసి సమావేశానికి మాజీ అధ్యక్షులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలతో పాటు తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రులు ఎ.రేవంత్ రెడ్డి, సిద్ధరామయ్య, సుఖ్వీందర్ సింగ్ సుఖ్, ఇతర నేతలు కెసి వేణుగోపాల్, మీరా కుమారి, అంబికా సోనీ, ప్రియాంక గాంధీ, పి. చిదంబరం, దిగ్విజయ్ సింగ్, వీరప్ప మొయిలీ, అజయ్ మాకెన్, కుమారి సెల్జా, హరీష్ రావత్, సుబ్బిరామి రెడ్డి, మనీష్ తివారీ, సచిన్ పైలట్, పవన్ కుమార్ బన్సాలీ, మిగతా 2లో

గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్

- నలుగురు మావోయిస్టులు మృతి
- మృతులపై రూ.36 లక్షల రివార్డు





మృతిచెందిన మావోయిస్టులు(ఫైల్)

ప్రజాశక్తి-చింతూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

మహారాష్ట్రలోని గడ్చిరోలి అడవుల్లో మంగళవారం భద్రతా దళాలకు, పోలీసులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మరణించారు. ఎన్‌కౌంటర్ తర్వాత అధికారులు ఎకె-47 రైఫిల్, ఒక కార్బైన్, స్థానికంగా తయారు చేసిన రెండు పిస్టల్స్, నక్సల్ సాహిత్యం, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. చనిపోయిన నలుగురు మావోయిస్టులపై రూ.36 లక్షల రివార్డు ఉన్నట్టు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసిసి) అమలులో ఉన్న నేపథ్యంలో విధ్వంసకర కార్యకలాపాలకు పాల్పడే లక్ష్యంతో కొందరు మావోయిస్టులు ప్రాణహిత నదిని దాటి పొరుగున ఉన్న తెలంగాణ నుంచి గడ్చిరోలిలోకి ప్రవేశించినట్టు సోమవారం మధ్యాహ్నం పోలీసులకు సమాచారమందిందని పోలీసు సూపరింటెండెంట్ నీలోత్పల్ తెలిపారు. గడ్చిరోలి పోలీసుల ప్రత్యేక పోరాట విభాగమైన సి-60కి చెందిన టీమ్‌లు, సిఆర్‌పిఎఫ్ క్విక్ యాక్షన్ టీమ్‌ను ఆ ప్రాంతంలో వెతకటానికి పంపారు. రేపన్‌పల్లి సమీపంలోని కోలమర్క కొండల్లో మంగళవారం ఉదయం సి-60 యూనిట్‌లో ఒకరు సోదాలు నిర్వహిస్తుండగా పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. కాల్పులు ఆగిపోయిన తర్వాత ఆ ప్రాంతంలో నలుగురు మావోయిస్టుల మృతదేహాలు కనిపించాయని ఒక అధికారి తెలిపారు. మరణించిన వారిని మావోయిస్టు పార్టీ డివిసి సభ్యులు వర్గీస్, మంగాతు, ప్లాటూన్ సభ్యులు కుర్సం రాజు, వెంకటేష్‌గా గుర్తించినట్లు చెప్పారు. వీరిలో వర్గీస్ తెలంగాణ రాష్ట్రం మంచిర్యాల డివిజన్ కమిటీ సభ్యునిగా, మంగాతు చెన్నూరు ఏరియా కమిటీ సభ్యునిగా పనిచేస్తున్నారని తెలిపారు.

ఆర్‌టిసి బస్సును ఢీకొన్న అంబులెన్స్

- ఇద్దరు మృతి, ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - తాడిపత్రి రూరల్, చెన్నేకొత్తపల్లి

శ్రీ సత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలంలో సోమవారం అర్ధరాత్రి విషాద ఘటన చోటు చేసుకుంది. అనారోగ్యంతో మరణించిన వ్యక్తిని అంబులెన్స్‌లో ఇంటికి తీసుకు వస్తుండగా ప్రమాదానికి గురై ఇద్దరు మృతి చెందారు. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు..తాడిపత్రి పట్టణం నందలపాడుకు చెందిన షెక్షావలి (47) అనారోగ్యంతో బాధపడుతూ బెంగళూరులోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మరణించారు. మృతదేహాన్ని అంబులెన్స్‌లో తీసుకుని తాడిపత్రికి షెక్షావలి భార్య షేక్ షకీలా (42), అల్లుడు షేక్ గౌస్ (33) బయలు దేరారు. చెన్నేకొత్తపల్లి మండలం నాగసముద్రం గేట్ 44వ జాతీయ రహదారిపై అనంతపురం వైపు వెళ్తుండగా ముందు వెళ్తున్న ఆర్‌టిసి బస్సును అంబులెన్స్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో షకీలా, షేక్‌గౌస్ అక్కడికక్కడే మరణించారు. అంబులెన్స్ డ్రైవర్ సురేష్‌తో పాటు మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీహార్‌లో ఎన్‌డిఎకు ఎదురుదెబ్బ

- బిజెపికి షాకిచ్చిన ఆర్‌ఎల్‌జెపి అధ్యక్షుడు
- కేంద్ర మంత్రి పదవికి పశుపతి పరాస్ రాజీనామా

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడుతున్న తరుణంలో కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ (ఆర్‌ఎల్‌జెపి) అధ్యక్షుడు పశుపతి కుమార్ పరాస్ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేశారు. బీహార్‌లో లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా సీట్ల పంపకం విషయంలో తమ పార్టీని పట్టించుకోకుండా బిజెపి అన్యాయం చేసిందని ఆయన ఆరోపించారు. పశుపతి కుమార్ గ్రూపు వాదనలను పట్టించుకోకుండా బీహార్‌లో లోక్‌సభ సీట్ల పంపకంలో చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని ఎల్‌జెపి(రామ్ విలాస్)కి ఐదు సీట్లను కేటాయించిన బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ దీనిపై ఇప్పటికే ప్రకటన చేసింది. ఈ అంశంపై తీవ్ర అసంతృప్తిగా ఉన్న పశుపతి కుమార్.. ఆ తర్వాత విలేకరుల సమావేశం రోజే కేంద్ర మంత్రి పదవికి రాజీనామా ప్రకటన చేయటం గమనార్హం. తన భవిష్యత్ ప్రణాళిక గురించి ఆయన వివరించలేదు. సీట్ల పంపకం విషయంలో తమ పట్ల వ్యవహరించిన విధానంపై తన అసంతృప్తి గళాన్ని వినిపించటానికి ముందు ప్రధానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. తదుపరి కార్యాచరణను నిర్ణయించటానికి తమ పార్టీ నాయకులం సమావేశమవుతామని ఆర్‌ఎల్‌జెపి అధికార ప్రతినిధి శ్రవణ్ అగర్వాల్ తెలిపారు. పశుపతి కుమార్ ఎన్నికల్లో పోటీ చేస్తారని చెప్పారు.

బాబాయ్, అబ్బాయిల మధ్య బిజెపి చిచ్చు

లోక్‌జనశక్తి పార్టీ (ఎల్‌జెపి)ని వాస్తవానికి కేంద్ర మాజీ మంత్రి రామ్ విలాస్ పాశ్వాన్ 2000లో స్థాపించారు. 2020లో రామ్ విలాస్ మరణం తర్వాత పార్టీని హస్తగతం చేసుకునే విషయంలో రామ్ విలాస్ పాశ్వాన్ తమ్ముడు పశుపతి కుమార్ పరాస్, కుమారుడు చిరాగ్ పాశ్వాన్‌ల మధ్య పోటీ నెలకొన్నది. అనంతరం ఎన్నికల సంఘం (ఇసిఐ) ఎల్‌జెపి పేరును, చిహ్నాన్ని ఎవరికీ కేటాయించకుండా నిలిపివేసింది. తర్వాత పశుపతి కుమార్ ఆర్‌ఎల్‌జెపికి, చిరాగ్ పాశ్వాన్ ఎల్‌జెపి(రామ్ విలాస్)కి నేతృత్వం వహించారు. ఎల్‌జెపికి ఉన్న ఎంపిలు పశుపతి కుమార్‌కు మద్దతిచ్చారు. బిజెపి కూడా కుమార్‌కు బాసటగా నిలిచి, 2021లో కేంద్ర మంత్రి పదవిని కట్టబెట్టింది. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బిజెపి ప్లేటు ఫిరాయించి, చిరాగ్ పాశ్వాన్‌తో సీట్ల ఒప్పందం కుదుర్చుకోవటం గమనార్హం. దీంతో, బిజెపి బీహార్‌లో బాబాయ్, అబ్బాయిల మధ్య చిచ్చు పెట్టిందని చర్చ నడుస్తోంది.

కాంగ్రెస్‌లో చేరిన వైసిపి ఎమ్మెల్యే ఆర్థర్



ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

ఉమ్మడి కర్నూలు జిల్లా నందికొట్కూరు వైసిపి ఎమ్మెల్యే ఆర్థర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల.. పార్టీ కండువా కప్పి ఆయన్ను ఆహ్వానించారు. హైదరాబాద్‌లోని బేగంపేటలో మంగళవారం షర్మిలను ఆర్థర్ కలిసి, కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇటీవల ప్రకటించిన వైసిపి అభ్యర్థుల జాబితాలో ఆర్థర్‌కు టికెట్ దక్కలేదు. ఆయన స్థానంలో సుధీర్ దారాకు టికెట్ దక్కింది. జనవరిలో ప్రకటించిన సమన్వయకర్తల నియామకం సమయంలోనే సుధీర్ దారాను నందికొట్కూరు వైసిపి సమన్వయకర్తగా పార్టీ ప్రకటించింది. ఆ సమయంలోనే ఎమ్మెల్యే ఆర్థర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. 2019 ఎన్నికల్లో ఆర్థర్ 38 వేలకుపైగా ఓట్లతో సమీప టిడిపి అభ్యర్థిపై గెలుపొందారు. శ్రీకాళహస్తి టెంపుల్ మాజీ ఛైర్మన్ పోతుగుంట గురవయ్య నాయుడు కుమారుడు డాక్టర్ పోతుగుంట రాజేష్ నాయుడు కూడా వైఎస్ షర్మిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాజేష్ నాయుడుకు శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రముఖ వైద్యుడిగా గుర్తింపు ఉంది.

వాతావరణ మార్పులతో

ఆందోళనలో ఆక్వా రైతులు

- వైరస్ ఉధృతి, గిట్టుబాటు ధర లేక ఇప్పటికే నష్టాలు



రొయ్యల చెరువులో తిరుగుతున్న ఏరియేటర్లు

ప్రజాశక్తి- కాళ్ల (పశ్చిమగోదావరి)

వాతావరణ మార్పులతో చెరువుల్లో ఆక్సిజన్ కొరత ఏర్పడే ప్రమాదం ఉందని ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. అల్పపీడన ద్రోణి ప్రభావంతో పశ్చిమగోదావరి జిల్లాలో బుధవారం అక్కడక్కడా పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు ఇప్పటికే ప్రకటించారు. ఇప్పటి వరకూ వైరస్ ఉధృతితో నష్టాలు చవిచూసిన వారికి ప్రస్తుతం నేలచూపులు చూస్తున్న ధరలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ప్రస్తుతం వాతావరణం చల్లగా, ఎండ, ఉక్కబోత ఉండడంతో చెరువుల్లో ఆక్సిజన్ లోపించి రొయ్యలు చనిపోయే ప్రమాదం ఉంది. దీంతో, చెరువుల్లో రేయింబవళ్లు ఏరియేటర్లు తిప్పాల్సి వస్తోంది. ఆక్సిజన్ టాబ్లెట్లు వేస్తూ ఆక్సిజన్ కొరత ఏర్పడకుండా చూస్తున్నారు. విద్యుత్ కోత విధిస్తే ప్రత్యామ్నాయంగా జనరేటర్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. చేపల చెరువుల్లో ఆక్సిజన్ లోపించే అవకాశం ఉండడంతో చెరువుల్లో ఉదయాన్నే బోటు తిప్పుతుండడంతో కెరటాలు వచ్చి ఆక్సిజన్ ఉత్పన్నమవుతోంది. చేపలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో అయినకాడికి అమ్ముకుంటున్నారు. వేసవిలో రొయ్యల సాగుకు వాతావరణం అనుకూలంగా ఉండటంతో లక్షలాది రూపాయల పెట్టుబడులతో వనామి రొయ్యల పెంపకం చేపట్టారు. పగలంతా మండే ఎండలు, వేధిస్తున్నా ఉక్కబోతతో చెరువుల్లో ఆక్సిజన్ స్థాయిలు పడిపోతున్నాయి. ఈ తరుణంలో వర్షాలు కురిస్తే ఆక్వా సాగుపై మరింత తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 1,77,862 ఎకరాల్లో ఆక్వా సాగవుతోంది. దీనిలో 79,768 ఎకరాల్లో రొయ్యలు సాగులో ఉన్నాయి. ఒక్క పశ్చిమగోదావరి జిల్లాలో 49,040 వేల ఎకరాల్లో రొయ్యల సాగు ఉంది. ఏటా ఇక్కడి నుంచి దాదాపు మిగతా 2లో

ప్రొద్దుటూరులో మొదటి సభ

- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో భాగంగా ఈ నెల 27న ప్రొద్దుటూరులో మొదటి సభ నిర్వహించనున్నట్లు వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మాజీ మంత్రి పేర్ని నాని, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురామ్‌తో కలిసి ఆయన రూట్ మ్యాప్‌ను మీడియాకు వివరించారు. సిద్ధం సభలు జరిగిన పార్లమెంటు నియోజకవర్గాలు కాకుండా, మిగిలిన ప్రాంతాల్లో ఈ బస్సు యాత్ర ఉంటుందన్నారు. ఇందులో భాగంగా ప్రజలతో సిఎం వైఎస్ జగన్ మమేకమవుతారన్నారు. అలాగే 28న ఆళ్లగడ్డలో రెండో సభ, 29న ఎమ్మిగనూరులో మూడో సభ వుంటుందని తెలిపారు. బహిరంగ సభ జరిగే ప్రాంతాల్లో ప్రజలతో ముఖాముఖి వుంటుందన్నారు. ఈ యాత్ర ఇడుపులపాయ నుంచి ఉత్తరాంధ్ర వరకూ సాగుతుందని తెలిపారు. ఏప్రిల్ 18 వరకూ ఈ బస్సు యాత్ర వుంటుందని, ఆ తర్వాత నామినేషన్‌లు మొదలైనప్పటి నుంచీ ఎన్నికల సభలు వుంటాయని అన్నారు.

యాగంటిలో పుష్ప- 2 షూటింగ్

ప్రజాశక్తి - బనగానపల్లె

నంద్యాల జిల్లా బనగానపల్లె మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం యాగంటి ఉమామహేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం పుష్ప-2 సినిమా షూటింగ్ నిర్వహించారు. పుష్ప-1 క్లైమాక్స్‌లో వచ్చే హీరో వివాహ సన్నివేశం కొనసాగింపుగా వచ్చే సన్నివేశాన్ని యాగంటి దేవస్థానం గుహలో చిత్రీకరించారు. సుకుమార్ దర్శకత్వంలో జరిగిన ఈ షూటింగ్‌లో హీరోయిన్ రష్మిక , నటి రమ్యకృష్ణ, నటుడు అజయ్ తదితరులు పాల్గొన్నారు.

22న తుంగభద్ర బోర్డు భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈనెల 22న తుంగభద్ర బోర్డు సమావేశం విశాఖపట్నంలో జరగనుంది. 14న జరగాల్సి ఉండగా, బోర్డు సభ్యులు అందుబాటులో లేని కారణంగా శుక్రవారానికి వాయిదా పడినట్టు బోర్డు కార్యదర్శి ఓఆర్‌కె రెడ్డి తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర సాగునీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్‌కు లేఖ అందింది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు దైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

కాకినాడ జనసేన ఎంపి అభ్యర్థిగా ఉదయ్ శ్రీనివాస్

- మోడీ, అమిత్ షా చెబితే ఎంపిగా పోటీ
- పిఠాపురంలో భారీ మెజారిటీతో గెలుస్తా
- జనసేన అధినేత పవన్ కల్యాణ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాకినాడ పార్లమెంటు స్థానానికి జనసేన పార్టీ అభ్యర్థిని ప్రకటించింది. ప్రముఖ టీ బ్రాండ్ అయిన టీ టైమ్ యజమాని తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ జనసేన కాకినాడ ఎంపి అభ్యర్థిగా పోటీ చేస్తారని ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ప్రకటించారు. తెలుగుదేశం, బిజెపి పొత్తులో భాగంగా జనసేనకు రెండు పార్లమెంటు స్థానాలు, 21 అసెంబ్లీ స్థానాలు దక్కిన విషయం తెలిసిందే. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పిఠాపురం నియోజకవర్గ నేతలతో పవన్‌కల్యాణ్ మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కాకినాడ ఎంపి అభ్యర్థిని ప్రకటించారు. అధికార పార్టీ వైసిపి పిఠాపురంలో తనను ఓడించేందుకు ఓటుకు రూ.10 వేలు, కుటుంబానికి లక్ష రూపాయలు ఇస్తోందని పవన్‌కల్యాణ్ ఆరోపించారు. కార్యకర్తలంతా వైసిపి కుట్రలను తిప్పికొట్టాలని కోరారు. ఉదయ్ శ్రీనివాస్ తన కోసం ఎంతో త్యాగం చేశారని, భారీ మెజార్టీతో ఆయనను గెలిపించాలని కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. తనను పార్లమెంటుకు పోటీ చేయాలని ప్రధాని నరేంద్ర మోడీ, హోంమంత్రి అమిత్ షా చెబితే ఆలోచిస్తానన్నారు. అప్పుడు పిఠాపురం అసెంబ్లీ నుంచి ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ

ప్రధాని మోడీ పర్యటనపై ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రధాని మోడీ రాష్ట్ర పర్యటనపై ఎన్నికల సంఘానికి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఫిర్యాదు చేసింది. ఈ నెల 17న చిలకలూరిపేటలో జరిగిన సభకు మోడీ ఇండియన్ ఎయిర్‌ఫోర్సు హెలికాప్టర్‌లో హాజరయ్యారు. ఇది ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధమని పేర్కొంది. ఈ మేరకు సిఇఒ ఎంకె మీనాను కలిసి మంగళవారం ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు చేసిన వారిలో కాంగ్రెస్ నాయకులు సోమశేఖర్, జి సురేష్, శివకార్తీక్, శ్రీనివాసరావు ఉన్నారు.

పరాయి పంచన కేంద్రీయ విద్యాసంస్థలు

- పూర్తి కాని అనంతపురంలోని కేంద్రీయ విశ్వవిద్యాలయ భవనాలు
- నేటికీ టెండర్ల దశలోనే విజయనగరంలోని గిరిజన విశ్వవిద్యాలయం
- వసతుల కొరతతో విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు



నిర్మాణంలో ఉన్న కేంద్రీయ విశ్వవిద్యాలయం



గిరిజన యూనివర్సిటీ నిర్మాణానికి సేకరించిన స్థలం

ప్రజాశక్తి- అనంతపురం, విజయనగరం ప్రతినిధులు

విభజన చట్టం ప్రకారం రాష్ట్రంలో ఏర్పాటు చేయాల్సిన అత్యున్నత విద్యా సంస్థలు నేటికీ పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదు. కొన్ని అరకొర సౌకర్యాల మధ్య నడుస్తున్నాయి. అనంతపురంలోని కేంద్రీయ విశ్వవిద్యాలయం భవనాలు ఇంకా నిర్మాణ దశలోనే ఉన్నాయి. విజయనగరం జిల్లాలోని గిరిజన విశ్వవిద్యాలయం టెండర్ల స్థాయిలోనే ఉంది. యువతలో నైపుణ్యాన్ని వెలికితీసి, మంచి భవిష్యత్తు అందించేందుకు రాష్ట్రానికి 11 అత్యున్నత విద్యా సంస్థలను ఇచ్చామని పల్నాడు జిల్లా బొప్పూరులో ఈ నెల 17న బిజెపి, టిడిపి, జనసేన ఆధ్వర్యాన జరిగిన ప్రజాగళం బహిరంగ సభలో మోడీ గొప్పగా చెప్పుకొచ్చారు. అయితే, పదేళ్లు కావస్తున్నా వీటిలో కొన్ని పరాయి పంచనే కొనసాగుతున్నాయి. అనంతపురంలోని కేంద్రీయ విశ్వవిద్యాలయం భవనాలు నేటికీ పూర్తి కాలేదు. నిధుల మంజూరులో జాప్యమే ఇందుకు కారణం. జెఎన్‌టియులోని ఇంక్యుబేషన్ భవనంలో 2018లో తాత్కాలిక భవనంలో విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించారు. విద్యార్థుల సంఖ్య పెరగడంతో హాస్టల్, తరగతి గదుల కోసం పది కిలోమీటర్ల దూరంలోని ఒక ప్రయివేటు ఇంజనీరింగు కళాశాలలో ట్రాన్సిట్ క్యాంపస్ ఏర్పాటు చేశారు. కేంద్రీయ విశ్వవిద్యాలయం భవనాలు పూర్తవలేదు. 2022-23లో రూ.12.82 కోట్లు, 2023-24లో రూ.112.08 కోట్లు మాత్రమే కేంద్రం కేటాయించింది. ఈ నిధులతోనే ఒక అడకమిక్ బ్లాక్, రెండు హాస్టల్ భవనాల నిర్మాణం జరుగుతోంది. తక్కినవి మలి దశలో చేపడతామని చెబుతున్నారు. ప్రస్తుతం అడకమిక్, రెండు హాస్టల్ భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి. 2024-25 సంవత్సరానికి సంబంధించి ప్రవేశపెట్టిన ఇంటీరియమ్ బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించలేదు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఆగస్టు నాటికి బుక్కరాయసముద్రం మండలంలోని జంతలూరు వద్ద ఏర్పాటవుతున్న శాశ్వత భవనాల్లోకి మారుతామని విశ్వవిద్యాలయం పాలకవర్గం చెబుతున్న మాటలు కార్యరూపం దాల్చేలా కనిపించడం లేదు. విశ్వవిద్యాలయం పరిధిలో నాలుగు అండర్ గ్రాడ్యుయేషన్ (యుజి), తొమ్మిది పోస్టు గ్రాడ్యుయేషన్ (పిజి) కోర్సులు నడుస్తున్నాయి. 450 మంది విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. వచ్చే ఏడాది ఈ కోర్సులను రెట్టింపు చేయనున్నట్టు విశ్వవిద్యాలయం పాలకవర్గం ప్రకటించింది. అయితే, ఇప్పుడున్న కోర్సులకే తగినంత సిబ్బంది లేరు. పది మంది రెగ్యులర్ బోధనా సిబ్బంది, 28 మంది అతిథి అధ్యాపకులు ఉన్నారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఫీజులు రెండు వేల రూపాయల లోపే ఉండగా, అనంతపురంలోని కేంద్రీయ విశ్వవిద్యాలయంలో రూ.7 వేల నుంచి రూ.37 వేల వరకు ఉన్నాయి.

నాలుగైదు చోట్ల భూమి పరిశీలించి చివరికి విజయనగరం జిల్లా మెంటాడ మండలం కుంటినవలస మధుర గ్రామం చినమేడపల్లి, దత్తిరాజేరు మండలం మర్రివలసలో గిరిజన యూనివర్సిటీ కోసం భూమిని కేంద్ర ప్రభుత్వం ఖరారు చేసింది. 561.91 ఎకరాల భూమిని సేకరించారు. నిర్మాణ పనులకు గత ఏడాది ఆగస్టు 25న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ శంకుస్థాపన చేశారు. ఇప్పటికి ఏడు నెలలు దాటినా ఇంకా రూ.430 కోట్ల విలువైన పనులు టెండర్ల దశలో ఉన్నట్లు సమాచారం. విజయనగరం సమీపంలోని గాజులరేగ సమీపంలో పాత ఎయు క్యాంపస్‌లో ప్రస్తుతం తరగతులు నిర్వహిస్తున్నారు. కెమిస్ట్రీ, బోటనీ, బయోటెక్నాలజీ వంటి సైన్స్ కోర్సులతోపాటు బిజినెస్, టూరిజం వంటి మేనేజ్‌మెంట్ కోర్సులు, ఇంగ్లీషు, సోషల్ వర్క్, సోషియాలజీ, ట్రైబల్ స్టడీస్ వంటి 12 డిపార్ట్‌మెంట్లలో 14 రకాల కోర్సులు అందుబాటులో ఉన్నా ఒక్క డిపార్ట్‌మెంట్‌లోనూ పూర్తి స్థాయిలో అధ్యాపకులు లేరు. అరకొరగా ఉన్న వారిలో ఎక్కువమంది కాంట్రాక్టు, గెస్ట్ అధ్యాపకులే. మరికొన్ని కోర్సుల ఏర్పాటుకు అనుమతులు లభించినా వసతి సమస్య వల్ల ముందుకు సాగలేని పరిస్థితి. సరైన వసతులు లేవు. లేబొరేటరీలు కంటైనర్లలో నడుస్తున్నాయి. తగినంత లైబ్రరీ లేదు. దీంతో, కొన్ని సందర్భాల్లో రీసెర్చ్‌ల కోసం సెంచూరియన్ ప్రయివేట్ యూనివర్సిటీపై ఆధారపడాల్సి వస్తోంది. తరగతులు ఒకచోట, ప్రయోగాలు మరోచోట, పరిశోధనలు ఇంకోచోట జరుగుతుండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హాస్టల్ నిర్వహణకు నిధులు ఉన్నప్పటికీ అందుకు తగ్గ భవనం లేదు. దీంతో, సమీపంలోని సీతం కాలేజీ యాజమాన్యంతో ఒప్పందం కుదుర్చుకుని అక్కడ కూడా 50 మంది విద్యార్థులకు మాత్రమే హాస్టల్ సదుపాయం కల్పించారు. మిగిలిన విద్యార్థులు ప్రయివేటు హాస్టళ్లలో ఉరంటున్నారు. ఈ నేపథ్యంలో గడిచిన రెండేళ్లగా అడ్మిషన్లు తగ్గిపోయాయి.

నిధులు కేటాయించాలి

అనంతపురం కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటై ఏడు సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటికీ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. పూర్తి స్థాయిలో నిధులు కేటాయించి భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలి. పూర్తి స్థాయిలో బోధనా సిబ్బందిని నియమించాలి.

-పరమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనంతపురం

పటిష్టంగా ఎన్నికల కోడ్ అమలు

- పార్టీల ప్రచారాల్లో పాల్గొంటే అధికారులపై వేటు : సిఎస్ జవహర్ రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికల కోడ్‌ను రాష్ట్రంలో పటిష్టంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డి ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రచారాల్లో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సచివాలయంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాతో కలిసి కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై మంగళవారం ఆయన సమీక్షించారు. ఎన్నికల పరిశీలకులుగా వెళ్తున్న అధికారులంతా ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ వెబ్‌సైట్లన్నింటిలో ప్రజా ప్రతినిధులకు సంబంధించిన ఫొటోలను, ఫ్లెక్సీలను తొలగించాలని, ప్రభుత్వ ఆస్తులపై గల రాజకీయపరమైన ప్రకటనలనూ తొలగించాలని కార్యదర్శులను ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి సంబంధించి సిఇఒ ఇచ్చే ప్రత్యేక ఫార్మాట్‌లో నివేదిక ఇవ్వాలన్నారు. సిఇఒ ఎంకె మీనా మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక బడ్జెట్ ప్రొవిజన్ ఉన్నప్పటికీ కొత్త ప్రాజెక్టులు, పథకాలు, రాయితీలు, గ్రాంట్ల మంజూరు, హామీలు, శంకుస్థాపనలు పూర్తిగా నిషేధమని ఆయన స్పష్టం చేశారు. పనులు పూరైన వాటికి నిధుల విడుదలలో ఎలాంటి నిషేధం లేదన్నారు. అలాగే వివిధ రకాల పింఛన్ల పంపిణీకి ఎలాంటి అభ్యంతరాలు లేవని చెప్పారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై ప్రజా ప్రతినిధులు ఎలాంటి సమీక్షలు, వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించకూడదన్నారు. మంత్రులెవరూ అధికారిక వాహనాలను ఎన్నికల ప్రచారం కోసం వినియోగించకూడదని వివరించారు. ప్రభుత్వ భవనాలు, కార్యాలయాల్లో ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి సహా మంత్రుల ఫొటోలు ఉండకూడదన్నారు. వివిధ రకాల బిల్లులు, సర్టిఫికెట్లపైనా ప్రజా ప్రతినిధుల ఫొటోలు ఉండకూడదని సిఇఒ స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు ఏ రాజకీయ పార్టీకైనా అనుకూలంగా వ్యవహరించినా, బహుమతులు, ఇతర లబ్ధి పొందినా అటువంటి వారిపై చర్యలు ఉంటాయని మీనా పేర్కొన్నారు. సమావేశం లో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు ప్రవీణ్ కుమార్, వై శ్రీలక్ష్మి, కె విజయానంద్, ఎమ్‌టి కృష్ణబాబు, అనంతరాము, శశిభూషణ్ కుమార్ పాల్గొన్నారు.

వలంటీర్ తొలగింపు

ప్రజాశక్తి- మెళియాపుట్టి (శ్రీకాకుళం జిల్లా)

ఎన్నికల నిబంధనావళిని ఉల్లంఘించిన శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టికి చెందిన వలంటీర్‌ను తొలగించారు. మెళియాపుట్టిలో ఈ నెల 18న వైసిపి ఎమ్మెల్యే రెడ్డిశాంతి కుమారుడు శ్రావణ్‌కుమార్ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మెళియాపుట్టి సచివాలయం ఆరో క్లస్టర్ పరిధిలో పని చేస్తున్న ఎం.మణికంఠ పాల్గొన్నారని ఆరోపణలు రావడంతో అధికారులు విచారణ చేపట్టారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు రుజువు కావడంతో మణికంఠను విధుల నుంచి తొలగించారు. ఈ మేరకు ఎంపిడిఒ జి.భాస్కరరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అప్పుడు పాచిన లడ్డూ.. ఇప్పుడు అభివృద్ధి కోసం...

మోడీపై మాట మార్చిన పవన్ కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తెలుగు రాష్ట్రాన్ని బిజెపి ప్రభుత్వం ముక్కలు చేసిందనే వేదన తెలుగు ప్రజల్లో ఉందని, ఆయన ప్రధాని అయినందువల్ల బాధ కలుగుతోందని, ఆయన వల్ల రాష్ట్రానికి ఒరిగేందేమీ లేదని మోడీని ఉద్దేశించి వ్యాఖ్యానించిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇప్పుడు మాట మార్చారు. ఆయన రాక తెలుగు ప్రజలకు గంగమ్మతల్లి వచ్చి జీవాన్నిచ్చినట్లు ఉందని వ్యాఖ్యానించారు.

2014 తరువాత ప్రత్యేక హోదా ఇవ్వలేదని, తాను బిజెపికి దూరమవుతున్నానని చెప్పిన పవన్ కల్యాణ్.. రాష్ట్రానికి బిజెపి ఏమిచ్చిందో చెప్పకుండానే మరలా బిజెపితో కలిసినట్లు ప్రకటించారు. పొగడ్తల వర్షం కురిపించారు. పోలవరం, ప్రత్యేక హోదా వంటి అంశాలను పవన్ ప్రస్తావించలేదు.

అప్పుడేమన్నారు... నేరుగా పవన్ మాటల్లో...



'తెలుగు ప్రజలను బిజెపి రెండుగా చీల్చింది. దీనిపై గుండెల్లో వేదన ఉంది. నరేంద్ర మోడీ ప్రధాని అవగానే పవన్ కల్యాణ్‌ను మర్చిపోయారు. దేశానికి ప్రధాని అయితే మంచి రోజులు వస్తాయని ఆశపడ్డాం. ఇప్పుడు బాధ కలుగుతోంది. స్పెషల్ కేటగిరి స్టేటల్ ఎందుకు ఇవ్వలేదు. పోలవరం ఎందుకు కట్టరు. రైతులకు ఎందుకు అండగా నిలబడరు. చంద్రబాబుపై కోపం ఉంటే ఆయనపై చూపించుకోండి. రాష్ట్ర ప్రజలపై చూపిస్తే ఎలా? బిజెపిని పల్లకి ఎక్కిస్తే నేడు దొడ్డిదారిన వైసిపికి అండగా నిలబడ్డారు. తాము అధికారంలోకి వస్తే మూడు నాలుగేళ్లలో హోదా ఇస్తామని చెప్పారు. తీపికబురు వస్తుందని ఎదురు చూస్తే రెండు లడ్డూలు ఇచ్చారు. అవి పాచిపోయిన లడ్డూలు ఎవరికి కావాలి. మీ లడ్డూల కంటే బందరు లడ్డులు, కాకినాడ తాపేశ్వరం కాజాలు ఇంకా బాగుంటాయి.

ప్రజాగళంలో ఇప్పుడేమన్నారు...



అభివృద్ధి లేక అప్పులతో, పాలకుల దాష్టీకంతో, దోపిడీతో, అవినీతితో, అప్రజాస్వామిక విధానాలతో కొట్టుమిట్టాడుతున్న ఆంధ్ర ప్రజానీకం ప్రధాని నరేంద్ర మోడీ కోసం ఎదురుచూస్తోంది. అమరావతి దేదీప్యమానంగా వెలగాలని, దానికి అండగా ఉన్నానని చెప్పడానికి మోడీ వచ్చారు. భుజం కాయడానికి వచ్చిన మోడీకి.. ఐదుకోట్ల మంది ప్రజల కోసం వచ్చిన మోడీకి కరతాళధ్వనులతో స్వాగతం. 2014లో తిరుపతి బాలాజీ వెంకటేశ్వరస్వామి సాక్షిగా ఈ పొత్తు మొదలైంది. 2024లో బెజవాడ కనకదుర్గమ్మ సాక్షిగా పొత్తు వేరేరూపం తీసుకోబోతోంది.

ఆందోళనలో ఆక్వా రైతులు

(మొదటిపేజీ తరువాయి)

15 లక్షల మెట్రిక్ టన్నుల ఆక్వా ఎగుమతులు జరుగుతున్నాయి. రూ.14 వేల కోట్లకుపైగా ఆదాయం తెచ్చి పెడుతోంది. ఆక్వా సాగులో అధిక దిగుబడులు సాధిస్తూ ఎగుమతుల్లో మొదటి స్థానంలో ఉండే పశ్చిమగోదావరి జిల్లా రైతులు ప్రస్తుతం దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

విద్యుత్ సబ్సిడీ ఎత్తివేతతో అధికంగా బిల్లులు

జోన్ల పేరుతో విద్యుత్ సబ్సిడీని ప్రభుత్వం తొలగించడంతో అక్వా రైతులపై ఆర్థిక భారం పడింది. గతంలో ఎకరా విస్తీర్ణంలో రొయ్యల చెరువు సాగు చేస్తే రూ.4 వేల నుంచి రూ.5 వేల విద్యుత్ బిల్లులు వచ్చేవి. ఇప్పుడు రూ.10 వేల నుంచి రూ.13 వేలు వస్తోంది. మరోవైపు మేత ధరలు సగటున కిలోకు రూ.27కు పైగా పెరిగాయి. వ్యాపారులు సిండికేట్‌గా మారి 100 నుంచి 80 కౌంట్ రొయ్యలను కిలోకు రూ.15 నుంచి రూ.25 వరకు తగ్గించి కొనుగోలు చేస్తున్నారని ఆక్వా రైతులు చెప్తున్నారు. పెరుగుతున్న ఖర్చులు, పతనమవుతున్న రొయ్యల ధరలు, వైరస్‌ల దాడితో ఆక్వా రైతులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ప్రస్తుత గడ్డు పరిస్థితుల్లో రొయ్యల సాగు కంటే చేపల పెంపకమే మేలనే నిర్ణయానికి రైతులు వస్తున్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి చూపుతున్న ఆక్వా రంగం ప్రస్తుతం గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటోంది.

పెరిగిన పెట్టుబడులు

గతంలో ఎకరాలో 80 వేల నుంచి లక్ష రొయ్య పిల్లలను వేసేశారు. ప్రస్తుతం 40 వేల నుంచి 50 వేల పిల్లలను మాత్రమే వేస్తున్నారు. పది ఎకరాల్లో రొయ్య పిల్లలు వేసి 40, 50 కౌంట్ వరకు పెంచాలంటే ఖర్చు రూ.40 లక్షలు దాటేస్తుంది. దీంతో, కొంతమంది చేపల సాగువైపు మళ్లుతున్నారు. రొయ్యలకు గిట్టుబాటు కల్పించాలని, విద్యుత్ రాయితీ ఇవ్వాలని, విపరీతంగా పెరిగిన మేతల ధరలను అదుపులోకి తీసుకురావాలని ఆక్వా రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

ఆక్వా రంగం సంక్షోభంలో పడింది. విద్యుత్ సబ్సిడీ, గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. మేత, మందులు అప్పు ఇచ్చే అవకాశం లేదు. ఫీడ్, మందుల కంపెనీ యజమానులతో రాష్ట్ర ప్రభుత్వం మాట్లాడి వాటి ధరలు తగ్గిస్తే రైతులకు వెసులుబాటు కలుగుతుంది. రొయ్య పిల్లలు అందించే హేచరీలు నాణ్యమైన రొయ్యలు అందించే చర్యలు చేపట్టాలి. ఎగుమతిదారులు వంద కౌంటు ధర రూ.250 కల్పిస్తే రైతులకు ఊరట కలుగుతుంది. లేకుంటే చిన్న రైతులు ఆక్వా సాగును విరమించాల్సి వస్తుంది.

- చేకూరి పుల్లంరాజు, ఆక్వా రైతు, ప్రాతళ్లమెరక.

ఏరియేటర్లు నిరంతరం తిప్పాలి

ఆక్సిజన్ కొరత నివారణకు చెరువులో హైడ్రోజన్ పెరాక్సైడ్ తగు మోతాదులో పిచికారీ చేయాలి. వేసవిలో ఉక్కబోత, ఎండ, చల్లని వాతావరణం ఉన్నప్పుడు ఏరియేటర్లు నిరంతరం తిప్పాలి. బోట్లు, ఆయిల్ ఇంజన్లు ఏర్పాటు చేసి చెరువులోని నీటిని రీసైక్లింగ్ చేయడం ద్వారా కెరటాలు రావడంతో ఆక్సిజన్ ఉత్పన్నమవుతుంది. మేత తక్కువగా వేయాలి.

- ఎం.ఇందిరా ప్రియదర్శిని, మత్స్యశాఖ అధికారి, కాళ్ల

సిపిఎం రాష్ట్ర కార్యాలయం వద్ద జెండా తొలగింపు

- గోడపై రాసిన పార్టీ పేరునూ తొలగించాలని ఆదేశం
- జిల్లా కలెక్టరుకు పార్టీ ఫిర్యాదు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయవాడలోని సిపిఎం రాష్ట్ర కార్యాలయ జెండాను ఎన్నికల కోడ్ పేరుతో మున్సిపల్ అధికారులు తొలగించారు. దీంతోపాటు పార్టీ ప్రణాళికకు సంబంధించి ప్రధాన కార్యాలయ గోడకు ఆనించి పెట్టిన బ్యానర్‌నూ 17వ తేదీ అర్ధరాత్రి తొలగించారు. అంతేకాకుండా పార్టీ కార్యాలయంపై రాసి ఉన్న సిపిఎం పేరునూ తొలగించాలని, లేదా కప్పివేయాలని స్థానిక అధికారులు హెచ్చరించారు.

దీనిపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పేరుతో కార్యాలయంలో ఇలాంటి చర్యలకు దిగడం సరికాదని, వారిపై తగు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారిగా ఉన్న ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. కాపీని చీఫ్ ఎలక్టోరల్ అధికారికి పంపారు. ఇటువంటి చర్యలు ఎన్నికల కోడ్‌లో ఎక్కడా లేవని, పబ్లిక్ ప్రాపర్టీలో ఎన్నికల ప్రచారం చేయకూడదని ఉందే తప్ప రాష్ట్ర కమిటీ ఆఫీసుల్లో జెండాలు పీకాలని పేర్కొనలేదని అన్నారు. జెండాలు పీకడం చట్ట విరుద్ధమని దీనిపై తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

2 పార్లమెంటు, 15 అసెంబ్లీ స్థానాల్లో పోటీ

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికల్లో రెండు పార్లమెంటు, 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సిపిఐ పోటీ చేయనుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ వెల్లడించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇండియా ఫోరంలో వున్న సిపిఎం, కాంగ్రెస్ పార్టీలతో కలిసి ఈ ఎన్నికల్లో పోటీ చేస్తామని తెలిపారు. కాంగ్రెస్, సిపిఎంతో చర్చించాక పోటీ చేసే అభ్యర్థుల వివరాలను, నియోజకవర్గాల పేర్లను వెల్లడిస్తామని పేర్కొన్నారు.

డిఎస్‌సి వాయిదా వేయాలని లేఖ

రాష్ట్రంలో ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 30 వరకు నిర్వహించనున్న డిఎస్‌సి పరీక్షను వాయిదా వేయాలని సిపిఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు సిఇఒకు రామకృష్ణ లేఖ రాశారు. రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియతోపాటు, పదోతరగతి స్పాట్ వాల్యుయేషన్, డిఎస్‌సి నిర్వహణ ఒకే సమయంలో నిర్వహిస్తే సమస్యలు వచ్చే అవకాశం వుందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకూ డిఎస్‌సిని వాయిదా వేయాలని కోరారు.

టిడిపి కార్యకర్త హత్య

- వైసిపి వారే ఈ దారుణానికి ఒడిగట్టారని ఫిర్యాదు

ప్రజాశక్తి- గిద్దలూరు, గిద్దలూరు రూరల్ (ప్రకాశం జిల్లా)



హత్యకు గురైన మునెయ్య (ఫైల్ ఫొటో)

ప్రజాగళం సభకు గ్రామస్తులను తీసుకెళ్లాడనే కారణంతో టిడిపి కార్యకర్తను వైసిపి వారు హత్య చేశారు. ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి పోలీసులకు అందిన ఫిర్యాదు ప్రకారం... గడికోట పంచాయతీ పరమేశ్వర్ నగర్‌కు చెందిన టిడిపి కార్యకర్త పాముల మునెయ్య (39) గిద్దలూరు అటవీ శాఖ పరిధిలో తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఆదివారం జరిగిన చిలకలూరిపేటలోని ప్రజాగళం సభకు గ్రామంలోని పలువురితో కలిసి వెళ్లారు. ఇటీవల మేదరమెట్లలో వైసిపి ఆధ్వర్యాన జరిగిన సిద్ధం సభకు గ్రామం నుంచి ఎక్కువ మంది వెళ్లలేదు. సిద్ధం సభకు రాని వారిని ప్రజాగళం సభకు మునెయ్య తీసుకెళ్లడం పట్ల అదే గ్రామానికి చెందిన వైసిపి నాయకులు గుండాల చిన్న అల్లూరయ్య, అతని కుమారులు గుండాల ఈశ్వరయ్య, గుండాల ప్రేమ్‌కుమార్, మేనల్లుడు కొమ్ము రంగనాయకులు కక్షతో సోమవారం రాత్రి ఇంటిలో నిద్రిస్తున్న మునెయ్యపై గొడ్డళ్లతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన ఆయనను కుటుంబసభ్యులు గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని వైద్యశాలకు తరలించగా పరిస్థితి విషమించి మంగళవారం ఉదయం మృతి చెందాడు. మునెయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సిఐ సోమయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- ఐసిడిఎస్ డైరక్టరుకు అంగన్‌వాడీ యూనియన్ వినతి
- మంత్రి బొత్సకు అభినందనలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అంగన్‌వాడీల సమ్మెకాలం 42 రోజులకు వేతనాలు ఇవ్వాలని జిఓ నెంబరు 12, ఇతర సమస్యల పరిష్కారం కోసం జిఓ నెంబరు 10 జారీ చేసిన నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) అభినందనలు తెలిపింది. ఈ మేరకు యూనియన్ ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ, నాయకులు దుర్గ తదితరులు మంగళవారం మంత్రిని కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ మట్టి ఖర్చులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర విషయాలపైనా జిఓలు ఇవ్వాలని కోరారు.

ఇంటింటికీ 'పాంచ్ న్యాయ్'

(మొదటిపేజీ తరువాయి)

రాజీవ్ శుక్లా, జైరాం రమేష్ తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ దేశం మార్పును కోరుకుంటోందని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రకటించిన 'హామీలు' 2004 నాటి 'ఇండియా షైనింగ్' నినాదంతో సమానమని ఎద్దేవా చేశారు. పార్టీ మేనిఫెస్టోలో లేవనెత్తిన ప్రతి అంశాన్ని దేశవ్యాప్తంగా ప్రతి గ్రామం, పట్టణం, ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని పార్టీ నాయకులు, కార్యకర్తలందరినీ సూచించారు.

రైతులు, మహిళలు, యువత, బలహీన వర్గాలే లక్ష్యంగా పాంచ్ న్యాయ్ రూపుదిద్దుకుందన్నారు. 'హిస్సేదారి న్యాయ్', 'కిసాన్ న్యాయ్', 'నారీ న్యాయ్', 'శ్రామిక్ న్యాయ్', 'యువ న్యాయ్' పేరిట హామీలను ప్రకటించారు. పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం, రైతులకు వడ్డీలేని రుణాలు, ప్రస్తుతం కేంద్రం అందిస్తున్న సాయం పెంపు, యువత కోసం 30 లక్షల కొత్త ఉద్యోగాల కల్పన , ప్రభుత్వ లేక ప్రైవేట్ రంగంలో 25 ఏళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న ప్రతి డిప్లొమా లేక డిగ్రీ హోల్డర్లు కు అప్రెంటిస్ షిప్ శిక్షణకు రూ.లక్ష సాయం, 30 ఏళ్లలోపు యువత స్టార్టప్లకు నిధులు సమకూర్చడానికి రూ.5,000 కోట్ల కార్పస్ ఫండ్ ఏర్పాటు, పేపర్ లీకేజీల నివారణకు ప్రత్యేక చట్టం, మహిళల కోసం నిరుపేద కుటుంబంలోని ఒక మహిళకు ఏడాదికి రూ. లక్ష సాయం వంటి 25 హామీలపై చర్చించి తుది నిర్ణయం తీసుకున్నారు.

మేనిఫెస్టోలోని 25 గ్యారంటీలు

హిస్సేదారి న్యాయ్: 1. సామాజిక, ఆర్థిక కుల గణన 2. ఎస్సి, ఎస్టి, ఒబిసిల రిజర్వేషన్ల కల్పనపై 50శాతం సీలింగ్ తొలగింపు 3. ఎస్సి, ఎస్టి సబ్ ప్లాన్ కోసం ప్రత్యేక బడ్జెట్ 4. జల్ జంగిల్ జమీన్ పై చట్టబద్ధహక్కులు 5. గిరిజనులు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను షెడ్యూల్డ్ ఏరియాలో గుర్తింపు

కిసాన్ న్యాయ్ : 1. స్వామినాథన్ ఫార్ములా ప్రకారం పంటలకు గిట్టుబాటు ధర చట్టబద్ధత 2. రుణమాఫీ కమిషన్ ఏర్పాటు 3. పంట నష్టపోయిన 30 రోజుల్లో బీమా పరిహారం చెల్లింపు గ్యారెంటీ 4. రైతులు లబ్ధి పొందేలా ఎగుమతి దిగుమతి విధానం 5. వ్యవసాయ పరికరాలపై జిఎస్టి మినహాయింపు

శ్రామిక్ న్యాయ్ : 1. వైద్య హక్కు చట్టం 2. రోజుకు రూ.400 కనీస వేతనం. ఉపాధి హామీ పథకంలో సైతం 3. పట్టణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం అమలు 4. అసంఘటిత రంగ కార్మికులకు జీవిత బీమా యాక్సిడెంట్ బీమా 5. ప్రభుత్వంలో కాంట్రాక్టు ఉద్యోగాల నియామకాలు నిలుపుదల

యువ న్యాయ్: 1. కేంద్ర ప్రభుత్వంలో 30 లక్షల ఉద్యోగాల భర్తీ 2. యువతకు ఏడాది అప్రెంటిస్ట్ షిప్ - ఏడాదికి లక్ష రూపాయలు లేదా నెలకు 8500 చెల్లింపు 3. పేపర్ లీక్ అరికట్టేందుకు కఠినమైన చట్టం 4. గిగ్ వర్కర్ల సామాజిక భద్రతకు చర్యలు 5. యువత స్టార్టప్ కోసం ఐదు వేల కోట్లతో నిధి

నారీ న్యాయ్: 1. ప్రతి పేద కుటుంబంలోని ఒక మహిళకు ఏడాదికి లక్ష రూపాయలు 2. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు 3. ఆశ అంగన్వాడి మిడ్ డే మీల్ వర్కర్లకు డబుల్ శాలరీ కాంట్రిబ్యూషన్ 4. మహిళల హక్కుల రక్షణ కోసం అధికారి మైత్రి ఏర్పాటు 5. వర్కింగ్ విమెన్ కోసం సావిత్రిబాయి పూలే పేరుతో రెట్టింపు హాస్టల్స్.

షిప్‌యార్డు ప్రయివేటీకరణతో తీవ్ర నష్టం

- విశాఖలో విశ్రాంత ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - గ్రేటర విశాఖ బ్యూరో

షిప్‌యార్డును ప్రయివేటీకరిస్తే తీవ్ర నష్టం వాటిల్లుతుందని, అందులోని ఉద్యోగులకు, పెన్షనర్లకు అన్యాయం జరుగుతుందని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.హుస్సేన్ అన్నారు. షిప్‌యార్డు ప్రయివేటీకరణ చర్యలను నిరసిస్తూ మంగళవారం షిప్‌యార్డు ఆవరణలో సంఘం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షిప్‌యార్డు మనుగడ ఐదు ఎఫ్ఎస్ఎస్‌ల నిర్మాణంలోనే ఉందని, దీన్ని ప్రయివేట్‌వాళ్లకు అప్పగించే కుట్రలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విశ్రాంత ఉద్యోగులను యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. హయ్యర్ పెన్షన్ రాక వేలాది మంది అవస్థలు పడుతున్నారని తెలిపారు. పలువురు పెన్షనర్లు మాట్లాడుతూ.. 1997 నుంచి 2000 వరకూ పిఎఫ్ మొత్తానికి షిప్‌యార్డు యాజమాన్యం కోత విధించిందని, దీని వల్ల నాలుగు శాతం నష్టం జరిగిందని తెలిపారు. పిఎఫ్, గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ మొత్తాలను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. గోవా షిప్‌యార్డులో మాదిరిగా రిటైర్‌మెంట్ అయిన వారి కుటుంబ సభ్యులకు వైద్య సదుపాయాలు అందేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు. షిప్‌యార్డు బోర్డు ఆఫ్ కమిటీ సమావేశం జరగనున్న నేపథ్యంలో ఈ ఆందోళన చేపట్టారు.



నిరసన తెలుపుతున్న పెన్షనర్లు

హిందుస్థాన్ షిప్‌యార్డుపై నేడు కీలక భేటీ!

విశాఖపట్నం హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్) బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశం బుధవారం జరగనుంది. షిప్‌యార్డు మనుగడకు అతి కీలకమైన సుమారు రూ.19 వేల కోట్ల విలువైన ఫ్లీట్ సపోర్టు షిప్ (ఎఫ్ఎస్ఎస్)ల నిర్మాణం ఆర్డర్ గురించి బోర్డు సమావేశం చర్చిస్తుందా? లేదా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఎఫ్ఎస్ఎస్‌ల నిర్మాణం షిప్‌యార్డు చేయగల సామర్థ్యం ఉన్నప్పటికీ సంవత్సరాల తరబడి కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ ఆర్డర్ ఇచ్చినట్టే ఇచ్చి నిర్మాణ పనులను నిలుపుదల చేసిన విషయం తెలిసిందే. ఇటీవలే అదానీ పోర్ట్స్‌కు చెందిన ప్రతినిధి షిప్‌యార్డు పర్యటన చేసి వెళ్లారు. దీనిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. తాజాగా 20న జరగనున్న సిఎస్ఆర్ కమిటీ, 63వ ఆడిట్ కమిటీ, 424వ బోర్డు మీటింగ్‌లో షిప్‌యార్డు చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ హేమంత్ ఖత్రీ పలు అంశాలను అడ్రస్ చేయనున్నారు. ఇప్పటికే కేంద్ర సర్కారు ఆదేశాలతో షిప్‌యార్డుకు ఇండిపెండెంట్ డైరెక్టర్ దేవీప్రసాద్ శెట్టి మంగళవారం విచ్చేశారు. బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ జరిగే పలు సమావేశాల్లో ఆయన పాల్గొననున్నారు. ఆయన పర్యటన 21 వరకూ ఉంటుంది. 19, 20, 21 తేదీల్లో షిప్‌యార్డులోని పలు దఫాల భేటీలు జరగనున్నాయి.


స్క్రైబ్ సహాయంతో పరీక్ష రాస్తున్న వికలాంగ విద్యార్థి

ఎట్టకేలకు వికలాంగ విద్యార్థికి స్క్రైబ్

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి - చిలమత్తూరు (సత్యసాయి జిల్లా)

ఎట్టకేలకు వికలాంగ విద్యార్థికి విద్యాశాఖ అధికారులు స్క్రైబ్‌ను కల్పించారు. శ్రీ సత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం కోడూరుకు చెందిన పదో తరగతి విద్యార్థి వరుణ్‌కుమార్‌రెడ్డి వికలాంగుడు (ఇంటాక్టువలీ డిసబులిటీ). పరీక్ష రాసేందుకు మరొకరి సహాయం (స్క్రైబ్) లేకపోవడంతో సోమవారం పరీక్ష రాయలేకపోయాడు. ఈ విషయంపై ప్రజాశక్తిలో ప్రచురితమైన 'ఎచ్ఎం తప్పిదంతో పరీక్ష రాయలేకపోయిన వికలాంగ విద్యార్థి' వార్తకు ఎంఆర్‌సి అధికారులు స్పందించారు. శ్రీ సత్యసాయి జిల్లా డిఇఒతో మాట్లాడి విద్యార్థికి స్క్రైబ్‌ను ఏర్పాటు చేసేలా అనుమతి తీసుకున్నారు. దీంతో తొమ్మిదో తరగతి విద్యార్థి సహాయంతో వరుణ్‌కుమార్‌రెడ్డి మంగళవారం పరీక్ష రాశారు. చిలమత్తూరు బి సెంటర్‌లోని మరో విద్యార్థికి ఆ సెంటర్ చీఫ్ ఈశ్వర్ ప్రసాద్ అనుమతితో తొమ్మిదో తరగతి విద్యార్థిని స్క్రైబ్‌గా అనుమతించారు. విద్యార్థుల సమస్యలపై ప్రజాశక్తి చూపిన ప్రత్యేక చొరవ అభినందనీయమని పలువురు ప్రశంసించారు.

ప్రొద్దుటూరు ఎమ్మెల్యే ప్రచారాన్ని అడ్డుకున్న ఎన్నికల అధికారులు

- 38వ వార్డు కౌన్సిలర్‌పై కేసు నమోదు

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

వైఎస్ఆర్ జిల్లా ప్రొద్దుటూరు వైసిపి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ప్రచారాన్ని ఎన్నికల అధికారుల బృందం అడ్డుకుంది. మంగళవారం ఉదయం పట్టణంలోని 38వ వార్డులో వైసిపి నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎన్నికల అధికారులు అక్కడికి చేరుకుని ప్రచారం నిలిపివేయాలని చెప్పారు. సువిధ యాప్‌లో ముందుగా అనుమతి తీసుకోవాలని ఎమ్మెల్యేకు ఎన్నికల అధికారులు సూచించారు. దీంతో ఎమ్మెల్యే వెనుదిరిగి వెళ్లిపోయారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘించారంటూ వైసిపి 38వ వార్డు కౌన్సిలర్ పల్లా రమాదేవి, ఆమె కుమారుడు పల్లా సురేష్‌పై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సిఐ శ్రీకాంత్ తెలిపారు.


విడుదలైన సిఐటియు నాయకులు

సిఐటియు నాయకులపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సిఐటియు నాయకులపై పోలీసులు పెట్టిన కేసును మంగళవారం కోర్టు కొట్టివేసింది. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు బకాయి ఉన్న మెనూ బిల్లులు, గౌరవ వేతనాలు చెల్లించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని కోరుతూ 2017 సెప్టెంబర్‌లో కలెక్టరేట్ వద్ద సిఐటియు నాయకులు, ఎండిఎం కార్మికులు ధర్నా చేశారు. ఈ నేపథ్యంలో నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. సిఐటియు నాయకులు టివి రమణ, పి శంకరరావు, బి సుధారాణి, బివి రమణ, మద్దిల రమణ, బల్సా శ్రీను, జివి రమణ, కిల్లంపల్లి రామారావు, తోట జీవ తదితరులపై ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. తగిన సాక్ష్యాధారాలు లేని కారణంగా ఈ కేసును కొట్టివేస్తూ మొబైల్ కోర్టు మంగళవారం తీర్పు వెల్లడించింది. ఈ కేసును సిఐటియు నాయకుల తరుపున న్యాయవాది కె సన్యాసిరావు వాదించారు.

ప్రధాని సభలో భద్రతా లోపాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

- డిజిపిని తక్షణమే తొలగించాలి : పుల్లారావు

ప్రజాశక్తి - చిలకలూరిపేట (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లా చిలకలూరిపేట బొప్పూడిలో ప్రధాని మోడీ పాల్గొన్న బహిరంగ సభలో భద్రతా లోపాలకు కారణం రాష్ట్రంలోని అధికార పార్టీ కుట్రేనని మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు ఆరోపించారు. లోతైన కుట్రలు దాగి ఉన్న ఈ ఘటనలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని కోరారు. ఈ మేరకు పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని తన నివాసంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రధాని పాల్గొన్న సభ విషయంలో అధికార వైసిపి ఇలా వ్యవహరించడం అత్యంత దారుణమన్నారు. ప్రధాని సభలో మూడుసార్లు కరెంట్ పోవడం, ప్రధాన వేదిక వద్ద భద్రతను సరిగా పట్టించుకోకపోవడం, ట్రాఫిక్ నియంత్రణను విస్మరించడం వంటివన్నీ కావాలని చేసినట్లుగానే ఉన్నాయని విమర్శించారు. విపక్షాలకు కీలకమైన భారీ బహిరంగ సభ పర్యవేక్షణ బాధ్యతలు పరమేశ్వర్‌రెడ్డి, తిరుమలేశ్వర్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, మాధవరెడ్డికి అప్పగించడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ప్రధాని భద్రత, జనం రద్దీ నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలను ఎందుకు పట్టించుకోలేదో ఎన్నికల సంఘం సమగ్ర విచారణ జరిపించాలని, డిజిపిని తక్షణమే తొలగించి పోలీస్ వ్యవస్థ మొత్తం ఇసి ఆధీనంలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


కారును పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

పల్నాడులో టిడిపి కార్యకర్త కారు దగ్ధం

ప్రజాశక్తి - మాచర్ల (పల్నాడు జిల్లా)

సమస్యాత్మక ప్రాంతమైన పల్నాడులో ఎన్నికల వేళ మరో వివాదం తలెత్తింది. మాచర్ల పట్టణంలో టిడిపి కార్యకర్తకు చెందిన కారును కొందరు దుండగులు దగ్ధం చేశారు. బాధితుని కథనం మేరకు..స్థానిక సాగర్ రింగ్ రోడ్డు సమీపంలో నివాసం ఉంటున్న ఇర్ల సురేష్ తన కారును ఇంటికి సమీపంలోని రహదారి పక్కన పార్కు చేశారు. కొందరు దుండగులు సోమవారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత దగ్ధం చేశారు. అనంతరం మరో కారులో పరారయ్యారు. భాదితుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి మండిపడ్డారు. ఇప్పటికే టిడిపికి చెందిన ఆరుగురు బిసి నాయకులను చంపారని, ఇప్పుడు ఆస్తులనూ ధ్వంసం చేస్తున్నారని విమర్శించారు.

వడదెబ్బతో రైతు మృతి

ప్రజాశక్తి - బనగానపల్లె

నంద్యాల జిల్లా కోయిలకుంట్ల మండలం ఆమడాల గ్రామానికి చెందిన రైతు బోయ చిన్నతిమ్మయ్య (52) వడదెబ్బకు మంగళవారం మృతి చెందారు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఉదయం పొలానికి వెళ్లిన ఆయన ఎండతీవ్రతను తట్టుకోలేక త్వరగా ఇంటికి తిరిగి వచ్చారు. అయితే కొద్దిసేపటికే అస్వస్తకు గురై మరణించారు.

ఎన్నికల నియమావళి అతిక్రమణ

- ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగులపై వేటు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

ఎన్నికల కోడ్ ఉల్లఘించిన చిత్తూరు జిల్లా గుడిపల్లి ఉపాధి హామీ చట్టం ఫీల్డ్ అసిస్టెంట్, కుప్పం టెక్నికల్ అసిస్టెంట్‌ను విధుల నుంచి తొలగిస్తున్నట్లు చిత్తూరు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.షణ్మోహన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగులుగా ఉంటూ ఎన్నికల ప్రచారంలో పాల్గొనడంతో వారిపై ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గుడిపల్లి మండలం చీకటిపల్లి గ్రామం ఫీల్డ్ అసిస్టెంట్ ఎం.వెంకటేష్.. వైసిపి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నట్లు కలెక్టర్‌కు ఫిర్యాదులు అందడంతో ఆయనను విధుల నుంచి తొలగించారు. రామకుప్పం మండలానికి చెందిన మురుగేశ్...కుప్పం మండలం టెక్నికల్ అసిస్టెంటుగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం డిప్యుటేషన్‌పై వైసిపి ఎమ్మెల్సీ భరత్ పిఎగా ఉన్నారు. కుప్పం రెవెన్యూ కార్యాలయంలో అఖిలపక్ష నాయకులతో ఆర్ఒ, ఆర్‌డిఒ సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి, బిజెపి, కాంగ్రెస్, జనసేన తరుపున నాయకులు పాల్గొనగా.. వైసిపి తరుపున ఎమ్మెల్సీ పిఎ మురుగేశ్ పాల్గొనడంపై విమర్శలు వెల్లువెత్తాయి. దీనిపై ప్రతిపక్షాలు ఆర్ఒకు ఫిర్యాదు చేశారు. దీంతో విధుల నుంచి మురుగేశ్‌ను తొలగించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

కోనేరు రంగారావు కమిటీ సిఫార్సుల అమలుకు 131 పోస్టుల కొనసాగింపు


ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

భూముల అంశానికి సంబంధించి ఏర్పాటుచేసిన కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులను అమలు చేసేందుకు పనిచేస్తున్న ఉద్యోగుల పోస్టుల కాలాన్ని మరో ఏడాది పొడిగిస్తూ ఆర్థికశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 131 పోస్టులను వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు కొనసాగించనున్నారు. ఇందులో భూపరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయానికి సంబంధించి 14 పోస్టులు ఉన్నాయి. ఇందులో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కమిషనర్ పోస్టులు రెండు, సూపరింటెండెంటు పోస్టులు 3, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు 5, డ్రైవర్ పోస్టులు 2, స్టెనో, కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు ఒక్కొక్కటి ఉన్నాయి. అలాగే కలెక్టరు కార్యాలయాల్లో 117 పోస్టులు కొనసాగించాలని నిర్ణయించారు. ఏడాది కాలం గానీ, సిఫార్సులకు అనుగుణంగా కేసుల పరిష్కారంగానీ ఏది ముందు జరిగితే అది వర్తిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అడ్వెంచర్ టూరిజంపై కేరళ దృష్టి

- గతేడాది పర్యాటకుల్లో 16% వృద్ధి
- టూరిస్ట్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ సలీం వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్



కేరళ ప్రభుత్వం అడ్వెంచర్ టూరిజంపై కీలక దృష్టి సారించింది. ఇప్పటికే ప్రకృతి అందాలతో దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్న ఆ రాష్ట్రం.. ఇక అడ్వెంచర్, హెలీ టూరిజం అభివృద్ధికి భారీగా ఖర్చు పెడుతోంది. మంగళవారం హైదరాబాద్‌లో బి2బి క్యాంపెయిన్‌ను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా కేరళ టూరిస్ట్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ విఎం సలీం మీడియాతో మాట్లాడారు. 2023లో దేశీయంగా 16 శాతం వృద్ధితో 2.2 కోట్ల మంది పర్యాటకులను ఆకర్షించామన్నారు. గతేడాది 88 శాతం పెరుగుదలతో 6.5 లక్షల విదేశీ పర్యాటకులు తమ రాష్ట్రానికి వచ్చారన్నారు. కొత్తగా 'కమ్ టు గెదర్ ఇన్ కేరళ' క్యాంపెయిన్‌తో పర్యాటకులను మరింత ఆకర్షించే పనిలో ఉన్నామన్నారు. ఇందులో భాగంగా హెలీ టూరిజంను ప్రవేశపెట్టబోతున్నామన్నారు. దీంతో 2024లో కేరళ టూరిజాన్ని సరికొత్త పుంతలు తొక్కిస్తూ రాష్ట్రంలోని అన్ని గమస్థానాలను కలపాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. దీనికి 'స్కై ఎస్కేప్స్'గా నామకరణం చేశామన్నారు. దేశంలో సమగ్ర హెలీ టూరిజం పాలసీని తీసుకొచ్చిన తొలి రాష్ట్రంగా కేరళ నిలిచిందన్నారు.

"గ్లోబల్ అడ్వెంచర్ టూరిజం మ్యాప్‌లో కేరళను ప్రథమస్థానంలో ఉంచే లక్ష్యంతో, ఈ ఏడాది నాలుగు అంతర్జాతీయ అడ్వెంచర్ స్పోర్ట్స్ ఈవెంట్‌లను నిర్వహించాలని కేరళ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రపంచవ్యాప్తంగా 2032 నాటికి అడ్వెంచర్ టూరిజం 20 శాతం వృద్ధి చెందుతుందని అంచనా. దేశీయ టూరిజం వృద్ధిలో కూడా ఇది కీలక పాత్ర పోషిస్తుందని అంచనా వేస్తున్నాము. అదే విధంగా ఏప్రిల్ 26 నుండి వయనాడ్‌లోని మనంతవడిలోని ప్రియదర్శిని టీ ప్లాంటేషన్‌లో జరుగుతుంది. మలబార్ రివర్ ఫెస్టివల్ 2024 జూలై 25 నుండి 28 వరకు కోజికోడ్‌లోని కోడెన్‌చేరిలో నిర్వహించనున్నాం." కేరళ టూరిజం శాఖ తెలిపింది. అక్టోబర్ నుండి మార్చి వరకు కేరళను సందర్శించేందుకు ఉత్తమ సమయమన్నారు. మారుతున్న పర్యాటకుల అభిరుచులకు అనుగుణంగా, వారి బసను మరింత థ్రిల్లింగ్ మార్చడానికి విస్తృతమైన వ్యూహాలను రూపొందిస్తున్నామని సలీమ్ తెలిపారు. కొత్త ప్రాజెక్టులతో పాటు, బీచ్‌లు, హిల్ స్టేషన్‌లు, హౌస్‌బోట్లు మరియు బ్యాక్‌వాటర్ సెగ్మెంట్ వంటి రాష్ట్ర ప్రధాన ఆకర్షణలు సందర్శకుల అనుభవాన్ని మరింతగా పెంచుతాయన్నారు.

క్రోమాలో రూ.25వేలకే ఎసిలు

హైదరాబాద్ : ప్రస్తుత వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఎసి, రిఫ్రిజిరేటర్లు, రూమ్ కూలర్లపై పలు ఆఫర్లను అందిస్తున్నట్లు టాటా గ్రూపులో భాగమైన క్రోమా తెలిపింది. వేసవి క్యాంపెయిన్ 2024తో మ్యాజిక్ పేరుతో పలు ఉత్పత్తులపై రాయితీలు కల్పిస్తున్నట్లు పేర్కొంది. ఇన్వెర్టర్ స్ప్లిట్ ఎసిల ధరలు రూ.24,990 నుంచి ప్రారంభమవుతాయని తెలిపింది. ఏదైనా కొత్త ఏసి కొనుగోలుపై గరిష్ఠంగా రూ6,500 వరకు ఎక్స్ఛేంజీ ప్రయోజనాలు పొందవచ్చని పేర్కొంది.

ఎన్‌టిపిసి నుంచి భెల్‌కు 1600 మెగావాట్ ప్లాంట్ ఆర్డర్

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని భారీ విద్యుత్ ఉపకరణాల తయారీ సంస్థ భెల్‌కు ఎన్‌టిపిసి నుంచి కొత్త ఆర్డర్ దక్కింది. ఎన్‌టిపిసి నుంచి 1,600 మెగావాట్ల సింగ్రౌలి సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్ స్టేజ్-3 ఏర్పాటుకు ఆర్డర్‌ను పొందినట్లు భెల్ పేర్కొంది. అయితే ఈ ఆర్డర్ విలువను ఆ సంస్థ వెల్లడించలేదు.

అపోలో హాస్పిటల్స్ కొత్త సిఇఒగా మధు శశిధర్



హైదరాబాద్ : ప్రముఖ ప్రయివేటు రంగ వైద్య సేవల సంస్థ అపోలో హాస్పిటల్ డివిజన్ ప్రెసిడెంట్ అండ్ సిఇఒగా మధు శశిధర్ నియమితులయ్యారు. ఆ సంస్థలోని హాస్పిటల్ వ్యాపారాలను నిర్వహించనున్నారు. పాండిచ్చేరిలోని జిప్‌మెర్‌లో వైద్య విద్యను పూర్తి చేసిన శశిధర్‌కు న్యూయార్క్‌లోని సెయింట్ లూక్స రూస్‌వెల్ట్ హాస్పిటల్‌లో పని చేసిన అనుభవం ఉంది. 2023 అక్టోబర్ నుంచి అపోలోలో చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్‌గా ఉన్నారు. శశిధర్ అంతర్జాతీయ అనుభవం తమ సంస్థకు కలిసి రానుందని అపోలో హాస్పిటల్స్ గ్రూప్ చైర్మన్ ప్రతాప్ సి రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. అపోలో సంస్థలో 27 ఏళ్ల పాటు సేవలందించిన డాక్టర్ కె హరిప్రసాద్ ప్రస్తుత ప్రెసిడెంట్ తన పదవి నుంచి విరమణ పొందనున్నారు. కాగా అపోలో ఎండి సునీతా రెడ్డికి శశిధర్ రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది.

మహీంద్రా ట్రాక్టర్స్ నుంచి కొత్త ఓజా3140



హైదరాబాద్ : మహీంద్రా గ్రూపులో భాగమైన మహీంద్రా ట్రాక్టర్స్ కొత్తగా ఓజా 3140 మోడల్‌ను విడుదల చేసినట్లు ప్రకటించింది. ఇది ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని వరి పంటలకు సంబంధించిన తడి పనుల్లోనూ అసాధారణమైన ఫలితాలు చూపించనుందని ఆ సంస్థ తెలిపింది. 30-40 హెచ్‌పి సామర్థ్యంతో అసమానమైన పనితీరు, ఇంధన ఆదాను కలిగిన ఈ ట్రాక్టర్ తేలికగా ఉండటంతో పాటు అధునాతన పనితీరు కనపరుస్తుందని పేర్కొంది.

అభ్యర్థిని మార్చకుంటే తిరుపతిలో ఓటమి తప్పదు..

- టిడిపి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ

ప్రజాశకి- తిరుపతి టౌన్:

ఎమ్మెల్యే అభ్యర్థిని మార్చకుంటే తిరుపతిలో ఓటమి తప్పదని టిడిపి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ పేర్కొన్నారు. తిరుపతిలోని ఓ ప్రయివేట్ హోటల్‌లో మంగళవారం జరిగిన టిడిపి నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును తిరుపతి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎలా టికెట్ ఇస్తారని, ఎన్నికల ప్రచారంలో ఓటర్లకు ఎలా సర్దిచెప్పాలని ప్రశ్నించారు. ఆయనకు టికెట్ ఇస్తే తిరుపతిలో ఓడిపోవడం ఖాయమని, స్థానికులకు ఎమ్మెల్యే టికెట్ ఇస్తే గెలిపించుకుంటామని చెప్పారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్, టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును కలిసి నచ్చజెబుతామని, వారు అభ్యర్థిని మార్చి స్థానికులకు అవకాశమిస్తే కచ్చితంగా గెలిచితీరుతామని పేర్కొన్నారు. తిరుపతి పరిస్థితిని అధిష్టానం గమనించాలని, లేకుంటే తదుపరి కార్యక్రమం ప్రకటించాల్సి వస్తుందని సుగుణమ్మ అన్నారు.


మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవు వయో పరిమితి ఎత్తివేత

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

మహిళా ఉద్యోగులకు ఇప్పటివరకు ఇస్తున్న పిల్లల సంరక్షణ సెలవుకు ఉన్న వయోపరిమితిని ఎత్తివేసింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులను జారీ చేసింది. ఉద్యోగినులు తమ రిటైర్‌మెంట్ లోపు ఎప్పుడైనా ఆ సెలవును వినియోగించుకోవచ్చని పేర్కొంది. అలాగే కొత్తగా ఉద్యోగం పొందిన మహిళా ఉద్యోగులు ప్రసూతి సెలవులను ప్రొబేషన్ ప్రకటన కోసం విధి నిర్వహణ సెలవుగా పరిగణించాలని మరో ఉత్తర్వు కూడా జారీచేసింది.

తెలంగాణ నూతన గవర్నర్‌గా సిపి రాధాకృష్ణన్

- నేడు బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర నూతన గవర్నర్‌గా ఝార్ఖండ్ గవర్నర్ సిపి రాధాకృష్ణకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నిర్ణయం తీసుకున్నారు. పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా కూడా ఆయనకే అదనపు బాధ్యతలు అప్పగించారు. బుధవారం ఉదయం 11.15 గంటలకు రాజ్‌భవన్‌లో రాధాకృష్ణన్ బాధ్యతలు స్వీకరించనున్నారు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే రాధాకృష్ణన్ చేత ప్రమాణం చేయించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు, హైకోర్టు న్యాయమూర్తులు, సిఎస్ ,డిజిపి, ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. ఇప్పటి వరకు గవర్నర్‌గా పనిచేసిన తమిళిసై రాజీనామా చేసిన విషయం తెలిసిందే.


విన్యాసాల ప్రారంభ వేడుకలో భారత్, అమెరికా ప్రతినిధులు

తూర్పు తీరంలో టైగర్ ట్రయంఫ్

- 25 నుంచి 31 వరకు విన్యాసాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

భారత్, అమెరికా మధ్య టైగర్ ట్రయంఫ్ - 2024 విన్యాసాలు తూర్పు తీరంలో ప్రారంభమయ్యాయి. ద్వైపాక్షిక త్రివిధ దళాల సహాయం, పరస్పర స్నేహ సంబంధాలు మెరుగుపరుచుకునే క్రమంలో వీటిని చేపట్టినట్టు ఇరు దేశాల అధికారులు వెల్లడించారు. నావెల్ డాక్‌యార్డ్‌లోని ఐఎన్ఎస్ జలాశ్వలో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అమెరికా తరుపున భారత్‌లోని అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టి, తూర్పు నౌకాదళం ఫ్లాగ్ ఆఫీసర్, కమాండింగ్ ఇన్ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ పాల్గొన్నారు. విన్యాసాల ప్రారంభ నేపథ్యంలో మంగళవారం వారు మీడియాతో మాట్లాడారు. రెండు శక్తివంతమైన దేశాల మధ్య ఉన్న స్నేహ సంబంధాలను ఇటువంటి ద్వైపాక్షిక విన్యాసాలు మరింత బలోపేతం చేస్తాయని ఎరిక్ గార్సెట్టి తెలిపారు. రోజురోజుకూ ఆర్థిక, రక్షణ రంగాల్లో భారత్ ఉన్నత స్థాయికి చేరుకుంటోందని చెప్పారు. మిలాన్‌కు కొనసాగింపుగా ఈ టైగర్ ట్రయంఫ్ విన్యాసాలు జరుగుతున్నట్టు రాజేష్ పెంధార్కర్ వెల్లడించారు. విశాఖ కేంద్రంగా ఈ నెల 25 వరకూ, సీ ఫేజ్‌కు సంబంధించి కాకినాడ తీరంలో ఈ నెల 26 నుంచి 31 వరకు ఈ విన్యాసాలు జరుగుతాయని తెలిపారు. తాజా విన్యాసాల్లో ఇండియన్ నేవీకి చెందిన నౌకలు జలాశ్వ, ఐరావత్, కేసరి, సహ్యాద్రిలతో పాటు ఇండియన్ నేవీ ఎయిర్ క్రాఫ్ట్ వాహనాలు పాలుపంచుకున్నాయి. ఎయిర్‌ఫోర్స్ విమానాలు సి - 130 జె, హెలికాప్టర్లు ఎంఐ-17 పాల్గొన్ననున్నాయి. ఇండియన్ ఆర్మీ సిబ్బంది, ర్యాపిడ్ యాక్షన్ మెడికల్ టీమ్‌లు ఈ విన్యాసాల్లో భాగస్వాములయ్యాయి. వీటితో పాటు ఇండియన్ - యుఎస్ మెరైన్ కార్ప్స్, యుఎస్ ఆర్మీకి చెందిన ఎంబార్డ్ దళాలు, యుఎస్ నేవీ నౌకలు, యుఎస్ నేవీ ఎయిర్ క్రాఫ్ట్ పి8ఐ, సి-130 పాల్గొన్నాయి. ఇరు దేశాల దళాల మధ్య వేగవంతమైన సమన్వయం కోసం హెచ్ఎడిఆర్ కార్యకలాపాల నిర్వహణ, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ మెరుగుదల ఈ విన్యాసాల లక్ష్యంగా ఉన్నట్టు అధికారులు వెల్లడించారు.

సంపాదకీయం

మూకదాడుల వర్సిటీలు!

విజ్ఞాన వెలుగులు విరజిమ్ముతూ.. అజ్ఞానాంధకారాన్ని పారదోలాల్సిన విశ్వ విద్యాలయాల్లో మూకదాడులు చోటుచేసుకోవడం దారుణం. ఆర్‌ఎస్‌ఎస్ గూండాలకు భయపడుతూ చదువుకోవాల్సిన దుస్థితి విద్యార్థులకు ఏర్పడింది. ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాలన్నీ స్వేచ్ఛను ప్రోత్సహిస్తాయి. వంద భావాలు సంఘర్షించనీ.. వెయ్యి భావాలు వికసించనీ.. అన్న విధంగా పనిచేస్తాయి. భారతీయుల నరనరాల్లో తరతరాలుగా జీర్ణించుకుపోయిన భిన్నత్వంలో ఏకత్వం అన్న సంప్రదాయం తుదముట్టించేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఏలుబడిలో వ్యవస్థీకృతంగా యత్నాలు జరుగుతున్నాయి. ఆయన సొంత రాష్ట్రం గుజరాత్‌లో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. అహ్మదాబాద్‌లోని గుజరాత్ విశ్వవిద్యాలయంలో తమకు కేటాయించిన గదిలో రంజాన్ సందర్భంగా నమాజ్ చేసినందుకు ఐదుగురు విదేశీ విద్యార్థులపై ఓ మూక విచక్షణారహితంగా దాడికి పాల్పడింది. ఈ దృశ్యాల వీడియోలు వైరల్ కావడంతో విదేశాల్లో సైతం విమర్శలు వెల్లువెత్తాయి. దాంతో సర్కారుకు స్పందించక తప్పలేదు. నేరపూరితంగా వ్యవహరించారని, క్యాంపస్‌లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించారని ఇద్దరిని అరెస్టు చేశారు. ఈ ఘటనపై గుజరాత్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నామని విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఓ ప్రకటన విడుదల చేసి చేతులు దులుపుకుంది. మరోవైపు వర్శిటీ వైస్ ఛాన్సలర్ నీర్జాగుప్తా దాడికి గురైన శ్రీలంక, తుర్క్‌మెనిస్తాన్, ఆఫ్ఘనిస్థాన్, ఆఫ్రికన్ దేశాల విద్యార్థులను వేరొక హాస్టల్‌కు తరలిస్తామంటూనే... విదేశీ విద్యార్థులు రాష్ట్రంలోని విజిటేరియన్ సొసైటీ మనోభావాలను దృష్టిలో ఉంచుకుని ఆహారపు అలవాట్లు, ప్రవర్తన మార్చుకోవాలి. స్థానిక సమాజం, ఆచారాలు, భావోద్వేగాల గురించి వారికి తెలియజేయాలి... తద్వారా వారు సురక్షితంగా ఉంటారు...' అంటూ సుద్దులు చెప్పడం తీవ్ర అభ్యంతరకరం.

మరింత శాంతియుతంగా, సహనశీలంగా, సమ్మిళితంగా, సురక్షితంగా ఉంటూ.. స్థిరమైన సమాజాల అభివృద్ధిని ప్రోత్సహించేలా ఉండాలని బిజెపి సర్కారే తీసుకొచ్చిన 2020 జాతీయ విద్యావిధానం నొక్కిచెబుతోంది. దీనికి విరుద్ధంగా బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు గూండాల్లాగా వర్సిటీలలో శివమెత్తుతున్నారు. గుజరాత్‌లోని వర్సిటీలు ఎంత ఘోరంగా అఘోరించాయో గుజరాత్ జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం (జిఎన్‌ఎల్‌యు) ఘటనలే తేల్చిచెబుతున్నాయి. వేధింపులు, అత్యాచారాలు, స్వలింగ సంపర్కం, వివక్ష వంటి సమస్త రుగ్మతలకు వర్సిటీ ఆలవాలంగా ఉందని ఇటీవల గుజరాత్ హైకోర్టు నిజనిర్ధారణ కమిటీ తేల్చిచెప్పింది. ఇక్కడి విద్యార్థినిపై లైంగిక దాడి జరిగిందని, మరో విద్యార్థిని వేధింపులకు గురైందని సోషల్ మీడియాలో వచ్చిన కథనాలపై హైకోర్టు సుమోటాగా స్పందించడంతోనే ఈ వాస్తవాలు వెల్లడయ్యాయి. విద్యార్థుల ఫిర్యాదులను బుట్టదాఖలు చేసి, సోషల్ మీడియాలో పోస్టులు ప్రతిష్టకు భంగకరంగా వర్సిటీ భావించిందంటేనే ఆ రాష్ట్రంలో దుర్మార్గ పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

దేశ నడిబొడ్డున ప్రగతిశీల భావాలకు ఆలవాలంగా ఉంటూ ఎందరో మేధావులను తీర్చిదిద్దిన జవహర్లాల్ నెహ్రూ వర్సిటీలో ఆర్‌ఎస్‌ఎస్ గూండాలు పైశాచిక దాడి చేసి నాలుగేళ్లు దాటినా నేటికీ చర్యలు లేవు. 2023లో 80 శాతం ముస్లిం వ్యతిరేక విద్వేష పూరిత ప్రసంగాలు, ఘటనలు బిజెపి పాలిత రాష్ట్రాల్లోనే జరిగాయి. పండగల సమయంలో.. ముస్లిములపై హింసను ప్రోత్సహించే పాటలు ప్లే చేస్తూ, ఆయుధాలతో కవాతు చేస్తూ ఇతర మతాల ప్రార్థనా మందిరాల వద్ద వీరంగాలు పెరిగిపోయాయి. ఇటీవల కాలంలో సినిమాలుసైతం సోషల్ మీడియాకు తోడుగా ఇందులో భాగం పంచుకుంటున్నాయి. ఇటువంటి వాటికి కేరళలో వామపక్ష సర్కారు అడ్డుకట్ట వేస్తుండటంతో... అక్కడి వర్సిటీలపై గవర్నర్ దాడి నిరంతరం వార్తల్లో నిలుస్తోంది. దేశమును ప్రేమించుమన్నా.. మంచి అన్నది పెంచుమన్నా.... మతములన్నియు మాసిపోవును.. జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును... అన్న గురజాడ స్ఫూర్తితో సమానత్వం, సౌభ్రాతృత్వం, సహనశీలత లాంటి భారతీయ వారసత్వాన్ని పెంపొందించుకుంటూ.. వర్సిటీలు ఆదర్శవంతంగా నిలవాలి. అందుకు ఆటంకంగా ఉన్న కార్పొరేట్ - మతతత్వ కూటమి పాలన అంతం కావాలి.

మంచి మాట



మనం ఎప్పటికీ ఒక విషయం గుర్తుంచుకోవాలి. అన్యాయంతో రాజీపడడం కన్నా పెద్ద నేరం మరొకటి ఉండదు

-నేతాజీ సుభాష్ చంద్రబోస్

మాటలకే శాంతి వచనాలు...

విశ్లేషణ

శారద

ప్రపంచశాంతి కోసమే తాము తాపత్రయపడుతున్నట్లు చెప్పిన వారందరూ చరిత్రలో అశాంతికి మూలకారకులుగా రుజువైంది. ఇప్పటికీ అదే జరుగుతోందా ? పాలస్తీనా ప్రాంతాలను కబళించిన ఇజ్రాయిల్ ఇప్పుడు మొత్తం అరబ్బులనే అంతం చేసేందుకు, వారి ప్రాంతాల నుంచి వెళ్లగొట్టేందుకు జరుపుతున్న మారణకాండ మంగళవారం నాటికి 165వ రోజులో ప్రవేశించింది. గాజాలో ఇజ్రాయిల్ దాడుల్లో మరణించిన వారి సంఖ్య 32వేలకు చేరుకుంది. గాయపడిన వారు, నిలువ నీడ, సర్వస్వం కోల్పోయిన వారు, ధ్వంసమైన గృహాల సంఖ్య సరేసరి. మానవహక్కులు, మానవవాదానికి అసలు సిసలు ప్రతినిధులుగా చెప్పుకుంటున్నవారు పడక కుర్చీలకే పరిమితమయ్యారు. గతేడాది అక్టోబరు ఏడు నుంచి జరుపుతున్న ఇజ్రాయిల్ దాడులతో పాటు మధ్య ప్రాచ్యంలో అమెరికా మిలిటరీ, ఆధునిక ఆయుధాల మోహరింపు కూడా పెరిగింది. ఆసియాలో పరిస్థితి ఇదైతే ఐరోపా దేశాలకు ముప్పు పేరుతో గత ఎనిమిది దశాబ్దాలుగా తిష్టవేసిన అమెరికా ఇప్పుడు ఉక్రెయిన్ సంక్షోభం ముసుగులో ఆ దేశాలకు ముప్పును మరింత పెంచేవిధంగా ప్రయత్నించటం శాంతిని కోరుకొనే వారికి ఆందోళన కలిగిస్తోంది. నాటి జర్మనీ రెండవ ప్రపంచ యుద్ధానికి ప్రధాన కారకురాలిగా ఉంటే ఇప్పుడు అమెరికా చర్యలు మూడవ ప్రపంచ పోరుకు దారితీసేవిగా ఉన్నట్లు అనేక మంది చెబుతున్నారు.

ఆసియా ఖండంలోని సహజ సంపదలు, రాజకీయ ఆధిపత్యం మీద కన్నేసిన అమెరికా ఒక్కో దశలో ఒక్కో కారణాన్ని సాకుగా చూపి తిష్టవేస్తోంది. మధ్య ప్రాచ్యంలో పరిణామాలు దేనికి దారితీసేదీ ఎవరూ ఊహించలేని స్థితి.బాధితులకు ఆహార సరఫరా చేస్తున్నట్లు చెబుతూనే అంతకంటే ఎక్కువగా అమెరికన్లు మిలిటరీ కేంద్రీకరణకు పూనుకున్నారు. గాజా మీద దాడులకు నిరసన లేదా ప్రతీకారంగా ప్రపంచంలో ఎంతో కీలకమైన నౌకా మార్గం ఉన్న ఎర్ర సముద్రంలో ఇజ్రాయిల్ వైపు ప్రయాణించే నౌకల మీద ఇరాన్ మద్దతు ఉన్న ఎమెన్‌లోని హౌతీ దళాలు దాడులకు దిగటం, వాటి మీద అమెరికా జరుపుతున్న దాడుల గురించి తెలిసిందే. కొద్ది గంటల్లోనే గాజాలోని హమాస్ సాయుధులను అదుపు చేస్తామని ప్రగల్భాలు పలికిన ఇజ్రాయిల్ ఇప్పటి వరకు సామాన్య పౌరులు, వారిలో కూడా 70శాతం మంది పిల్లలూ, మహిళలు, వృద్ధులు, ఆసుపత్రుల్లోని రోగులనే చంపుతున్నది. ఎంతకాలం అవసరమైతే అంతకాలం తాము మధ్య ప్రాచ్యంలోనే తిష్టవేస్తామని అమెరికా మిలిటరీ అధికారులు చెబుతున్నారు. ఇక్కడి నుంచి వెళ్లిపోవటం అంత తేలిక కాదని అమెరికా మిలిటరీ కమాండర్ మిగుయెజ్ చెప్పాడు. ఆహార సరఫరా పేరుతో ఆయుధాలను పెద్ద ఎత్తున ఎర్ర సముద్ర ప్రాంతానికి చేరవేస్తున్నారు. లెబనాన్‌లోని హిజబుల్లా, హౌతీ సాయుధులను ఎదుర్కొనేందుకు మధ్య ప్రాచ్యంలోని జలాల్లోకి ఐషెన్‌హోవర్, యుఎస్‌ఎస్ గెరాల్డ్ ఫోర్డ్ అనే రెండు విమాన వాహక యుద్ధ నౌకలను అమెరికా మోహరించింది. వాటికి అనుబంధంగా అనేక ఇతర మిలిటరీ నౌకలు ఉన్నాయి. నీటిలో, నేల మీద ఎలా అవసరమైతే అలా ప్రయాణించే యుద్ధ వాహనాలు, ఎఫ్-16 యుద్ధ విమానాలను పెద్ద ఎత్తున తరలించారు. గతంలో ఇరాక్‌లో మోహరించిన లక్షా 60వేలు, ఆఫ్ఘనిస్తాన్‌కు తరలించిన లక్ష మంది మిలిటరీతో పోలిస్తే ఇప్పుడు మధ్య ప్రాచ్యంలో ఉన్న తమ సేనలు తక్కువే అని అమెరికా సమర్థించుకుంటున్నది. దీర్ఘకాలంగా మిలిటరీ స్థావరాలున్న కతార్, బహెరెన్, యుఏయిలతో పాటు జోర్డాన్, ఇరాక్, సిరియాలలో కూడా వేలాది మంది సైనికులున్నారు.



తమ మిలిటరీ, పరికరాలను సిద్దంగా ఉంచినప్పటికీ యుద్ధం కోసం కాదని అమెరికా రక్షణశాఖ పెంటగాన్ ప్రపంచాన్ని నమ్మించేందుకు చూస్తున్నది. అక్టోబర్ ఏడవ తేదీ తరువాత ఇప్పటి వరకు హౌతీ దళాలు 170 దాడులను జరిపాయి. వాటిని నిలువరించటంలో అమెరికా ఎలాంటి పురోగతినీ సాధించలేదు. దీంతో రవాణా నౌకలు ఆఫ్రికా గుడ్‌హోప్ అగ్రం చుట్టి తిరిగి రావాల్సి వస్తోంది. దీని వల్ల సరకు రవాణా ఆలస్యం కావటమే గాక ఖర్చు కూడా పెరుగుతున్నది. దీనికి పూర్తి బాధ్యత అమెరికా, ఇజ్రాయిల్‌దే అన్నది స్పష్టం. మధ్య ప్రాచ్యంలో ఎన్నో ఏండ్లుగా 30వేలకు పైగా అమెరికా దళాలున్నాయి. ఇవిగాక తాత్కాలికం, అదనపు దళాల పేరుతో మరికొన్ని వేల మందిని, ముందే చెప్పుకున్నట్లు పెద్ద సంఖ్యలో యుద్ధ నౌకలను దించారు. ఒక్క సిరియాలో తప్ప మధ్య ప్రాచ్య, పశ్చిమాసియాలోని దేశాలన్నింటా ఏదో ఒక పేరుతో అనుమతి తీసుకొనే అమెరికా తిష్టవేసింది. కొన్ని చోట్ల ఆయాదేశాల దళాలకు శిక్షణ, ఇస్లామిక్ తీవ్రవాదులను ఎదుర్కొనే పేరుతో ఇదంతా జరిగింది.

తమ మిలిటరీ, పరికరాలను సిద్దంగా ఉంచినప్పటికీ యుద్ధం కోసం కాదని అమెరికా రక్షణశాఖ పెంటగాన్ ప్రపంచాన్ని నమ్మించేందుకు చూస్తున్నది. అక్టోబర్ ఏడవ తేదీ తరువాత ఇప్పటి వరకు హౌతీ దళాలు 170 దాడులను జరిపాయి. వాటిని నిలువరించటంలో అమెరికా ఎలాంటి పురోగతినీ సాధించలేదు. దీంతో రవాణా నౌకలు ఆఫ్రికా గుడ్‌హోప్ అగ్రం చుట్టి తిరిగి రావాల్సి వస్తోంది. దీని వల్ల సరకు రవాణా ఆలస్యం కావటమే గాక ఖర్చు కూడా పెరుగుతున్నది. దీనికి పూర్తి బాధ్యత అమెరికా, ఇజ్రాయిల్‌దే అన్నది స్పష్టం. మధ్య ప్రాచ్యంలో ఎన్నో ఏండ్లుగా 30వేలకు పైగా అమెరికా దళాలున్నాయి. ఇవిగాక తాత్కాలికం, అదనపు దళాల పేరుతో మరికొన్ని వేల మందిని, ముందే చెప్పుకున్నట్లు పెద్ద సంఖ్యలో యుద్ధ నౌకలను దించారు. ఒక్క సిరియాలో తప్ప మధ్య ప్రాచ్య, పశ్చిమాసియాలోని దేశాలన్నింటా ఏదో ఒక పేరుతో అనుమతి తీసుకొనే అమెరికా తిష్టవేసింది. కొన్ని చోట్ల ఆయాదేశాల దళాలకు శిక్షణ, ఇస్లామిక్ తీవ్రవాదులను ఎదుర్కొనే పేరుతో ఇదంతా జరిగింది. నిజానికి ఇరాన్ మద్దతు ఉన్న సాయుధ బృందాలను అరికట్టేందుకే ఇదంతా అన్నది బహిరంగ రహస్యం. జోర్డాన్‌లో ఉన్న మిలిటరీ స్థావరం సరిహద్దుల్లో ఉన్న ఇరాక్, సిరియాలపై దాడులు చేసేందుకే ఉంది. తూర్పు సిరియాలో ఇరాన్ మద్దతు ఉన్న సాయుధ దళాలున్నాయి. మధ్య ప్రాచ్యంలో తిష్టవేసిన అమెరికా దళాల గురించి చూద్దాం.

ఎర్ర సముద్రంలోకి ఫిబ్రవరిలో దించిన ఐషెన్ హోవర్ విమాన వాహక యుద్ధ నౌకతో పాటు నియంత్రిత క్షిపణి దాడుల నౌక, ప్రత్యర్థుల క్షిపణులను అడ్డుకొనే రెండు నౌకలు, హెలికాప్టర్లు, యుద్ధ విమానాలు, ఐదువేల మంది నౌకాదళ సిబ్బంది ఉన్నారు. ఇది ఇరాన్‌కు హెచ్చరికగానే జరిగింది. అణుశక్తితో నడిచే ఓహియో తరగతి జలాంతర్గాములను కూడా సూయజ్ కాలువ ద్వారా సమీకరించారు. ఇవి ఎక్కడా ఎలాంటి హడావుడి చేయవు. ఒక్కొక్క జలాంతర్గామి 154 తోమహాక్ క్రూయిజ్ క్షిపణులను మోసుకుపోగలదు. మధ్యధరా సముద్రంలో ఉన్న ఫోర్డ్ కారియర్ అనే యుద్ధ నౌకను కూడా తరలించారు. దీనిలో ఒక విమాన వాహక యుద్ధ నౌకతో పాటు మూడు ఖండాంతర క్షిపణి రక్షణ నౌకలు కూడా ఉన్నాయి. ఎమెన్ నుంచి ప్రయోగించిన క్షిపణులను కూల్చివేసిన నౌకతో పాటు ఇతర అనేక యుద్ధ నౌకలను మధ్యధరా సముద్రం నుంచి ఎర్ర సముద్రంవైపు తరలించారు. ఇవన్నీ ఇజ్రాయిల్‌కు మద్దతుగా, దాన్ని వ్యతిరేకించే దేశాలను బెదిరించటం, అవసరమైతే దాడులకు దిగేందుకే అన్నది స్పష్టం. నౌకా దళాలు కాకుండా 45వేల మంది వివిధ దేశాల స్థావరాల్లో ఉన్నారు. వీటన్నింటిని చూసుకొనే ప్రపంచం, ఐరాస సాధారణ అసెంబ్లీ ఖండించినా, భద్రతా మండలిలో తీర్మానాలు ప్రవేశపెట్టినా, అంతర్జాతీయ కోర్టులలో కేసులు దాఖలు చేసినా ఇజ్రాయిల్ ఏ మాత్రం ఖాతరు చేయకుండా గాజాలో మారణకాండ, పశ్చిమగట్టు ప్రాంతంలో నిరంతరం దాడులు జరుపుతున్నది. అమెరికా తీరు వివాదం విస్తరించటానికే దోహదం చేస్తున్నది.

ఆసియాలో ఇలా ఉంటే ఐరోపాలో ఉక్రెయిన్ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం గావించేందుకు అమెరికా పూనుకుంది. ఉక్రెయిన్‌కు 61బిలియన్ డాలర్ల ఆయుధ సరఫరాను అంగీకరించకపోతే ఆ దేశాన్ని, ఐరోపా, మొత్తం స్వేచ్ఛా ప్రపంచాన్ని ముప్పులో ఉంచినట్లేనని అధ్యక్షుడు జో బైడెన్ అమెరికా పార్లమెంట్‌ను బెదిరించాడు. 2014కు ముందు ఉన్న ఉక్రెయిన్ సరిహద్దులను పునరుద్దరించేందుకు రష్యాను ఓడించాలన్న జో బైడెన్ కలను చూస్తుంటే గతంలో వియత్నాం, ఉత్తర కొరియా, ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్ సిరియా, ఎమెన్ తదితర దేశాలలో మాదిరి ఓటములు గుర్తుకు వస్తున్నట్లు అనేక మంది చెబుతున్నారు. అమెరికా గనుక 2022 ఏప్రిల్‌లోనే టర్కీ ముందుకు తెచ్చిన శాంతి ప్రతిపాదనలను అంగీకరించి ఉంటే ఇంతదాకా వచ్చేది కాదని, శాంతికి బదులు అమెరికా, నాటో కూటమి పోరును మరింతగా ఎగదోసేందుకే ఒక సాధనంగా చేసుకుంటున్నారన్నది స్పష్టం. ఉక్రెయిన్ వ్యవహారంలో అమెరికా వినాశకర విధానాన్ని అనుసరించటానికి కారకులైన వారిలో ఒకరిగా ఆరోపిస్తూ విక్టోరియా న్యూలాండ్ అనే విదేశాంగశాఖ ఉప మంత్రిని పదవీ కాలం ఉండగా ముందుగానే తొలగించారు. అంతకు రెండు వారాల ముందు ఆమె ఒక సమావేశంలో మాట్లాడుతూ ఉక్రెయిన్ పోరు మొదటి ప్రపంచయుద్ధానికి దారితీసిన ఘర్షణ స్థాయికి దిగజారిందని, ఉక్రెయిన్‌కు ప్రతిపాదించిన 61బిలియన్ డాలర్ల ఆయుధ సాయానికి ఒక వేళ పార్లమెంటు ఆమోదం తెలపకపోతే బైడెన్ దగ్గర మరొక ప్రత్యామ్నాయం లేదని వెల్లడించారు. ఈ కారణంగానే ఆమెను తొలగించారని కొందరు చెపుతుండగా, బైడెన్ విధానాలకు నిరసనగా ఆమే రాజీనామా చేసినట్లు మరి కొందరు చెబుతున్నారు.

ఉక్రెయిన్‌పై రష్యా దాడులు 2022 ఫిబ్రవరి చివరి వారంలో ప్రారంభమైతే నెల రోజుల తరువాత అధ్యక్షుడు జెలెనెస్కీ మాట్లాడుతూ తమ లక్ష్యం శాంతి, సాధ్యమైనంత త్వరలో సాధారణ జీవన పునరుద్దరణ అని చెప్పాడు. కానీ అమెరికా, బ్రిటన్, ఫ్రెంచి నేతలు రంగంలోకి దిగి శాంతి చర్చలు కొనసాగకుండా చేశారు. అంతే కాదు పెద్ద సంఖ్యలో నాటో దళాలను ఉక్రెయిన్‌కు పంపుతున్నట్లు ఫ్రెంచి అధ్యక్షుడు మక్రాన్ ప్రకటించాడు. దాన్ని నమ్మిన జెలెనెస్కీ వారి మాయలో పడి శాంతి ప్రక్రియ నుంచి వైదొలిగాడు. ఇప్పటి వరకు ఆయుధాలు తప్ప దళాలను నాటో పంపలేదు. సంక్షోభం ప్రారంభమైపుడు ఉక్రెయిన్ జనాలకు హెల్మెట్లు, రాత్రుళ్లు పడుకొనేందుకు బ్యాగులు పంపితే సరిపోతుందని జర్మనీ చెప్పిందని, ఇప్పుడు వారే మరిన్ని క్షిపణులు, యుద్ధ టాంకులు అవసరమంటున్నారని మక్రాన్ చెబుతున్నాడు. ప్రతి దశలోనూ ఆరు నుంచి ఎనిమిది నెలలు వెనుకబడి ఉన్నామని కూడా అన్నాడు. ఒక వేళ ఇప్పుడు నాటో దళాలు ప్రత్యక్షంగా రంగంలోకి దిగితే అది రష్యా-నాటో యుద్ధంగా మారుతుందని రష్యా హెచ్చరించింది. అవసరమైతే అణ్వాయుధాలను ప్రయోగించేందుకు కూడా వెనుకాడబోమని పుతిన్ చెబుతున్నాడు. అయితే ఇప్పటికే కొన్ని ప్రత్యేక నాటో దళాలు ఉక్రెయిన్‌లో ఉన్నట్లు పెంటగాన్ పత్రాలు వెల్లడించాయి. ఉక్రెయిన్ చేరిన వేలటన్నుల ఆయుధాలు ఎక్కడకు వెళుతున్నదీ తెలుసుకొనేందుకు కొందరు తమ మిలిటరీ అధికారులు అక్కడ ఉన్నట్లు అమెరికా జాతీయ భద్రతా మండలి ప్రతినిధి అంగీకరించాడు. ఉక్రెయిన్ సంక్షోభం తొలి రోజుల్లో రష్యా యుద్ధ పాటవం పెద్ద లెక్కలోది కాదని ఐరోపా, ఇతర దేశాల జనాలను నమ్మించిన నాటో కూటమి ఇప్పుడు రష్యాను ఒక బూచిగా చూపుతున్నది. సోవియట్ యూనియన్ ఉనికిలో ఉన్నపుడు ఐరోపాను ఉపయోగించుకున్న అమెరికా, తాజాగా అదే ఐరోపా దేశాలతో కలసి ఉక్రెయిన్ను పరిశోధనశాలల్లో గినియా పందుల మాదిరి, తరువాత మరోసారి అమెరికా ఐరోపాను సమిధగా వినియోగించుకోవచ్చని పరిశీలకులు చెబుతున్నారు. రష్యన్లు ఐరోపాను ఆక్రమించుకుంటారన్న ప్రచారం దానిలో భాగమే అన్నది స్పష్టం. అమెరికా గద్దె మీద ఎవరున్నా తమ కార్పొరేట్ల, రాజకీయ ప్రయోజనాలు, ప్రపంచాధిపత్యానికే అగ్రపీఠం వేస్తారని తెలిసిందే. ★

సందర్భం


పాలకుల నిర్లక్ష్యంతో

మసకబారుతున్న విశాఖ

"ఈ ప్రాంత అభివృద్ధికి ఏం చేస్తే మేలు జరుగుతుందనే అంశంపై ఇటీవల సిపిఎం "వైజాగ్ మేనిఫెస్టో" విడుదల చేసింది. ప్రధాన రాజకీయ పార్టీలు ప్రజలను భ్రమల్లో ఉంచి ఓట్లు దండుకోవడం కాకుండా, నిజంగా విశాఖపట్నం అభివృద్ధి చెందాలంటే ఐదు ప్రధాన అంశాలు కచ్చితంగా అమలు జరపాలని సిపిఎం వైజాగ్ మేనిఫెస్టోలో పేర్కొంది. మొదటిది- రాష్ట్ర విభజన చట్టం సంపూర్ణంగా అమలు జరగడం. రెండోది- విశాఖ ప్రభుత్వ రంగ పరిశ్రమలను బలోపేతం చేయడం. స్టీల్ ప్లాంట్ అమ్మకం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవడం, దానికి సొంతగనులు కేటాయించడం, పటిష్ట పరచడం. మూడోది- ప్రభుత్వ విద్య, వైద్యం బలోపేతం చేయడం. నాలుగోది- పర్యావరణాన్ని పరిరక్షించడం. ఐదోది- మౌలిక వసతులు కల్పించడం."

ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత అతిపెద్ద నగరంగా ఉన్న విశాఖపట్నం....రాష్ట్ర విభజన తరువాత మరింత అభివృద్ధి చెందుతుందని అందరూ భావించారు. కానీ విచిత్రంగా 2014 తర్వాత నుండి అభివృద్ధి వేగం పెరగడం మాట అటు నుంచి క్రమంగా తగ్గడం ప్రారంభమైంది. 2014 రాష్ట్ర విభజన చట్టంలోని అనేక అంశాలు నేటికీ అమలు కాకపోవడం, విశాఖ ప్రభుత్వ రంగ పరిశ్రమలు క్రమేణా బలహీనపడటం నేటి స్థితికి ప్రధాన కారణాలు.

కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం విశాఖపట్నంలోని ప్రభుత్వ పరిశ్రమలను బలహీనపరుస్తోంది. అభివృద్ధిలో విశేషమైన పాత్ర పోషిస్తున్న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ను అమ్మేయాలని నిర్ణయించింది. మరో పక్క రాష్ట్ర విభజన చట్టంలోని అనేక అంశాలు అమలు చేయకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతోంది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా నిరాకరించడం, చట్టంలో పేర్కొన్న మెట్రో రైలు ఎగ్గొట్టడం, రైల్వే జోన్ ప్రకటనలకే పరిమితం చేసి నేటికీ స్థాపించకపోవడమే కాక రైల్వే డివిజన్ ఎత్తివేయడం, నీటి అవసరాలు తీర్చే పోలవరం, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టులను పూర్తి చేయకపో వడం, ఐటి రంగం అభివృద్ధి కాకపోవడం వంటివన్నీ కలిసి నేడు విశాఖ అభివృద్ధికి ఆటం కంగా నిలుస్తున్నాయి. విశాఖను పారిశ్రామిక రాజధానిగా అభివృద్ధి చేస్తామని ఒకరు, పరిపాలనా రాజధాని చేసేస్తామని ఇంకొకరు... ఇలా రాష్ట్రంలోని రెండు ప్రధాన పార్టీలు ఎన్ని ప్రగల్భాలు పలికినా అవేమీ నగరాభివృద్ధికి సహకరించడం లేదు సరిగదా, ఆ పేరుతో పెద్ద ఎత్తున భూకబ్జాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమ వుతున్నాయి. ఈ ప్రాంతంలోని చిన్న, సన్నకారు రైతుల భూములను భూబకాసురులు తన్నుకు పోతున్నారు. ఉపాధి, గృహవసతి పెద్ద సమస్యలుగా ముందుకు వస్తున్నాయి.



ఎం.జగ్గునాయుడు

రాష్ట్ర అసెంబ్లీకి, పార్లమెంటుకు మరో యాభై రోజుల్లో ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ ఎన్నికల్లో కూడా రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు అవే పాత హామీలనిస్తున్నాయి. రాష్ట్రానికి, ఈ ప్రాంతానికి తీరని ద్రోహం చేసిన బిజెపితో తెలుగుదేశం, జనసేన పార్టీలు జతకట్టాయి. రాష్ట్ర అధికార వైసిపి.... అన్ని సందర్భాలలోనూ మోడీ ప్రభుత్వానికి అండగా ఉంటోంది. స్టీల్ ప్లాంట్‌ను అమ్మేయాలనే మోడీ ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించి, దాన్ని కాపాడుకోవాలనే కనీస చిత్తశుద్ధిని కూడా ఈ మూడు పార్టీలు ప్రదర్శించడం లేదు. వారిలో వారు కలహించుకుంటూ, అసలు దోషి బిజెపిని మాత్రం పల్లెత్తు మాట అనడం లేదు.

ఈ నేపథ్యంలో ఈ ప్రాంత అభివృద్ధికి ఏం చేస్తే మేలు జరుగుతుందనే అంశంపై ఇటీవల సిపిఎం "వైజాగ్ మేనిఫెస్టో" విడుదల చేసింది. ప్రధాన రాజకీయ పార్టీలు ప్రజలను భ్రమల్లో ఉంచి ఓట్లు దండుకోవడం కాకుండా, నిజంగా విశాఖపట్నం అభివద్ధి చెందాలంటే ఐదు ప్రధాన అంశాలు కచ్చితంగా అమలు జరపాలని సిపిఎం వైజాగ్ మేనిఫెస్టోలో పేర్కొంది. మొదటిది- రాష్ట్ర విభజన చట్టం సంపూర్ణంగా అమలు జరగడం. రెండోది- విశాఖ ప్రభుత్వ రంగ పరిశ్రమలను బలోపేతం చేయడం. స్టీల్ ప్లాంట్ అమ్మకం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవడం, సొంత గనులు కేటాయించడం, పటిష్ట పరచడం. మూడోది- ప్రభుత్వ విద్య, వైద్యం బలోపేతం చేయడం. నాలుగోది- పర్యావరణాన్ని పరిరక్షించడం. ఐదోది- మౌలిక వసతులు కల్పించడం.

ఆంధ్ర రాష్ట్రానికి తలమానికంగా నిలిచి ఉన్నత విద్యా రంగంలో విశేషమైన కృషి చేసిన ఆంధ్ర యూనివర్సిటీ నేడు పూర్తిగా కళావిహీనమైపోయింది. స్వార్థ రాజకీయ ప్రయోజనాలకు వేదికగా మారిపోయింది. టీచింగ్ సిబ్బంది లేకపోవడంతో విద్య ప్రమాణాలు క్షీణిస్తున్నాయి.

విశాఖ, ఉత్తరాంధ్రకే కాక ఒరిస్సా, ఛత్తీస్‌ఘడ్ వంటి రాష్ట్రాల ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న విశాఖలోని కింగ్ జార్జ్ ఆసుపత్రి (కెజిహెచ్) నేడు మౌలికవసతుల్లేక, డాక్టర్లు, సిబ్బంది కొరతతో విలవిలలాడుతోంది. ప్రభుత్వం, వైద్యం మీద పెడుతున్న ఖర్చు క్రమేణా తగ్గడంతో ఈ ఆసుపత్రి కళావిహీనంగా మారుతోంది.

వైశాల్యంలో దేశంలోనే కీలక నగరంగా ఉన్న విశాఖపట్నం నేడు తీవ్రమైన పర్యావరణ సమస్యలను ఎదుర్కొంటోంది. ఇప్పటికే ఉన్న కాలుష్యానికి తోడు, ప్రైవేట్ రంగంలోని గంగవరం పోర్టు నుండి వెలువడుతున్న కాలుష్యం గాజువాక, మల్కాపురం తదితర ప్రాంతాలను పూర్తిగా కమ్మేస్తోంది. ప్రజలు అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. దీనిని నివారించకపోతే ప్రజలు నివసించడానికి వీలులేని స్థితి ఏర్పడుతుంది. అనేక గ్రామాలను, అనకాపల్లి, భీమిలి మున్సిపాలిటీలను విశాఖపట్నంలో విలీనం చేసి గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జివిఎంసి)ను ఏర్పాటు చేశారు. అయితే దానికి తగ్గట్లుగా మౌలికవసతుల కల్పన మెరుగుపడలేదు. విలీన ప్రాంతాల్లో రోడ్లు, మంచినీటి సదుపాయాలు, వీధిలైట్లు, డ్రైనేజీ వ్యవస్థ నేటికీ అధ్వానంగా ఉన్నాయి. మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన కళ్యాణ మండపాలను సామాన్యులకు అందుబాటులో లేకుండా ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చేశారు. క్రీడా మైదానాలు, ఇండోర్ స్టేడియం, అక్వేరియం వంటివి పూర్తిగా లీజుకు ఇచ్చేశారు. పెద్దఎత్తున ఛార్జీలు వసూలు చేయడంతో ఇవి సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయాయి.

ఉపాధికై పొట్ట చేత పట్టుకుని విశాఖకు వలసలు వస్తున్న అనేకమంది పేద ప్రజలకు గృహ వసతి పెద్ద సమస్యగా మారింది. అనేక మందికి నిలువ నీడలేని పరిస్థితి ఏర్పడింది గృహ వసతి కల్పించవలసింది పోయి మురికివాడల నిర్మూలన పేరుతో ఇక్కడ నివసిస్తున్న పేదలను ప్రభుత్వం సుదూర ప్రాంతాలకు తరలించడంతో వీరికి గృహ వసతి మాట అటుంచి, ఉపాధే పెద్ద సమస్యగా మారింది. ఏ ఉపాధి గురించి అయితే వీరు విశాఖపట్నం వచ్చారో ఆ ఉపాధికే దూరమయ్యే పరిస్థితి ఏర్పడింది. ప్రజలందరికీ గృహవసతి కల్పించడం అనే లక్ష్యంతో ఏర్పడిన విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్మెంట్ అథారిటీ (విఎంఆర్‌డిఎ) ఆ లక్ష్యానికి పూర్తిగా భిన్నంగా నేడు ఒక పెద్ద రియల్ ఎస్టేట్ సంస్థగా మారిపోయింది. దీనికి తోడు పంచ గ్రామాల భూ సమస్య, గాజువాక ఇనాం భూ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుండా ఉండడంతో వేలాదిమంది గృహ యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నేడు కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల ప్రభుత్వ సంస్థలు బలహీన పడుతున్నాయి. తక్కువ వేతనాలు, ఉద్యోగ భద్రత లేని కాంట్రాక్టు వ్యవస్థ సర్వ వ్యాపితమయింది. సముద్ర తీర మత్స్యకారులు కాలుష్యం, కార్పొరేటీకరణ వల్ల ఉపాధి కోల్పోతున్నారు. స్థిరమైన ఆదాయం, ఎటువంటి హక్కులూ లేని అసంఘటిత రంగం భారీగా పెరుగుతోంది. ఒకప్పుడు వివిధ ప్రభుత్వ రంగ సంస్థలలో మెరుగైన ఉపాధికై విశాఖపట్నం గ్రామీణ ప్రజానీకాన్ని ఆకర్షించింది. నేడు దానికి భిన్నంగా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం గిట్టుబాటు కాక అక్కడ నుంచి నెట్టివేయబడ్డ ప్రజానీకం చిన్న చిన్న ఉపాధి పనుల కోసం విశాఖ నగరానికి వలసలు వస్తున్నారు.

అందరికీ మెరుగైన ఉపాధి కల్పన ద్వారానే ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందుతుంది. ప్రజల జీవన ప్రమాణాలు పెరగడమే అసలైన అభివృద్ధి. ఇటువంటి అభివృద్ధి సాధించాలంటే సిపిఎం మేనిఫెస్టోలో పేర్కొన్న ఐదు ప్రధాన అంశాలు కచ్చితంగా అమలు జరగాలి. ఈ అంశాలు రాజకీయ పార్టీలు తమ ఎన్నికల ప్రణాళికలలో పేర్కొనడం, వాటిని అమలు చేసేలా ప్రజలు వత్తిడి తేవడం ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుంది.

(-రచయిత సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి)

సంతోషమే సగం బలం

సంతోషమే సగం బలం అని పెద్దలు అన్నారు గానీ..నిజానికి సంపూర్ణ బలమే. మనిషి సంతోషంగా ఉండడం వల్ల అనేక ప్రయోజనాలున్నాయి. సానుకూల దృక్పథం పెరిగి, సమస్యలను సులభంగా పరిష్కరించుకోగలం. శారీరక వ్యాయామాల పట్ల శ్రద్ధ, ఆటల మీద ఆసక్తి పెరుగుతుంది. సంతోషంగా ఉండే వాళ్లలో ఆత్మవిశ్వాసం అధిక స్థాయిలో ఉంటుంది. కొత్త విషయాలు నేర్చుకోవాలనే ఆసక్తి పెరుగుతుందని అనేక శాస్త్రీయ అధ్యయనాలు పేర్కొంటున్నాయి. మనిషిలో సంతోషానికి సూచిక చిరునవ్వు. నేటి ఆధునిక యుగంలో ఇది మనిషి నుండి రోజురోజుకు దూరమైపోతుంది. దీంతో మనిషి తీవ్ర ఒత్తిడికి లోనై అనేక ఆరోగ్య సమస్యలను కొని తెచ్చుకుంటూ తమ జీవితాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో సంతోషం ప్రాముఖ్యతను గుర్తించిన మొదటి దేశం భూటాన్. 1970 వ సంవత్సరం నుంచే సంతోష సూచే నిజమైన ఆరోగ్య సూచని ప్రపంచానికి చాటింది . ఇక్కడ "జాతీయ ఆదాయం" కన్నా "జాతీయ సంతోషానికీ" అధిక ప్రాధాన్యత ఇస్తారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకొని 2013 నుంచి ఐక్యరాజ్య సమితి సంతోషం ప్రాముఖ్యతను ప్రపంచవ్యాప్తంగా తెలియజేస్తూ, ప్రజల జీవన విధానంలో మార్పు తేవడానికి ప్రతియేటా మార్చి 20వ తేదీన "అంతర్జాతీయ సంతోష దినోత్సవాన్ని" నిర్వహిస్తోంది. ఈ సంవత్సరం "ఆనందం కోసం పునర్నిర్మాణం కావడం, దానికనుగుణమైన సమాజాలను నిర్మించడం" అనే ఇతివృత్తంతో నిర్వహించుకోవడం జరుగుతుంది. ఈ ఇతివృత్తం కలయికను పెంపొందించడం, సామాజిక బంధాలను బలోపేతం చేయడం, సంతోషం, శ్రేయస్సును ప్రోత్సహించడానికి అనుగుణమైన సంఘాలను నిర్మించాల్సిన ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది. ప్రజల జీవన ప్రమాణాల్లో మార్పులు తీసుకొస్తూ, ఆనందాన్ని నింపడానికి ఐక్యరాజ్యసమితి 2015వ సంవత్సరంలో "సుస్థిర అభివృద్ధి లక్ష్యాల"ను కూడా నిర్దేశించింది. వాటి ముఖ్య లక్ష్యం కూడా మానవుడు సంతోషం, శ్రేయస్సుతో బతకడమే. పేదరికం అంతం చేయడం, అంతరాలను తగ్గించడం, భూగోళాన్ని రక్షించడం లాంటి మూడు సార్వత్రిక లక్ష్యాలను ప్రపంచ దేశాల ముందుంచింది.

(మార్చి 20న అంతర్జాతీయ సంతోష దినోత్సవం సందర్భంగా)

-సంపతి రమేష్ మహారాజ్

సామాజిక విశ్లేషకులు

7989579428

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

విఆర్ న్యాయ కళాశాల స్టూడెంట్స్ ఫెస్ట్‌లో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు



స్టూడెంట్స్ ఫెస్ట్‌లో ప్రసంగిస్తున్న ఎంఎల్‌సి లక్ష్మణరావు

ప్రజాశక్తి - నెల్లూరు

భారత రాజ్యాంగం మహోన్నతమైనదని, దీనిని నిశితంగా అర్థం చేసుకొని రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత భవిష్యత్తు న్యాయవాదులదైన న్యాయ విద్యార్థులపై ఉందని ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు అన్నారు. నెల్లూరులోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన విఆర్ న్యాయ కళాశాల స్టూడెంట్స్ ఫెస్ట్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మన దేశ రాజ్యాంగం విశిష్టతను వివరించారు. హైకోర్టు ప్రముఖ న్యాయవాది, ఐలు రాష్ట్ర కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజాన్ని అర్థం చేసుకొని అధ్యయనం చేయడం ద్వారా మంచి న్యాయవాదిగా స్థిరపడవచ్చన్నారు. ఇండియన్ పీనల్ కోడ్ సబ్జెక్టులను వివరించారు. విలువలు పాటించే న్యాయవాదులుగా తయారవ్వాలని సూచించారు. లా విద్య పూర్తయిన తర్వాత పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యేందుకు సహకరిస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో న్యాయవాదులు పచ్చా కిరణ్, గంపసుధీర్, వినేష్ పాల్గొన్నారు.


గాలులకు కూలిన విద్యుత్తు స్థంభం


భారీ వర్షానికి కూలిన విద్యుత్తు అలంకరణ స్థంభాలు

చీపురుపల్లిలో భారీ వర్షం

- కూలిన స్తంభాలు
- నష్టపోయిన చిరు వ్యాపారులు

ప్రజాశక్తి - చీపురుపల్లి (విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లా చీపురుపల్లిలో మంగళవారం సాయంత్రం సుమారు గంటన్నరపాటు భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, గాలులతో వడగండ్లు లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. కనకమహాలక్ష్మి జాతరకు వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన మూడు భారీ విద్యుత్ అలంకరణ స్థంభాలు, లావేరు రోడ్డులో వీధి దీపాల ఐరన్ స్థంభం కూలిపోయాయి. దీంతో, ప్రజలు భయాందోళనకు గురయ్యారు. అంబేద్కర్ విగ్రహం, గెడ్డమిల్లు, అమ్మవారి ఆర్చి వద్ద కర్రలతో ఏర్పాటు చేసిన విద్యుత్తు లైటింగ్స్ కూలిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. జాతర సందర్భంగా చిరు వ్యాపారులు రోడ్లపై ఏర్పాటు చేసుకున్న చిన్న చిన్న షాపులు చిందరవందరయ్యాయి. వర్షానికి తడిసి ముద్దవ్వడంతో నష్టపోయారు. జాతరలో ఏర్పాటు చేసే వినోద కార్యక్రమాల మిషనరీ తడిసిపోవడంతో ఆగిపోయాయి. చీపురుపల్లి నుండి అమ్మవారి ఆలయం వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు పునరుద్ధరణ పనులు చేపట్టారు. జాతర చివరి రోజున ఏటా సుమారు రెండు లక్షల సందర్శకులు వస్తుంటారు. వర్షం కారణంగా వారి రాకకు అంతరాయం ఏర్పడింది.

RBL BANK LTD.

RBL BANK apno ka bank

REGISTERED OFFICE: 1st Lane, Shahupuri, Kolhapur - 416001
National Office: 9th Floor, Techniplex-I, Off Veer Savarkar Flyover, Goregaon (West) Mumbai - 400062

లాంఛనప్రాయ స్వాధీనతా ప్రకటన

(స్థిరాస్తి కొరకు) రూల్ 8(1)

ఏదైతే, క్రింది సంతకందారు ఆర్‌బిఎల్ బ్యాంక్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్ 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8&9తో చదువబడే సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, రుణ ఖాతా నం. **809001764986** కు సంబంధించి, తేది: **16.10.2023** నాటి **డిమాండ్ నోటీసు** జారీచేసి, రుణగ్రహీత/లు **మస్తాన్‌రావు మాజెటి & చంద్రవతి మాజెటి** లను సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా **12 అక్టోబర్ 2023, 15 నవంబర్ 2023** నాటికి పూర్తి బకాయి మొత్తాలుగా **రూ.10,47,724.00** (రూపాయలు పది లక్షల నలభై నాలుగు వేల ఏడు వందల ఇరువై నాలుగు మాత్రమే) లను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది.

రుణగ్రహీత మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీత& సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు సదరు రూల్స్ యొక్క రూల్ 9తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, ఇందు దిగువ వివరించిన ఆస్తిని **15 మార్చి 2024**న **లాంఛనప్రాయంగా స్వాధీనంచేసుకున్నారు.**

ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, పై పేర్కొన్న మొత్తాలు మరియు దానిపై వడ్డీతో ఆర్‌బిఎల్ బ్యాంక్ లిమిటెడ్‌కు చెల్లించుటకులోబడి ఉంటుంది.

ఆస్తి యజమాని: మస్తాన్ రావు మాజేటి

సైటులో పై పేర్కొన్న వాటా కొరకు పూర్తి నిర్మాణంలో ఏదైతే నిర్మించిన 200చ.అ.ల విస్తీర్ణంతో 'డైమండ్ ప్లాజా' యొక్క గ్రౌండ్ ఫ్లోర్‌లో గల ఒక షాపు నం.4తోపాటు పూర్తి విస్తీర్ణం 400చ.గ.ల్లో 8చ.గ.లు లేదా 6.68చ.మీ.ల విస్తీర్ణపు సైటు యొక్క విడదీయలేని, సూచిచలేని మరియు వేరే భాగం సైటు మరియు **సరిహద్దులు:** తూర్పు: ఒపెన్ టు స్కై, దక్షిణం: ఈ ఆస్తి మరియు మున్సిపల్ రోడ్ మధ్యలో ఒపెన్ ఏరియా, పడమర: ఈ షాపు మరియు షాపు నం.3 మధ్య ఉమ్మడి గోడ, ఉత్తరం: ఈ షాపు మరియు షాపు నం.3 మధ్య ఉమ్మడి గోడ. ఈ సరిహద్దుల్లో ఈజిమెంట్స్& అప్పుటెనన్సెస్ మొ॥వాటి హక్కులతోపాటు కూడా మరియు ఉమ్మడి హక్కులన్నింటితో ఎంజాయిమెంట్‌తోసహా సదరు 'డైమండ్ ప్లాజా' యొక్క గ్రౌండ్ ఫ్లోర్ లోగల ఒక షాపు నం.4.

గుంటూరు జిల్లా, గుంటూరు సబ్-డిస్ట్రిక్ట్, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధులు, మున్సిపల్ పాత వార్డు నం.3, కొత్త వార్డు నం. 6, బ్లాక్ నం.7, టౌన్ సర్వే నం.418, మున్సిపల్ డోర్ నం.6-19-70, అసెస్మెంట్ నం.లు12296, 12297, 122298, 12299లకుగాను, 'డైమండ్ ప్లాజా' యొక్క విస్తీర్ణం 400చ.గ.లు గుంటూరు సిటీ, అరుండెల్‌పేట్ మెయిన్ రోడ్ వద్ద మొత్తంభాగం. **సరిహద్దులు:** తూర్పు: పి. సుబ్బారావుకు చెందిన కొంత ఆస్తి, విష్ణుభోట్ల సౌభాగ్య లక్ష్మికు చెందిన కొంత ఆస్తి మరియు విష్ణుభోట్ల వెంకట సుబ్రహణ్యంకు చెందిన కొంత ఆస్తి 54'-7", దక్షిణం: మున్సిపల్ కార్పొరేషన్ 6వ లైన్ రోడ్ 66'-0", పడమర: మున్సిపల్ కార్పొరేషన్ అరుండెల్‌పేట్ మెయిన్ రోడ్ 54'-6", ఉత్తరం: వి. రామకృష్ణకు చెందిన ఆస్తి-66'-0".

సెక్యూర్డ్ అసెట్స్ అనగా., ఇందు పేర్కొన్న ఆస్తిని విడిపించుకొనుటకు మా బ్యాంక్‌చే వెచ్చించిన అన్ని ఖర్చులు, చార్జీలు& వ్యయాలతోపాటు పై పేర్కొన్న బకాయి మొత్తాలను చెల్లించుట ద్వారా షార్ఫసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(8) యొక్క నియమాలపై శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది.

ప్రదేశం: గుంటూరు జిల్లా
తేది: 15.03.2024

అధీకృత అధికారి,
ఆర్‌బిఎల్ బ్యాంక్ లిమిటెడ్ తరపున

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ

కోడూరు బ్రాంచి (13951)
మెయిన్‌రోడ్డు, కోడూరు, కృష్ణా జిల్లా, ఎ.పి.

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

SCHEDULE 6 (RULE 8(1)) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్సియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ & ఇంటరెస్ట్ (రెండవ) చట్టం, 2002 (2002 యొక్క యాక్ట్ నెం. 54) ప్రకారము **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కోడూరు బ్రాంచి** యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారుడు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 నందలి సెక్షన్ 13(12)కు అనుబంధమైన రూల్ 9 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీత: 1) శ్రీ కోట ప్రసాద్, తండ్రి: కె.వెంకటేశ్వరరావు,** ఇంటి నెం.1-238, 1వ వార్డు, కోడూరు, కృష్ణా జిల్లా, ఎ.పి.-521328. **2) శ్రీ కోట కరుణ కుమార్, తండ్రి: కె.వెంకటేశ్వరరావు,** ఇంటి నెం. 1-238, 1వ వార్డు, కోడూరు, కృష్ణా జిల్లా, ఎ.పి.-521328. **3) శ్రీ కోట ఠాగూర్ అమరేంద్ర, తండ్రి: కె.రాఘవ రాజేంద్రప్రసాద్,** ఇంటి నెం.5-168, కోడూరు, కృష్ణా జిల్లా, ఎ.పి.-521328 వార్లు చెల్లించవలిసిన బకాయిమొత్తం **రూ.8,62,953.37 (అక్షరాల ఎనిమిది లక్షల అరవై రెండు వేల తొమ్మిది వందల యాభై మూడు రూపాయలు మరియు ముప్పై ఏడు పైసలు మాత్రమే)** మరియు వడ్డీ మరియు ఛార్జీలు చెల్లించవలసినదిగా సదరు నోటీసు తేదినుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **తేది.21-12-2023న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

ఋణగ్రహీత బకాయిసొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(4)కు అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూల్ 9 ప్రకారము **14 మార్చి 2024 తేదీన** దిగువ పేర్కొన్న **ఆస్తిని స్వాధీనత తీసుకోవడమైనదని** ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వారికి చెల్లించవలసిన బకాయిమొత్తం **రూ.8,62,953.37 (అక్షరాల ఎనిమిది లక్షల అరవై రెండు వేల తొమ్మిది వందల యాభై మూడు రూపాయలు మరియు ముప్పై ఏడు పైసలు మాత్రమే) (నోటీసు తర్వాత రికవరీ చేయబడిన మొత్తాన్ని తీసివేయాలి)** మరియు వడ్డీ మరియు ఛార్జీకి లోబడి వుండునని ఇందుమూలముగా ప్రత్యేకించి ఋణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

తనఖా పెట్టిన సదరు ఆస్తుల విమోచనకు ఋణగ్రహీతలు వారికి నిర్దేశించిన కాల వ్యవధి సదరు చట్టములోని సెక్షన్ 13కు అనుబంధమైన సబ్ సెక్షన్ (8) ప్రకారం కలిగియుందురనీ తెలియజేయడమైనది.

స్థిరాస్తి వివరములు

ఎ.పి.-521328, కృష్ణా జిల్లా, కోడూరు గ్రామము & మండలం, సమీప డి.నెం.14-47, 14వ వార్డు, ఆర్.యస్.నెం.523-1 లోని 97 చ॥గ॥ & ఆర్.యస్.నెం.523-2 లోని 484 చ॥గ॥ వెరశి మొత్తము 581 చ॥గ॥ విస్తీర్ణముగల ఇంటి స్థలము మరియు అందులోని ఎ.సి.షీట్ రూఫ్ షెడ్ స్థిరాస్తికి సంబంధించిన యావత్తు. **దీనికి హద్దులు తూర్పు:** కోట పోతురాజు & ఇతరుల యొక్క స్థలము; **దక్షిణం:** మురుగునీటి కాలువ; **పడమర:** చెరువు; **ఉత్తరం:** ప్రభుత్వ స్థలము.

తేది : 14-03-2024
ప్రదేశము : కోడూరు

సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

జాతీయ రహదారుల ప్రాధికారిక సంస్థ

(రోడ్డు రవాణా & రహదారుల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం)

Rc.G1A/1683/2021

O/o కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్,
NTR జిల్లా, విజయవాడ, తేదీ: 15..03.2024

బహిరంగ ప్రకటన

భూ యజమానులు/అక్కడ ఆసక్తి ఉన్న వ్యక్తుల కోసం జాతీయ రహదారి నిర్మాణం కోసం భూమిని స్వాధీనం చేసుకోవడం మరియు పరిహారం మొత్తాన్ని చెల్లించడం కోసం అవార్డును ప్రకటించడం.

ఖమ్మం నుండి విజయవాడ సెక్షన్-NH-163G ఎన్‌టీఆర్ జిల్లా జి. కొండూరు మండలం గడ్డమణుగు గ్రామంలోని R.S.No.105/1B2 మొదలైన వాటిలో 67632.45 చదరపు మీటర్ల విస్తీర్ణం కోసం గెజిట్ ఆఫ్ ఇండియా సంచిక S.O.No.3180(E), తేదీ: 09.08.2021 లో ప్రచురించబడిన NH చట్టం, 1956లోని సెక్షన్ 3A కింద జారీ చేయబడిన నోటిఫికేషన్‌కు జి. కొండూరు మండలం గడ్డమణుగు గ్రామం భూ యజమానులు/ఆసక్తి గల వ్యక్తులు ఆహ్వానించబడ్డారు. తదనుగుణంగా, NH చట్టం యొక్క 3D (1) క్రింద నోటిఫికేషన్ ను గెజిట్ ఆఫ్ ఇండియా సంచిక S.O.3683(E) తేదీ 04.08.2022 ద్వారా జారీ చేయబడినది మరియు కింది వార్తాపత్రికలలో ప్రచురించబడింది:

క్ర. సం.	నోటిఫికేషన్	ప్రచురించబడిన వార్తాపత్రికల పేర్లు	వార్తా పత్రికల తేదీ
1	సెక్షన్ 3A	ఆంధ్ర జ్యోతి, ది హిందూ	18.08.2021
2	సెక్షన్ 3G	ది హిందూ, ఆంధ్ర జ్యోతి	02.07.2023

ఎన్‌టిఆర్ జిల్లా లోని జి. కొండూరు మండలం గడ్డమణుగు గ్రామంలోని పేర్కొన్న భూమికి సంబంధించి కాంపిటెంట్ అథారిటీ (LA.) & జాయింట్ కలెక్టర్, NTR జిల్లా, విజయవాడ, అవార్డు నం.13/2023, తేదీ: 18.11.2023 ను NH చట్టం, 1956 సెక్షన్ 3G కింద జారీ చేసినట్లు తెలియచేయడమైనది.

భూసేకరణ ఏజెన్సీ (MORTH/NHAI/NHIDCL) కింద సంతకం చేసిన వారి వద్ద అవసరమైన పరిహారం మొత్తాన్ని ఉంచింది. NH చట్టం 1956 సెక్షన్ 3E ప్రకారం సంబంధిత భూ యజమానులకు/ఆసక్తిగల వ్యక్తులకు నోటీసులు కూడా జారీ చేయబడ్డాయి.

తదనుగుణంగా, సంబంధిత భూయజమానులందరికీ/ఆసక్తిగల వ్యక్తులందరికీ ఈ అదనపు పబ్లిక్ నోటీసు ద్వారా తెలియజేయబడింది/ప్రకటించబడింది ఏమనగా పరిహారం మొత్తం భూయజమానులందరికీ అందించబడుతుంది. ఇంకా, ఇది గమనించవచ్చు:

1. తమ బ్యాంక్ ఖాతా వివరాలను ఇప్పటికే సమర్పించినటువంటి భూ యజమానులందరికీ సంబంధించి పరిహారం మొత్తం భూమిరాశి పోర్టల్ ద్వారా వారి సంబంధిత బ్యాంకు ఖాతాలకు జమ చేయబడుతోంది.
2. తమ బ్యాంకు ఖాతాల వివరాలను సమర్పించని భూ యజమానులు, క్రింద సంతకం చేసిన వారి కార్యాలయంలో వెంటనే వివరాలు అందించి అలా చేయవచ్చు మరియు అటువంటి బ్యాంకు ఖాతా వివరాలు అందిన వారంలోపు మొత్తం వారి ఖాతాలకు జమ చేయబడుతుంది
3. పరిహారం మొత్తాన్ని స్వీకరించడానికి అర్హులైన ఇతర హక్కుదారులందరూ 60 రోజుల వ్యవధిలో ఏదైనా పని దినం ఉదయం 10.30 నుండి సాయంత్రం 5:00 గంటల మధ్య భూమిపై హక్కును రుజువు చేయవచ్చు

ఈ అదనపు పబ్లిక్ నోటీసు ద్వారా పరిహారం మొత్తాన్ని నిర్ణయించి, సంబంధిత భూ యజమానులు/అందులో ఆసక్తి ఉన్న వ్యక్తులకు టెండర్ చేసినందున, పరిహారం మొత్తాన్ని సేకరించడంలో విఫలమైతే వారి ఖాతాకు జమ అవుతుందని మరియు ఈ నోటీసును ప్రచురించిన తేదీ నుండి అరవై రోజుల వ్యవధి ముగిసిన తర్వాత మొత్తం చెల్లించినట్లు పరిగణించబడుతుంది అని గమనించాలి.

భూమి యజమానులు / దానిపై ఆసక్తి ఉన్న వ్యక్తులు దిగువ సంతకం చేసిన వారికి సబ్జెక్ట్ భూమిని స్వాధీనం చేసుకోవడానికి అప్పగించాలని పిలువబడతారు, లేని పక్షంలో 60 రోజుల వ్యవధి ముగిసిన తర్వాత పోలీసు సహాయంతో సబ్జెక్ట్ భూమిని స్వాధీనం చేసుకుంటారు.

కాంపిటెంట్ అథారిటీ (L.A) &
జాయింట్ కలెక్టర్, ఎన్‌టీఆర్ జిల్లా, విజయవాడ

BUILDING A NATION, NOT JUST ROADS

కేన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్

Can Fin Homes Ltd (Sponsor: CANARA BANK) HOME LOANS + DEPOSITS Translating Dreams into Reality

బ్రాంచ్ ఆఫీస్ : డి.నెం.40-5-19/17, 1వ ఫ్లోర్, సిద్ధార్థ కాలేజ్ బస్టాప్ దగ్గర, మొగల్రాజపురం, విజయవాడ - 520010. ఫోన్ : 0866 - 2474781.
ఇ-మెయిల్: vijaywada@canfinhomes.com, CIN : L85110KA1987LC008699

ఉద్దేశించిన అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 8(6) ప్రకారం

వీరికి,

1. **శ్రీ కృష్ణ మాతా (ఋణగ్రహీత),** 10-12-149, పి టి వీధి, మల్లిఖార్జునపేట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ - 520001.
2. **శ్రీమతి దుర్గా భవాని మాతా (సహ-ఋణగ్రహీత),** 10-12-149, పి టి వీధి, మల్లిఖార్జునపేట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ - 520001.

నెం.1&2 దిగువ ఆస్తుల తనఖా ద్వారా మా బ్యాంకు శాఖ నుండి మీలో **నెం.1 & 2కి** చెందిన ఆస్తి పై హౌసింగ్ ఋణం పొందినారు. సదరు ఋణం **తేది.29.10.2023** నాటికి ఎన్.పి.ఎ. అనగా నిరర్ధక ఆస్తిగా వర్గీకరించబడినది. అందుచే మీరు **తేది.01.11.2023** నాటి **డిమాండు నోటీసు** ప్రకారం బకాయి మొత్తం చెల్లించవలసినదిగా కోరడమైనది.

స్థిరాస్తి వివరములు

గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, ఉండవల్లి వద్ద ఆర్.ఎస్.నెం.126 లోని 209.92 చ॥గ॥ల విస్తీర్ణంలో 17 చ॥గ॥ల అవిభాజ్యపు వాటా విస్తీర్ణంతో "సాంబశివ రెసిడెన్సీ" మొదటి అంతస్తు నందు 435 చ॥అ॥ల ప్లింత్ ఏరియా, 100 చ॥అ॥ల కామన్ ఏరియా మరియు 30 చ॥అ॥ల స్కూటర్ పార్కింగ్ ఏరియాతో గల ఫ్లాట్ నెం.ఎఫ్ఎఫ్-బి. **ఫ్లాట్ హద్దులు : తూర్పు :** ఫ్లాట్ నెం.ఎఫ్ఎఫ్-ఎ, **పడమర :** ఫ్లాట్ నెం.ఎఫ్ఎఫ్-సి, **దక్షిణం :** ఓపెన్ స్పేస్, **ఉత్తరం :** కామన్ కారిడార్. **స్థలం హద్దులు : తూర్పు :** 12 అ॥ల వెడల్పు రోడ్డు, **దక్షిణం :** యన్నంశెట్టి సాంబశివరావు అలియాస్ సాంబయ్య గారికి చెందిన స్థలం, **పడమర :** వెలిపాలి సత్య సాయిబాబా గారి ప్రహరీ గోడ, **ఉత్తరం :** మదనపు శ్రీనివాసరావు గారి ఆస్తి.

డిమాండ్ నోటీసు ప్రకారం మీరు బకాయి చెల్లించలేదు. అందుచే దిగువ సంతకందారు అయిన అధీకృత అధికారి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8తో చదివే సెక్షన్ 13(4) యొక్క ప్రొవిజన్ ప్రకారం సెక్యూర్డు స్థిరాస్తులను స్వాధీనం చేసుకొన్నారు.

ఇందుమూలముగా కోరునది ఏమనగా లోన్ మొత్తం బకాయిలన్నీ అనగా **తేది.01.11.2023** నాటికి బకాయిలు **రూ.11,88,978/-** దీనితో కాంట్రాక్టు రేటు ప్రకారం అయిన వడ్డీ & ఖర్చులు చెల్లించవలసినదిగా కోరియున్నారు. ఈ విషయము గురించి మీకు ఆఖరిసారిగా ఇచ్చిన చిరునామాకు రిజిష్టర్డు పోస్టు ద్వారా నోటీసును పంపియున్నాము. అది అందకుండానే తిరిగి వచ్చినది. అందుచే ఈ పత్రికా ప్రకటన జారీ చేయడమైనది.

ఇది ఆఖరిసారిగా సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) లోని రూలు 8(6) ప్రకారం జారీ చేసిన నోటీసు. మీరు ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా పూర్తిగా బకాయి చెల్లించవలెను. విఫలమైనచో దిగువ సంతకందారు గారు వేలం తేదీ నిర్ణయించెదరు. వేలం నోటీసును ప్రచురించి సెక్యూర్డు స్థిరాస్తులను సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 ప్రకారం అమ్మకం చేసి, సెక్యూర్డు బకాయిలను రాబట్టుకొనెదరు.

తేది : 19-03-2024
ప్రదేశం: విజయవాడ

సం/- అధీకృత అధికారి
కేన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్.,

కేన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్

Can Fin Homes Ltd (Sponsor: CANARA BANK) HOME LOANS + DEPOSITS Translating Dreams into Reality

బ్రాంచ్ ఆఫీస్ : డి.నెం.40-5-19/17, 1వ ఫ్లోర్, సిద్ధార్థ కాలేజ్ బస్టాప్ దగ్గర, మొగల్రాజపురం, విజయవాడ - 520010. ఫోన్ : 0866 - 2474781.
ఇ-మెయిల్: vijaywada@canfinhomes.com, CIN : L85110KA1987LC008699

ఉద్దేశించిన అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 8(6) ప్రకారం

వీరికి,

1. **శ్రీమతి నాగ సుభాషిణి జూలూరు (ఋణగ్రహీత),** 12-50, రింగ్ సెంటర్, ఇబ్రహీంపట్నం, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ - 520221.
2. **శ్రీ మాధవరావు జూలూరు (సహ-ఋణగ్రహీత),** 12-50, రింగ్ సెంటర్, ఇబ్రహీంపట్నం, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ - 520221.

నెం.1&2 దిగువ ఆస్తుల తనఖా ద్వారా మా బ్యాంకు శాఖ నుండి మీలో **నెం.1కి** చెందిన ఆస్తి పై హౌసింగ్ ఋణం పొందినారు. సదరు ఋణం **తేది.29.10.2023** నాటికి ఎన్.పి.ఎ. అనగా నిరర్ధక ఆస్తిగా వర్గీకరించబడినది. అందుచే మీరు **తేది.01.11.2023** నాటి **డిమాండు నోటీసు** ప్రకారం బకాయి మొత్తం చెల్లించవలసినదిగా కోరడమైనది.

స్థిరాస్తి వివరములు

కృష్ణాజిల్లా, ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్, ఇబ్రహీంపట్నం గ్రామం, గ్రామ పంచాయితీ, ఆర్.ఎస్.నెం. 205/1B, 205/1C, 205/3A ,205/4A, 205/4B లోని 260 చ॥గ॥లు (217.39 చ॥మీ॥లు) మొత్తం విస్తీర్ణంలో 40 చ॥గ॥లు (33.44 చ॥మీ॥లు) అవిభాజ్యపు వాటా విస్తీర్ణంతో 'సుబ్రహ్మణ్యేశ్వర రెసిడెన్సీ" రెండవ అంతస్తు నందు 820 చ॥అ॥ల ప్లింత్ ఏరియా, 110 చ॥అ॥ల కామన్ ఏరియా మరియు 20 చ॥అ॥ల టూ వీలర్ పార్కింగ్, అన్నీ ఈజిమెంట్ హక్కులతో గల ఫ్లాట్ నెం. ఎస్-1. **స్థలం హద్దులు : తూర్పు :** ఫ్లాట్ నెం.7 - 65 అ॥లు, **దక్షిణం :** ఇతరుల ఆస్తి - 34 అ॥లు, **పడమర :** ఫ్లాట్ నెం.5 - 65 అ॥లు, **ఉత్తరం :** 33 అ॥ల వెడల్పు రోడ్డు - 38 అ॥లు., **ఫ్లాట్ హద్దులు : తూర్పు :** ఓపెన్ టు స్కై, **దక్షిణం :** ఓపెన్ టు స్కై, **పడమర :** ఓపెన్ టు స్కై, **ఉత్తరం :** కామన్ కారిడార్.

డిమాండ్ నోటీసు ప్రకారం మీరు బకాయి చెల్లించలేదు. అందుచే దిగువ సంతకందారు అయిన అధీకృత అధికారి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8తో చదివే సెక్షన్ 13(4) యొక్క ప్రొవిజన్ ప్రకారం సెక్యూర్డు స్థిరాస్తులను స్వాధీనం చేసుకొన్నారు.

ఇందుమూలముగా కోరునది ఏమనగా లోన్ మొత్తం బకాయిలన్నీ అనగా **తేది.01.11.2023** నాటికి బకాయిలు **రూ.24,40,212/-** దీనితో కాంట్రాక్టు రేటు ప్రకారం అయిన వడ్డీ & ఖర్చులు చెల్లించవలసినదిగా కోరియున్నారు. ఈ విషయము గురించి మీకు ఆఖరిసారిగా ఇచ్చిన చిరునామాకు రిజిష్టర్డు పోస్టు ద్వారా నోటీసును పంపియున్నాము. అది అందకుండానే తిరిగి వచ్చినది. అందుచే ఈ పత్రికా ప్రకటన జారీ చేయడమైనది.

ఇది ఆఖరిసారిగా సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) లోని రూలు 8(6) ప్రకారం జారీ చేసిన నోటీసు. మీరు ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా పూర్తిగా బకాయి చెల్లించవలెను. విఫలమైనచో దిగువ సంతకందారు గారు వేలం తేదీ నిర్ణయించెదరు. వేలం నోటీసును ప్రచురించి సెక్యూర్డు స్థిరాస్తులను సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 ప్రకారం అమ్మకం చేసి, సెక్యూర్డు బకాయిలను రాబట్టుకొనెదరు.

తేది : 19-03-2024
ప్రదేశం: విజయవాడ

సం/- అధీకృత అధికారి
కేన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్.,

కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్

CanFinHomes Ltd (Sponsor: CANARA BANK) HOME LOANS + DEPOSITS Translating Dreams into Reality

బ్రాంచి చిరునామా : 40-5-19/17, 1వ అంతస్తు, సిద్ధార్థ కాలేజి బస్టాప్ దగ్గర, మొగల్‌రాజపురం, విజయవాడ - 520010. సెల్ : 7625079119
Email: vijaywada@canfinhomes.com. CIN:L85110KA1987LC008699

స్థిరాస్తి అమ్మకం కొరకు ప్రకటన

అనుబంధం IV-A రూల్ 9(6) కి సంబంధించిన నిబంధనలను చూడండి (సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002 లోని రూల్ 8 (6) సదుపాయము క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకపు నోటీసు

ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా ఋణగ్రహీత (లు) మరియు హామీదారు (లు) ఈ దిగువ తెలిపిన స్థిరాస్తులు తనఖా / ఛార్జ్‌డ్, సెక్యూర్డ్ క్రెడిటార్ వారికి ఉంచబడినవి. సదరు ఆస్తులు అధీకృత అధికారి, **కేన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్, విజయవాడ** బ్రాంచి వారిచే భౌతికంగా స్వాధీనత చేసుకోబడి **తేది. 24-04-2024న "ఎక్కడ ఉన్నది అక్కడే","అక్కడ ఏమున్నదో అదే" మరియు "అక్కడ ఏది ఉన్నా సరే"** అనే ప్రాతిపదికపై అమ్మకం జరుపబడును. కేన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్ వారిచే **శ్రీమతి రాజేశ్వరి రాంపిల్లి (ఋణగ్రహీత) మరియు శ్రీ మోహన్ కృష్ణ రాంపిల్లి(సహ-ఋణగ్రహీత).** తేది **19-03-2024** నాటికి చెల్లించవలసిన **బకాయి మొత్తము రూ. 25,59,046/- (అక్షరాల ఇరవై ఐదు లక్షల యాభై తొమ్మిది వేల నలభై ఆరు రూపాయలు మాత్రమే)** వసూలు కొరకు, తదుపరి వడ్డీ మరియు ఇతర అన్ని ఛార్జీలతో సహ, రిజర్వు ధర **16,20,000/- (అక్షరాల పదహారు లక్షల ఇరవై వేల రూపాయలు మాత్రమే) ధరావత్తు రూ. 1,62,000/- (అక్షరాల లక్ష అరవై రెండు వేల రూపాయలు మాత్రమే)**

స్థిరాస్తి వివరములు :

కృష్ణా జిల్లా, విజయవాడ, విద్యాధరపురం గ్రామం & పంచాయితీ, ఆర్.ఎస్.నెం. 19/7 వద్ద మొత్తం 3100 చ॥గ॥ల విస్తీర్ణంలోని నిర్మించిన పవన్ స్వర్ణశ్రీ టవర్స్ నందు అవిభక్త వాటా 29.52 చ॥గ॥ల ఆస్తితో పాటు పింత్ ఏరియా 790 చ॥అ॥లు, కామన్ ఏరియా 20 చ॥అ॥లు, కార్ పార్కింగ్ ఏరియా 80 చ॥అ॥ మరియు స్కూటర్ పార్కింగ్ ఏరియా 20 చ॥అ॥లతో నాల్గవ అంతస్తు నందు ఫ్లాట్ నెం. 8కి చెందిన నివాస ఫ్లాట్. **హద్దులు : ఫ్లాట్‌కి హద్దులు : తూర్పు :** ఫ్లాట్ నెం. 14, **పడమర :** కారిడార్, **దక్షిణం :** శూన్యాకాశము మరియు ఫ్లాట్ నెం. 7, **ఉత్తరం :** శూన్యాకాశము మరియు ఫ్లాట్‌నెం. 9. **స్థలమునకు హద్దులు : తూర్పు :** నరసింహారావు మరియు ఇతరులకు చెందిన ఆస్తి, 30 అ॥ వెడల్పు మున్సిపల్ రోడ్డు, **పడమర :** బుచ్చయ్య గారి ఆస్తి, **దక్షిణ :** సితార థియేటర్, **ఉత్తరం :** ఆళ్ళ వెంకట అప్పారెడ్డి గారు ఇతరులకు విక్రయించిన ఆస్తి.

అమ్మకం పూర్తి నియమములు మరియు నిబంధనలు కేన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్ వారి అధికారిక వెబ్‌సైట్ : **(www.canfinhomes.com)** నందు ఇవ్వబడినవి. దయచేసి ఈ క్రింది లింక్‌ను దర్శించండి **http://www.canfinhomes.com/searchauction.aspx.**

Encumbrance Nil

తేది : 19-03-2024
ప్రదేశం : విజయవాడ

సం/- అధీకృత అధికారి
కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్

ఎస్‌బిఎఫ్‌సి ఫైనాన్స్ లిమిటెడ్

SBFC

(గతంలో ఎస్‌బిఎఫ్‌సి ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్)
రిజిష్టర్డు ఆఫీసు: యూనిట్ నం.103, మొదటి అంతస్తు, సి& బి స్క్వేర్, సంగం కాంప్లెక్స్, గ్రామం చాకల, అంధేరి-కుర్ల రోడ్డు, అంధేరి (ఈస్ట్), ముంబయి-400059.

డిమాండ్ నోటీసు

ఏదైతే, ఇందు దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు **ఎస్‌బిఎఫ్‌సి ఫైనాన్స్ లిమిటెడ్** నుండి ఆర్థిక సహాయం పొందియున్నారు. పొందిన ఆర్థిక సహాయంపై అనేక పర్యాయాలు కోరినప్పటికీ, రుణగ్రహీతలు/తాకట్టుదారులు బకాయి తేదీ ప్రకారం అసలు మొత్తాలు మరియు వడ్డీలను తిరిగి చెల్లించుటలో వివిధ డిఫాల్టీచెందారు. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 ("సార్ఫసీ యాక్ట్") క్రింద మరియు సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, ఎస్‌బిఎఫ్‌సి ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి అనుమతితో, రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క మార్గదర్శకాల ప్రకారం ఎస్‌బిఎఫ్‌సి పుస్తకాలలో, ఇందు దిగువ పేర్కొన్న సదరు తేదీలలో ఖాతా అనునది నాన్-పెర్ఫామింగ్ అసెట్ గా వర్గీకరించబడి, దిగువ రుణగ్రహీతలు/తాకట్టుదారులను నోటీసులు స్వీకరించిన తేదీ నుండి 60 రోజుల్లోగా చెల్లించు తేదీ వరకు ఇన్సిడెంటల్ వ్యయాలు, ఖర్చులు, చార్జీలు మొ॥వాటితో నోటీసుల్లో పేర్కొన్న మొత్తాలను కాంట్రాక్చువల్ రేటున తదుపరి వడ్డీతోపాటు నోటీసుల్లో పేర్కొనబడిన మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడుచున్నది.
వారి గతంలో తెలిసిన చిరునామా పై వారికి నోటీసులు జారీచేయబడినవి కాని అవి వారికి బట్వాడా కాకుండానే వెనుదిరిగినవి మరియు అట్టి పరిస్థితుల్లో దాని గురించి ఈ బహిరంగ ప్రకటన రూపేనా తెలియజేయబడుచున్నది.

రుణగ్రహీత పేరు/ చిరునామా	డిమాండ్ నోటీసు & ఎన్‌పిఎ తేది	లోన్ మరియు బకాయి మొత్తాలు	సెక్యూర్డ్ అసెట్స్ వివరణ
1. అంగలకూడూరు రాంబాబు, 2. అంగలకూడూరు సునీతా, డోర్ నం. 3-298/1, మంగళగిరి, నిస్సిబ్లెస్సింగ్ చర్చి నావ్లూర్, గుంటూరు, ఆం.ప్ర.-522503.	నోటీసు తేది: 12 ఫిబ్రవరి, 2024, ఎన్‌పిఏ తేది: 6 డిసెంబర్ 2020.	రుణ ఖాతా నం. 536657 (పిఆర్00366423), రుణ మొత్తాలు: 13,00,000/-, పూర్తి బకాయి మొత్తాలు: 7 ఫిబ్రవరి 2024 నాటికి రూ.25,15,462/- (రూపాయలు ఇరువై ఐదు లక్షల పదిహేను వేల నాలుగు వందల అరవై రెండు మాత్రమే)	కృష్ణా జిల్లా, మంగళగిరి సబ్-రిజిస్ట్రార్, నావులూరు గ్రామం యొక్క డోర్ నం.3-300, డోర్ నం. 196/బి, డోర్ నం.198-ఎ లోగల దానిలో గ్రౌండ్& మొదటి అంతస్తుల ఆర్.సి.సి. భవనముతోపాటు 145-2చ.గ.లు (121-968చ.మీ.) ల విస్తీర్ణపు సైటు యొక్క మొత్తం భాగం మరియు సరిహద్దులు: (పత్రం నం.4243/2002 ప్రకారం) తూర్పు: ఇతరుల ఆస్తి, దక్షిణం: పొరంబోకు, పడమర: పంచాయత్ బజార్, ఉత్తరం: బుల్లా చంద్ర పాల్ ఆస్తి.

అట్టి పరిస్థితుల్లో, ఇందుమూలంగా పై రుణగ్రహీత, సహ-రుణగ్రహీతలకు ప్రకటన ఇవ్వడమేమనగా, ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 60 రోజుల్లోగా తదుపరి వడ్డీ& వర్తించబడు చార్జీలతోపాటు పై పేర్కొన్నట్లు బకాయి మొత్తాలను చెల్లించవలసిందిగా కోరబడుచున్నది, విఫలం చెందిన ఏదైతే, ఈ నోటీసు తేది యొక్క 60 రోజులు ముగిసిన తరువాత షార్ఫసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(4) క్రింది మరియు దాని క్రింది వర్తించబడు రూల్స్ క్రింద రుణగ్రహీతలు మరియు తాకట్టుదారుల సెక్యూర్డ్ అసెట్స్ స్వాధీనంచేసుకొనుటతోసహా సెక్యూర్డ్ అసెట్స్ పై తదుపరి చర్యలు తీసుకోబడుతాయి.
షార్ఫసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(13) క్రింద దయచేసిగమనించగలరు, సెక్యూర్డ్ క్రెడిటర్ యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనుమతిలేనిదే, నోటీసులో పేర్కొన్న అతని సెక్యూర్డ్ అసెట్స్‌ను అమ్మకం, లీజు లేదా ఇతర విధానాల ద్వారా రుణగ్రహీత బదిలీచేయలేరు.

తేది: 20 మార్చి 2024
ప్రదేశం: ఆం.ప్ర.

సం/- అధీకృత అధికారి, ఎస్‌బిఎఫ్‌సి ఫైనాన్స్ లిమిటెడ్

నిడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

nido HOME FINANCE

(గతంలో ఇడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేరుగలది) రిజిష్టర్డు ఆఫీసు: 5వ అంతస్తు, టవర్-3, వింగ్-బి, కోహినూర్ సిటీ మాల్, కోహినూర్ సిటీ, కిరోల్ రోడ్, కుర్ల (వెస్ట్), ముంబయి-400070.
బ్రాంచ్ ఆఫీస్ చిరునామా: - 3వ & 4వ అంతస్తు, శ్రీ ప్రశాంతి సాయి టవర్స్, ప్లాట్ నెం 68, మునిసిపల్ నెం 8-2-248, నాగార్జున హిల్స్, రోడ్ నెం 1, బంజారా హిల్స్, పంజాగుట్ట దగ్గర, హైదరాబాద్ - 500082

ఇ-వేలం - చట్టబద్ధ 30 రోజుల అమ్మకపు ప్రకటన

ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 మరియు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 క్రింద ఇ-వేలం ద్వారా అమ్మకం. ఇందుమూలంగా సర్వజనులకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీతలు మరియు హామీదారులకు ప్రకటన ఇవ్వడమేమగనా, దిగువ పేర్కొన్న ఆస్తిని రుణ బకాయిలను రికవరీచేయు వరకు పట్టికలో పేర్కొన్నట్లుగా మొత్తాలను రికవరీచేయుట కొరకు **"ఏది ఎక్కడ ఎలా ఉన్నది, అది అక్కడ అలాగే ఉంటుంది"** ప్రాతిపదికన విక్రయించబడుతుంది. సదరు ఆస్తిని రుణగ్రహీత(లు), సహ-రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)చే పొందిన రుణం కొరకు నిడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో ఇడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్)కు సదరు ఆస్తిని తాకట్టుపెట్టుట జరిగింది. దిగువ పేర్కొన్న సెక్యూర్డ్ అసెట్‌ను సెక్యూర్డ్ క్రెడిటర్ లాంఛనప్రాయంగా స్వాధీనంచేసుకున్నారు.

క్ర. సం.	రుణగ్రహీత(లు)/ సహ-రుణగ్రహీత(లు)/ హామీదారు/లు) పేరు	రికవరీ మొత్తాలు	రిజర్వు ధర& ధరావత్తు	వేలం తేది & సమయం	పరిశీలన తేది & సమయం	లాంఛనప్రాయ స్వాధీనం తేది
2	నాయినాల వేంకటేశ్వర రావు (రుణగ్రహీత), నాయనీలా పుష్ప లత (సహ-రుణగ్రహీత)	19.03.2024 నాటికి రూ.16,49,877.62 పై.లు (రూపాయలు పదహారు లక్షల నలభై తొమ్మిది వేల ఎనిమిది వందల డెబ్బై ఏడు మరియు అరవై రెండు పైసలు మాత్రమే) + దానిపై తదుపరి వడ్డీ + ఎల్ఏఎన్ నం. ఎల్‌విఐ-జెఎస్‌టిహెచ్0000028797 కొరకు లీగల్ వ్యయాలు.	రూ.19,65,000/- (రూపాయలు పందొమ్మిది లక్షల అరవై ఐదు వేలు మాత్రమే). ధరావత్తు డిపాజిట్: రూ.1,96,500/- (రూపాయలు ఒక లక్ష తొంబై ఆరు వేల ఐదు వందలు మాత్రమే)	30.04.2024 ఉ॥ 11గం.ల నుండి మ॥ 12గం.ల మధ్య (5నిమిషాల అపరిమిత ఆటో పొడిగింపుతో)	08-04-2024 between 11.00 am to 3.00 pm	08-01-2024
3	కొడాలి రాధిక (రుణగ్రహీత), కొడాలి ధనలక్ష్మి (సహ-రుణగ్రహీత)	19.03.20.... నాటికి రూ.25,68,592.40 పై.లు (రూపాయలు ఇరువై ఐదు లక్షల అరవైఎనిమిది వేల ఐదు వందల తొంబై రెండు మరియు నలభై పైసలు మాత్రమే) + దానిపై తదుపరి వడ్డీ + ఎల్ఏఎన్ నం. ఎల్‌విఐ-జెఎస్‌టిహెచ్ 0000063531 కొరకు లీగల్ వ్యయాలు.	రూ.36,15,000/- (రూపాయలు ముప్పై ఆరు లక్షల పదిహేను వేలు మాత్రమే). ధరావత్తు డిపాజిట్: రూ.3,61,500/- (రూపాయలు మూడు లక్షల అరవై ఒక వేల ఐదు వందలు మాత్రమే)	30.04.2024 ఉ॥ 11గం.ల నుండి మ॥ 12గం.ల మధ్య (5నిమిషాల అపరిమిత ఆటో పొడిగింపుతో)	08-04-2024 between 11.00 am to 3.00 pm	16-Mar-2023

సెక్యూర్డ్ అసెట్ వివరణ (క్ర.సం. 2): కృష్ణా జిల్లా, విజయవాడ-521137, పెనమలూరు (మం), తడిగడప, శ్రీనివాస నగర్, డోర్ నం.8-231/1, దీపిక రెసిడెన్సీ వద్ద ఆర్.ఎస్.నం.11/1బి, ప్లాట్ నం.6లో 208.33చ.గ.లు విస్తీర్ణంతో గ్రౌండ్ ఫ్లోర్, ఫ్లాట్ నం.జి.ఎఫ్-1గల మొత్తం భాగం. **ఆస్తి సరిహద్దులు: ఉత్తరం:** ఇతరు ఆస్తి, **దక్షిణం:** 24-0అ.ల వెడల్పు పంచాయతి రోడ్, **తూర్పు:** బొల్లపల్లి పరమేశ్వరికి చెందిన ప్లాట్ నం.5, **పడమర:** కొరివి రవీంద్ర బాబు ఆస్తి. పై నాలుగు సరిహద్దుల్లో: సైటు విస్తీర్ణం 208.33చ.గ.లు లేదా 174, 197చ.మీ.లు, విడదీయలేని విస్తీర్ణ బాగం 34.72చ.గ.లు లేదా 29.031చ.మీ.లు. **సరిహద్దులు: ఉత్తరం:** ఇతరుల ఆస్తి, **దక్షిణం:** పార్కింగ్, మెట్లు & ఉమ్మడి కారిడార్, **తూర్పు:** బొల్లపల్లి పరమేశ్వరికు చెందిన ప్లాట్ నం.5, **పడమర:** కొరివి రవీంద్ర బాబు ఆస్తి.

సెక్యూర్డ్ అసెట్ వివరణ (క్ర.సం. 3): కృష్ణా జిల్లా, విజయవాడ-521137, పెనమలూరు (మం), తడిగపాడు గ్రామం, 240చ.అ.ల ఉమ్మడి ఏరియా మరియు 100చ.అ.ల పార్కింగ్ ఏరియాతోపాటు 965చ.అ.ల ప్లింత్ ఏరియాతో, 48చ.గ.ల విస్తీర్ణంతో సాయి రామచంద్ర గ్రాండ్యూయర్, ఆర్.ఎస్.నం.122/17బి, 1వ అంతస్తు, నివాసిత ఫ్లాట్ నం.101 యొక్క మొత్తం భాగం, **సరిహద్దులు: ఉత్తరం:** ఒపెన్ టు స్కై, **దక్షిణం:** కారిడార్, లిఫ్టు& ఒపెన్ టు స్కై, **తూర్పు:** బాల్కనీ& ఒపెన్ టు స్కై, **పడమర:** ఒపెన్ టు స్కై.

గమనిక: 1) వేలం అమ్మకంను వెబ్‌సైట్ **https://sarfaesi.auctiontiger.net** ద్వారా ఆన్‌లైన్ నిర్వహించబడుతుంది మరియు అట్టి బిడ్డరుదారులు వాలిడ్ ఇమెయిల్, ఐడి ప్రూఫ్& ఫోటో ప్రూఫ్, పాన్ కార్డు మరియు డిమాండ్ డ్రాఫ్టు/ఎన్ఇఎఫ్‌టి/ఆర్‌టిజిఎస్ ద్వారా ధరావత్తు చెల్లించుట ద్వారా ఈ **"ఆన్-లైన్ వేలం"**లో పాల్గొవలెను.
2) ఆసక్తిగల బిడ్డరుదారులు వారి ధరావత్తును డిమాండ్ డ్రాఫ్ట్/ఎన్ఇఎఫ్‌టి/ఆర్‌టిజిఎస్ రూపేనా దాఖలుచేయవలెను: 3) **లబ్ధిదారు పేరు: ఇడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ బ్యాంక్; స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఖాతా నం.65226845199, సార్ఫసీ - యాక్షన్, ఇడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఐఎఫ్ఎస్‌సి కోడ్: ఎస్‌బిఐఎన్0001593.**
4) ధరావత్తుతోపాటు ఆన్‌లైన్ దరఖాస్తు బిడ్ ఫారం దాఖలుచేయుట కొరకు చివరి తేది: **29.04.2024**
5) అమ్మకం యొక్క వివరణాత్మక నియమాలు& షరతుల కొరకు, దయచేసి దర్శించండి: వెబ్‌సైట్ **https://sarfaesi.auctiontiger.net** లేదా దయచేసి సంప్రదించండి: **శ్రీమౌలిక్ శ్రీమాలి, ఫోన్: +91-6351896643/ 9173528727,** హెల్ప్‌లైన్ ఇమెయిల్ ఐడి: **Support@auctiontiger.net.**

మొబైల్ నం. 8885161710/ 8885462308
తేది: 20.03.2024

సం/- అధీకృత అధికారి, నిడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో ఇడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ పేరుగలది)

ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

ADITYA BIRLA CAPITAL — PROTECTING INVESTING FINANCING ADVISING

నమోదిత కార్యాలయం : ఇండియన్ రాయన్ కాంపౌండు, వేరవల్, గుజరాత్ 362266.
శాఖా కార్యాలయం : ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్ నం.40-2-5ఎ, సి.వి.ఆర్ చాంబర్, 6వ అంతస్తు, కళానికేతన్ ప్రక్కన, ఎం.జి.రోడ్, విజయవాడ-520010.
1. ఎబిహెచ్ఎఫ్ఎల్: అధీకృత అధికారి, శ్రీ రవి కుమార్ యాదవ్, సంప్రదించాల్సిన నం.7899965229 మరియు చిరాగ్ లోఖండే సంప్రదించాల్సిన నం.9773758208
2. వేలం సర్వీస్ ప్రొవైడర్ (ఏఎస్‌పి) మెసర్స్ గ్లోబ్‌టెక్ ఇన్ఫోసిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్-శ్రీ.సమీర్ చక్రవర్తి.

స్థిరాస్తుల అమ్మకం కొరకు విక్రయ నోటీసు

ది సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)కు నియమాలతో చదువుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద, స్థిరాస్తి అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్ 2002 (సర్ఫేసీ) యొక్క సెక్షన్ 13(2) కింద **ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారి/సెక్యూర్డ్ క్రెడిటార్ జారీ చేసిన నోటీసుకు అనుగుణంగా కింది సెక్యూర్డ్ అసెట్స్‌ని స్వాధీనం చేసుకున్నారు. సెక్యూర్డ్ క్రెడిటార్ కు ఉన్న బకాయి తదుపరి చార్జీలు మరియు దానిపై వ్యయాలతో రికవరీ కొరకు ప్రత్యేకించి రుణగ్రహీతలు మరియు సహ రుణగ్రహీతలు **ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్** బకాయి పడిన అప్పుల యొక్క రియలైజేషన్ కొరకు రుణగ్రహీతలు, సహ రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది సురక్షిత అప్పులు **"ఏది ఎక్కడ ఎలా ఉన్నది", "ఉన్నది ఉన్నట్లుగా" మరియు "అది అక్కడ అలాగే"** ప్రాతిపదికన క్రింద వివరించిన ఆస్తిని ఇ-వేలం ద్వారా అమ్మకానికి పెట్టబడుతుంది.

క్ర సం.	రుణగ్రహీత(లు)/సహ రుణగ్రహీత(లు) పేరు	ఆస్తులు సెక్యూర్డ్ అసెట్స్ వివరణ	డిమాండ్ నోటీసు ప్రకారం మొత్తం	రిజర్వు ధర	ఇఎమ్‌డి	ఇఎమ్‌డి చివరి తేది	తనిఖీ తేది మరియు సమయం	ఇ-వేలం తేది
1.	పచ్చిగోళ్ల సాయికుమార్, పచ్చిగోళ్ల సత్యవతి, పచ్చిగోళ్ల పరమేశ్వరరావు, ఎస్ఎస్ టిఫిన్ సెంటర్	కృష్ణాజిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రీ, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, పాయకాపురం, శ్రీ సాయి కపర్ది ఆర్కెడ్ లో ఉన్న మొత్తం ఆ ముక్క మరియు పార్సిల్ గ్రౌండ్ ఫ్లోర్ లో ఫ్లాట్ నం.జిఎఫ్-2, కొలత 33 చ.గ.లు. బయట 234.66 చ.గ.లు. బెరింగ్ ఆర్.ఎస్.నం.18/1, 19/2బి, 19/2సి, ఫ్లాట్ నం.19, మూల్యాంకనం నం.1073246891 మరియు **హద్దులు** : ఉత్తరం : ఓపెన్ టు స్కై, దక్షిణం : ఓపెన్ టు స్కై, తూర్పు : మెట్లకేస్ మరియు కామన్ కారిడార్, పడమర : ఓపెన్ టు స్కై.	రూ.29,17,393.37/- (ఇరవై తొమ్మిది లక్షల పదిహేడు వేల మూడు వందల తొంభై మూడు రూపాయల ముప్పై ఏడు పైసలు మాత్రమే) 11.01.2023 నాటికి.	రూ. 21,37,136.40/- (ఇరవై ఒక్క లక్షల ముప్పై ఏడు వేల ఒక వందా ముప్పై ఆరు రూపాయల నలభై పైసలు మాత్రమే)	రూ. 2,13,713.64 /- (రెండు లక్షల పదమూడు వేల ఏడు వందల పదమూడు రూపాయల అరవై నాలుగు పైసలు మాత్రమే)	08-04-2024	05-04-2024 మధ్య ఉ:11:00 నుండి సా:04:00 వరకు	09-04-2024
2.	శనగపాటి సోమ శేఖర్, శనగపాటి కుమార్‌స్వామి, శనగపాటి ధనలక్ష్మి, సోమ శేఖర్ కాంట్రాక్ట్ వర్క్స్, శనగపాటి కుమార్ స్వామి మరియు శనగపాటి ధనలక్ష్మి	ఆంధ్రప్రదేశ్, కృష్ణాజిల్లా, నందిగామ రిజిస్ట్రేషన్ ఉపజిల్లా, నందిగామ నగర పంచాయతీ ఏరియా, నందిగామ మండలం, నందిగామ టౌన్ ఆర్.ఎస్.నం.834/3 వద్ద ఉన్న "ట్రెండ్‌సెట్ టవర్స్" పేరుతో భవనంలో ఉన్న ఒకటవ అంతస్తులో మొత్తం ఆ ముక్క మరియు పార్సిల్ బి బ్లాక్, ఫ్లాట్ నం.101 మొత్తం కొలత 900 చ.అ.లు. ఫ్లాట్ తో అవిభక్త మరియు పేర్కొనబడని ఉమ్మడి వాటా విస్తీర్ణం 17 చ.గ.లు. బయట 1161.6 చ.గ.లు., మొత్తం కొలిచే ఏరియా 730 చ.అ.లు. మరియు **హద్దులు** : తూర్పు : ఓపెన్ టు స్కై, పడమర : ఓపెన్ టు స్కై, ఉత్తరం : ఉమ్మడి కారిడార్, దక్షిణం : ఓపెన్ టు స్కై.	రూ. 20,08,498/- (ఇరవై లక్షల ఎనిమిది వేల నాలుగు వందల తొంభై ఎనిమిది రూపాయలు మాత్రమే)	రూ.17,29,188/- (పదిహేడు లక్షల ఇరవై తొమ్మిది వేల ఒక వందా ఎనభై ఎనిమిది రూపాయలు మాత్రమే)	రూ. 1,72,918.80/- (ఒక లక్షా డెబ్బై రెండు వేల తొమ్మిది వందల పద్దెనిమిది రూపాయల ఎనభై పైసలు మాత్రమే)	08-04-2024	05-04-2024 మధ్య ఉ:11:00 నుండి సా:04:00 వరకు	09-04-2024

అమ్మకం యొక్క వివరణాత్మక నియమ మరియు నిబంధనల కొరకు, దయచేసి ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్/సెక్యూర్డ్ క్రెడిటర్ సూచించిన వెబ్‌సైట్ అనగా., **https://homefinance.adityabirlacapital.com**- ఆస్తుల-కొరకు-వేలం-క్రింద -సర్ఫేసీ యాక్ట్ లేదా **https://BestAuctionDeal.com** లో ఇవ్వబడిన లింకును పరిశీలించండి.

తేది: 20.03.2024
ప్రదేశం: విజయవాడ

సం/- అధీకృత అధికారి
ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

AXIS BANK LIMITED

రిటైల్ లెండింగ్ మరియు పేమెంట్ గ్రూప్ (లోకల్ ఆఫీసు/బ్రాంచ్): యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, డి.నెం.30-22-79, శ్రీ టవర్స్, 1వ అంతస్తు, ఏలూరు రోడ్, సీతారామపురం సర్కిల్, విజయవాడ-520002

రూల్-8(1) క్రింద లాంఛనప్రాయ స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, **యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్** (పూర్వం యుటిఐ బ్యాంక్ లిమిటెడ్‌గా పిలువబడినది) యొక్క అధీకృత అధికారి, దీని రిజిష్టర్డు ఆఫీస్: "త్రిషుల్", సామర్తేశ్వర్ టెంపుల్ ఎదురుగా, లా గార్డెన్ దగ్గర, ఎల్లిస్‌బ్రిడ్జి, అహ్మదాబాద్-380006, ఇతర దీని బ్రాంచ్ ఆఫీసు:**రిటైల్ లెండింగ్ మరియు పేమెంట్ గ్రూప్ (లోకల్ ఆఫీసు/బ్రాంచ్): యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, డి.నెం.30-22-79, శ్రీ టవర్స్, 1వ అంతస్తు, ఏలూరు రోడ్, సీతారామపురం సర్కిల్, విజయవాడ-520002** వద్ద కలిగియుండి మరియు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ చట్టం, 2002 కింద మరియు SARFAESI చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలతో రుణగ్రహీత / హామీదారులు / తనఖాదారులను కోరుతూ **డిమాండ్ నోటీసు** జారీచేయబడినది.

క్ర. సం.	దరఖాస్తుదారు/ సహ-దరఖాస్తుదారు/హామీదారుల పేరు/ చిరునామా	బాకీ రూ.లలో	ఈక్విటబుల్ తాకట్టుకు ఆఫర్‌చేసిన ఆస్తి మరియు స్వాధీనతా తేది
2	**1) శ్రీ నారదాసు కోటేశ్వరరావు,** తండ్రి నారదాసు శంకర్ రావు, డోర్ నెం.4-6-58, హనుమయ్య నగర్, 1వ లేన్, కొరిటిపాడు, చంద్రమౌళి నగర్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522007, **ఇక్కడ కూడా:** శ్రీ నారదాసు కోటేశ్వరరావు, (ఎంప్లాయి నెం.16909), కెరాఫ్ క్యాప్‌జెమిని టెక్నాలజీ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్, క్యాంపస్-6బి, ప్రిటెక్ పార్క్, బెలెహంద్రీ (గ్రా), బెంగళూరు, కర్ణాటక-560037. **2) శ్రీ నారదాసు శంకర్ రావు,** తండ్రి నారదాసుమస్తాన్ రావు, డోర్ నెం.4-6-257, హనుమయ్య నగర్, 2వ నగర్, కొరిటిపాడు, చంద్రమౌళి నగర్, గుంటూరు ఆంధ్ర ప్రదేశ్-522007. **డిమాండ్ నోటీసు తేదీ: 29-11-2023 రుణ ఖాతా నెం:** పిహెచ్ఆర్006906674673	**రూ.40,65,171/-** (రూపాయలు నలభై లక్షల అరవైఐదువేల ఒకవంద డెబ్బైఒకటి మాత్రమే)	గుంటూరు జిల్లా, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిమితుల్లోని గుంటూరు ఉపజిల్లాలో గుంటూరు గ్రామం, డోర్ నెం.1171లో టౌన్ సర్వే జరగలేదు మరియు సిటి ప్లాన్ గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ గుంటూరు గ్రామం ద్వారా ఇచ్చిన ఎండార్స్‌మెంట్ ప్రకారం, డోర్ నెం.1171/1లోని 400చ.గ.ల విస్తీర్ణంలో హక్కు కోసం విక్రయించే సైట్ **సరిహద్దులు: తూర్పు:** మొరబోయిన పద్మావతి ఆస్తి-50అ.లు, **దక్షిణం:** ఇతరులు సైట్-18 అ.లు, **పడమర:** విక్రేత బ్యాలెన్స్ సైట్-50అ.లు, **ఉత్తరం:** 25అ.ల వెడల్పు రోడ్డు-18అ.లు. ఈ సరిహద్దుల్లో 100 చ.గ.లు లేదా 83.61 చ.మీ.ల స్థలం మాత్రమే. **లాంఛనప్రాయ స్వాధీనం తేదీ: 15-03-2024**
3	**1) శ్రీ సికకొల్లి ఫణికుమార్,** తండ్రి సికకొల్లి శ్రీనివాసరావు, డోర్ నెం.2-38, ఈస్ట్‌బజార్, పొనుగుపాడు, పంచాయతీ ఆఫీసు దగ్గర, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522549, **ఇక్కడ కూడా: శ్రీ సికకొల్లి ఫణికుమార్, (ప్రొప్రైటర్)** కెరాఫ్ వరలక్ష్మి ట్రేడర్స్, డి.నెం.8-7-17, షాప్ నెం.4, ఎల్‌విఆర్ కాంప్లెక్స్, రేవేణు వార్డు నెం.1, గొల్లమూడి వారి వీధి, సత్తెన్నపల్లి, గుంటూరు-522403. **2) శ్రీమతి సీకకొల్లి సత్యవతి,** భర్త సికకొల్లి శ్రీనివాసరావు, డోర్‌నెం.2-38, ఈస్ట్ బజార్, పొనుగుపాడు, పంచాయతీ ఆఫీసు దగ్గర, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522549. **డిమాండ్ నోటీసు తేదీ: 18-11-2023, రుణ ఖాతా నెం:** పిహెచ్ఆర్006904451306	**రూ.29,73,604/-** (రూపాయలు ఇరవైతొమ్మిది లక్షల డెబ్బైమూడువేల ఆరువందల నాలుగు మాత్రమే)	**షెడ్యూల్-ఎ:** గుంటూరు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా సత్తెనపల్లి సబ్-రిజిస్టర్, మున్సిపల్ ఏరియా-సత్తెనపల్లి, సంతెన్నపల్లి గ్రామం, డి.నెం.151-1 పరిధిలోని ఎక4-82 సెంట్ల విస్తీర్ణంనకుగాను విజిటిఎం వుడా, గుంటూరు ఆర్ఎల్‌పి.నెం.68/2013/జిఎన్‌టి, ఫైల్ నెం.ఇ1-376/2013 ద్వారా ఆమోదించిన ప్లాట్ నెం.34, 35, 36, 37, 38, 47, 48, 49, 50 మరియు 51, నరసరావుపేట రోడ్, డోర్ నెం.20-2-81 సైట్. **సరిహద్దులు: తూర్పు:** 25 అ.ల వెడల్పు మున్సిపాలిటీ రోడ్-202 అ.లు, **దక్షిణం:** 30అ.ల వెడల్పు మునిసిపాలిటీ రోడ్-120 అ.లు, **పడమర:** 25 అ.ల వెడల్పు మున్సిపాలిటీ రోడ్-200 అ.లు, **ఉత్తరం:** 30అ.ల వెడల్పు మున్సిపాలిటీ రోడ్-120 అ.లు. ఈ సరిహద్దుల పరిధిలో 2678.9 చ.గ.లు లేదా 2239.87 చ.మీ.ల స్థలం. **షెడ్యూల్-బి:** పైన పేర్కొన్న షెడ్యూల్-ఏ యొక్క పార్ట్‌లో, "సంజీవని టవర్స్" (ఉమ్మడి ఏరియాతోకలిపి) లో గ్రౌండ్ ఫ్లోర్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ నెం.105తో పాటుగా 2678.9 చ.గ.ల విస్తీర్ణంనకుగాను 46.91చ.గ.ల విస్తీర్ణపు అవిభక్త పేర్కొనబడని వాటా స్థలం మొత్తం, **సరిహద్దులు: తూర్పు:** 8అ.ల వెడల్పు ఉమ్మడి కారిడార్, **దక్షిణం:** టోట్ లాట్ ఏరియా, **పడమర:** ఒపెన్ టు స్కై, **ఉత్తరం:** ఒపెన్ టు స్కై. ఈ సరిహద్దుల్లో 1095 చ.అ.ల ఉమ్మడి ఏరియాలతో పాటు ఫ్లాట్ ఏరియామరియు సాధారణ సౌకర్యాలు మరియు సాధారణ మార్గాలపై సులభతర హక్కులతో పాటు. **లాంఛనప్రాయ స్వాధీనం తేదీ: 15-03-2024**

తేది: 20-03-2024
ప్రదేశం: ఆంధ్రప్రదేశ్

సం/- అధీకృత అధికారి,
యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్



దీక్షల్లో కూర్చున్న స్టీల్‌ప్లాంట్ కార్మికులు

'ఉక్కు' ప్రయివేటీకరణ ఆపాలి

- పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)
రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను ఆపాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 1132వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ ఇఎస్ ఎండ్ ఎఫ్, ఇఎండి, సేఫ్టీ, టెక్, సెల్, ఆగ్రో, ఫారెస్ట్ విభాగాల ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ.. ఢిల్లీలో జరుగుతున్న ఎన్‌జెసిఎస్ సమావేశంలో విశాఖ స్టీల్ కార్మికులకు నూతన వేతనాలు అమలు చేయాలన్న నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ చర్యలను విడనాడి సొంత గనులు కేటాయించాలని కోరారు. కర్మాగారంలో పూర్తి స్థాయి ఉత్పత్తి జరిగేలా అన్ని చర్యలూ చేపట్టాలన్నారు. ఉక్కు ఉత్పత్తిలో నిరంతరం శ్రమిస్తున్న వారికి వేతనాలు పెంచకపోవడం దారుణమన్నారు. దీక్షల్లో పోరాట కమిటీ నాయకులు గంగాధర్, నీలకంఠం, బొంజు బాబు, గోవింద్, బంటు రాము, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి కడపలో భువనేశ్వరి పర్యటన

- నేడు గాలివీడు, 22న బద్వేల్‌లో కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి-కడప అర్బన్
టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి మూడ్రోజులపాటు కడప, అన్నమయ్య జిల్లాల్లో పర్యటించనున్నారు. 20, 21, 22వ తేదీల్లో ఆమె పర్యటన ఖరారైంది. 'నిజం గెలవాలి' అనే పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా కార్యకర్తల కుటుంబాలను పరామర్శిస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా బుధవారం అన్నమయ్య జిల్లాలోని గాలివీడు మండలం ఎగువగొట్టివీడు గ్రామంలో మృతి చెందిన కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించి చెక్కు అందజేయనున్నారు. మధ్యాహ్నం రాయచోటి పట్టణం రాజుల కాలనీలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తారు. అదే రోజు రాత్రికి తిరుపతిలో బస చేయనున్నారు. 21వ తేదీన తిరుమల దర్శనం చేసుకుని సాయంత్రానికి పోరుమామిళ్ల చేరుకుంటారు. కొత్తవీధి, బలిజకోట, చెన్నంపల్లి బాధిత కుటుంబాలను పరామర్శించి బద్వేల్‌కు చేరుకుంటారు. రాత్రికి బద్వేల్‌లోని ఆర్‌ఆర్ కన్వెన్షన్ హాల్‌లో బస, 22న బద్వేల్ పట్టణంలోని గుంతపల్లి, లింగారెడ్డిపల్లి, కలసపాడు మండలంలోని బ్రాహ్మణపల్లి, తెల్లపాడు గ్రామాల్లో పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించి చెక్కులు పంపిణీ చేయనున్నారు.

వలంటీర్ల విధులపై స్పష్టత కరువు

- ఎన్నికల కోడ్ నేపథ్యంలో గందరగోళం



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తోన్న వలంటీర్ల విధి, విధానాలపై స్పష్టత కరువైంది. రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చి నాలుగు రోజులు గడుస్తున్నా, వలంటీర్లు నిర్వర్తించాల్సిన విధులేమిటి? ఏ పని చేయాలి? ఏమి చేయకూడదు? తదితర అంశాలపై ఇప్పటికీ అయోమయం నెలకొంది. రాష్ట్రంలో ఎన్నికల షెడ్యూల్ విడుదల సందర్భంలోనూ ఎన్నికల సంఘం దీనికి సంబంధించి సరైన సమాచారం ఇవ్వలేదు.

వలంటీర్లు ఎన్నికల విధుల్లో పాల్గొనకూడదని, పార్టీలకు ఏజెంట్లుగా ఉండకూడదని మాత్రమే ఎలక్షన్ కమిషన్ తెలిపింది. ఇంకా వివిధ అంశాలపై ఎటువంటి స్పష్టతా ఇవ్వలేదు. దీంతో ఆయా జిల్లాల, మున్సిపాలిటీల ఉన్నతాధికారుల దగ్గర్నుంచి వలంటీర్ల వరకూ ఎటువంటి విధుల్లో ఉండాలనే అంశంపై నిర్ధారణకు రాలేకపోతున్నారు. గ్రామ, వార్డు సచివాలయశాఖ వలంటీర్ల సేవల వినియోగానికి సంబంధించి ఎటువంటి ఉత్తర్వులూ జారీ చేయలేకపోతోంది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో వలంటీర్లు వివిధ రకాల విధుల్లో నిమగ్నమవుతున్నారని రాజకీయ పార్టీల మధ్య పలుచోట్ల గొడవలూ తలెత్తుతున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం (గ్రామ-వార్డు సచివాలయశాఖ డేటా ప్రకారం) రాష్ట్ర వ్యాప్తంగా 2,56,084 వలంటీర్లు ఉన్నారు. వీరందరికీ ప్రతినెలా రూ.5 వేలు గౌరవ వేతనంగా ప్రభుత్వం చెల్లిస్తోంది. వైసిపి కార్యకర్తలు, సానుభూతి పరులనే వలంటీర్లుగా నియమించారని, పలు సమావేశాల్లో సిఎంతోపాటు పలువురు నాయకులు కూడా పేర్కొన్నారని, అందుకే వారికి పింఛన్ల పంపిణీ, ఇతర బాధ్యతల నుంచి ఈ ఎన్నికల సమయంలో మినహాయింపు ఇవ్వాలని ఎన్‌డిఎ కూటమి కోరుతుంది. వలంటీర్ల పనితీరు వల్ల ఓటర్లు ప్రభావితం అయ్యే అవకాశం ఉందని ఇటీవల ఎన్నికల సంఘానికి ఫిర్యాదులూ వెళ్లాయి. ఈ అంశంపై ఎన్నికల కమిషన్ ఎటువంటి స్పష్టతా ఇవ్వలేదు. వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయొచ్చా ? లేదా అనే విషయంపై కచ్చితమైన సమాధానమూ ఇవ్వలేదు. ఉన్నతాధికారులను సంప్రదించగా తమకు ఎటువంటి సమాచారమూ లేదని పేర్కొన్నారు. తమ పేరు పేపర్లలో రాయొద్దని కోరారు.

ఢిల్లీ మద్యం కేసులో కవిత పిటిషన్ ఉపసంహరణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో
ఢిల్లీ మద్యం కేసులో అరెస్టయిన బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత సుప్రీంకోర్టులో వేసిన రిట్ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. ఇందుకు సర్వోన్నత న్యాయస్థానం అనుమతినిచ్చింది. మద్యం కుంభకోణంలో దర్యాప్తు సంస్థలు తనపై ఎలాంటి బలవంతపు చర్యలు (అరెస్ట్) తీసుకోకుండా చూడాలంటూ కవిత గతేడాది మార్చిలో 105 పేజీలతో కూడిన రిట్ పిటిషన్ వేశారు. ఇందులో ఇడి ఆఫీసుకు మహిళలను విచారణకు పిలవవచ్చా? అనే అంశాన్ని కూడా సవాల్ చేశారు. అయితే గతేడాది కాలంగా ఈ పిటిషన్ వాయిదా పడుతూ వస్తోంది. కాగా, గత శుక్రవారం కవితను ఇడి అధికారులు హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో అరెస్టు చేశారు. కవిత గతంలో దాఖలు చేసిన పిటిషన్ మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్‌తో కూడిన ధర్మాసనం ముందుకు వచ్చింది. కవిత తరపున సీనియర్ న్యాయవాది విక్రమ్ చౌదరి పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు.

ఇడి కస్టడీలో ఉన్న తనను కలిసేందుకు అమ్మ, పిల్లలకు అనుమతినివ్వాలని కవిత రౌస్ అవెన్యూ కోర్టులో పిటిషన్ వేశారు. విచారణ జరిపిన కోర్టు అనుమతినిచ్చింది.

కవిత కేసు విచారించే న్యాయమూర్తి బదిలీ

ఎమ్మెల్సీ కవిత అరెస్టు కేసు విచారణ చేస్తున్న ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు న్యాయమూర్తి ఎంకె నాగ్‌పాల్ బదిలీ అయ్యారు. నాగ్‌పాల్ స్థానంలో న్యాయమూర్తి కావేరీ బవేజా నియమితులయ్యారు. ఢిల్లీ హైకోర్టు జ్యుడీషియల్ సర్వీసెస్‌లోని మరో 26 మంది న్యాయమూర్తులు కూడా బదిలీ అయ్యారు. అనూహ్యంగా జడ్జి నాగ్‌పాల్ కూడా బదిలీ కావడం గమనార్హం.

జొన్న ఇగురు తిని 80 గొర్రెలు మృతి

ప్రజాశక్తి- బెలుగుప్ప (అనంతపురం జిల్లా)
జొన్న ఇగురుతిని 80 గొర్రెలు మృతి చెందిన సంఘటన అనంతపురం జిల్లా బెలుగుప్ప మండల పరిధిలోని గంగవరం గ్రామ సమీపాన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. గొర్రెల యజమాని తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... కందూకూరు మండలం పి.వెంకటంపల్లి తండాకు చెందిన లాల్య నాయక్ మేత నిమిత్తం గొర్రెల మందను బళ్లారి ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ మేత అనంతరం సోమవారం నాడు స్వగ్రామం తిరుగు ప్రయాణం అయ్యాడు. చీకటి పడడంతో బెలుగుప్ప మండలం గంగవరం గ్రామ సమీపంలో రాత్రి గొర్రెల మందతో కలిసి నిద్రించారు. వీరు నిద్రించిన ప్రాంతంలో ఓ పొలంలో ఎండిన జొన్నను దున్నేశారు. ఈ జొన్న ఇగురును గొర్రెలు తిన్నాయి. తిన్న వెంటనే 49 గొర్రెలు ఘటనా స్థలంలోనే మరణించాయి. ఇది గమనించిన గొర్రెల కాపరి పశువైద్యాధికారి డాక్టర్ రమేష్‌కు సమాచారం అందించారు. వారు మంగళవారం ఉదయం ఆ ప్రాంతానికి చేరుకున్నారు. అప్పటికే మరో 31 గొర్రెలు మృతి చెందాయి. మొత్తం 80 గొర్రెలు మృతి చెందడంతో దాదాపు రూ.10.50 లక్షలు నష్టం వాటిల్లిందని గొర్రెల కాపరి కన్నీటి పర్యవంతం అయ్యాడు. గొర్రెల మృతి విషయం తెలుసుకున్న కళ్యాణదుర్గం ప్రాంతీయ పశు వైద్యశాల సహాయసంచాకులు డాక్టర్ ఎన్.శ్రీనివాస్ ఘటన స్థలాన్ని చేరుకుని పరిశీలించారు. మృతి చెందిన గొర్రెలకు శవపరీక్ష నిర్వహించారు.

డిపాజిట్లు దక్కడం లేదు!

- కొనేళ్లుగా పెరుగుతున్న ఇలాంటి అభ్యర్థుల సంఖ్య
- ఇప్పటి వరకు వీరి సంఖ్య 71వేలకు పైగానే
- 2019 ఎన్నికల్లో ఇది 86 శాతం
- ఎన్నికల సంఘం సమాచారం

న్యూఢిల్లీ : ఎన్నికల్లో పోటీ చేసే పలువురు అభ్యర్థులు విజయం సాధించకపోయినా.. డిపాజిట్లు దక్కించుకోవటాన్ని ఒక సవాలుగా తీసుకుంటారు. ముఖ్యంగా, ప్రధాన పార్టీల అభ్యర్థులకైతే ఇది పరువుకు సంబంధించిన అంశం. ఒక అభ్యర్థి డిపాజిట్ కోల్పోతే ప్రత్యర్థి పార్టీలు, నాయకులకు విమర్శించే ఆయుధం దొరికినట్టుగా భావిస్తారు. అయితే, దేశంలో జరిగే పలు ఎన్నికల్లో ఇలా డిపాజిట్లు కోల్పోతున్న అభ్యర్థుల సంఖ్య క్రమక్రమంగా పెరుగుతున్నది. ఎన్నికల సంఘం సమాచారాన్ని విశ్లేషిస్తే ఈ విషయం వెల్లడైంది.

ఎన్నికల కమిషన్ డేటా ప్రకారం.. దేశంలో 1951లో జరిగిన మొదటి లోక్‌సభ ఎన్నికల నుంచి పలు పార్టీలు, స్వతంత్రులు 71,000 మందికి పైగా అభ్యర్థులు తమ నియోజకవర్గాల్లో పోలైన మొత్తం చెల్లుబాటు అయ్యే ఓట్లలో కనీసం ఆరో వంతు ఓట్లను పొందటంలో విఫలమైనందుకు తమ సెక్యూరిటీ డిపాజిట్‌ను కోల్పోయారు. 2019 ఎన్నికల్లో 86 శాతం మంది అభ్యర్థులు ఈ పరిస్థితిని ఎదుర్కొన్నారు. పోలైన మొత్తం చెల్లుబాటయ్యే ఓట్లలో కనీసం ఆరో వంతు ఓట్లను పొందటంలో విఫలమైతే.. వారి డిపాజిట్లను ట్రెజరీకి మళ్లించాలని ఎన్నికల సంఘం నిబంధనలున్నాయి.

ఏమిటీ సెక్యూరిటీ డిపాజిట్?

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు సెక్యూరిటీ డిపాజిట్ కింద కొంత మొత్తాన్ని ఎన్నికల కమిషన్‌కు చెల్లించాల్సి ఉంటుంది. ఇది జనరల్ అభ్యర్థులకు రూ.25వేలుగా, ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు రూ. 12,500గా ఉన్నది. అభ్యర్థులు తమ నియోజకవర్గాల్లో పోలైన మొత్తం చెల్లుబాటు అయ్యే ఓట్లలో కనీసం ఆరోవంతు ఓట్లను పొందితే.. వారు తమ సెక్యూరిటీ డిపాజిట్‌ను పొందగలుగుతారు. లేకపోతే, ఆ డిపాజిట్ మొత్తాన్ని అభ్యర్థులు కోల్పోతారు.

మొదటి లోక్‌సభ ఎన్నికల నుంచి ఇప్పటి వరకు పోటీ చేసిన 91,160 మంది అభ్యర్థులలో 71,246 మంది తమ సెక్యూరిటీ డిపాజిట్‌ను కోల్పోయారు. అంటే, మొత్తం 78 శాతం మంది కనీసం డిపాజిట్‌ను కూడా దక్కించుకోలేదు. 1951లో జనరల్ అభ్యర్థులు రూ.500, ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులు రూ.250 సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సి ఉండేది. అది ప్రస్తుతం జనరల్ అభ్యర్థులకు రూ.25,000, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.12,500కి పెరిగింది. ఎన్నికల్లో అభ్యర్థులు డిపాజిట్లను కాపాడుకోవటం గర్వకారణంగా, డిపాజిట్లు జప్తు చేయటం అవమానకరమైనదిగా భావిస్తారని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

గత ఎన్నికల్లో బిఎస్‌పి నుంచే అధికంగా

2019 ఎన్నికలలో, ప్రముఖ రాజకీయ పార్టీలలో బిఎస్‌పి అత్యధిక స్థానాల్లో డిపాజిట్లను కోల్పోయింది. ఆ పార్టీ నిలిపిన 383 మంది అభ్యర్థులలో 345 మంది డిపాజిట్లను దక్కించుకోలేకపోయారు. ఇక తర్వాతి స్థానంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి చెందిన 421 మంది అభ్యర్థులలో 148 మంది డిపాజిట్లు కోల్పోయారు. ఇక బిజెపి నుంచి 51 మంది అభ్యర్థులు డిపాజిట్లు దక్కించుకోవటంలో విఫలమయ్యారు. ఈ ఎన్నికల్లో అన్ని పార్టీల నుంచి 86 శాతం మంది అభ్యర్థుల డిపాజిట్లు గల్లంతు కావటం గమనార్హం.

ఆయా లోక్‌సభ ఎన్నికల్లో ఇలా..!

1951-52లో జరిగిన తొలి లోక్‌సభ ఎన్నికల్లో దాదాపు 40 శాతం, అంటే 1,874 మంది అభ్యర్థుల్లో 745 మంది డిపాజిట్లు కోల్పోయారు. ఆ తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోయే ట్రెండ్ క్రమంగా పెరిగింది. 1996లో జరిగిన 11వ లోక్‌సభ ఎన్నికల సమయంలో 91 శాతం అంటే 13,952 మంది అభ్యర్థుల్లో 12,688 మంది డిపాజిట్లు కోల్పోయారు. ఈ ఎన్నికల్లో లోక్‌సభ స్థానాలకు అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు పోటీ పడ్డారు. 1991-92లో, 8,749 మంది అభ్యర్థులలో 7,539 మంది (86 శాతం మంది) తమ సెక్యూరిటీ డిపాజిట్ కోల్పోయారు.

2009లో, 8070 మందిలో 6829 మంది అభ్యర్థులు(85 శాతం మంది) అభ్యర్థులు డిపాజిట్లు పొందలేకపోయారు. ఇక 2014 లోక్‌సభ ఎన్నికల్లో పలు పార్టీలు, స్వతంత్రులు 8,251 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ఇందులో 7,000 మంది (84 శాతం) తమ సెక్యూరిటీ డిపాజిట్‌ను కోల్పోయారు.

జాతీయ పార్టీల ప్రదర్శన ఒకే.. 2009 లోనే దారుణం

జాతీయ పార్టీల అభ్యర్థులు తమ డిపాజిట్లను నిలుపుకోవటంలో ఉత్తమ ప్రదర్శననే కనబరుస్తున్నారు. 1951-52లో జరిగిన మొదటి లోక్‌సభ ఎన్నికల్లో జాతీయ పార్టీలకు చెందిన 1,217 మంది అభ్యర్థుల్లో 28 శాతం మంది మాత్రమే, అంటే 344 మంది డిపాజిట్లు కోల్పోయారు. 1957లో తదుపరి ఎన్నికలలో 919 మంది అభ్యర్థులలో 130 మంది(14 శాతం) అభ్యర్థులు మాత్రమే డిపాజిట్లు దక్కించుకోలేకపోయారు. 1977 ఎన్నికల్లో మాత్రం జాతీయ పార్టీలు చక్కని ప్రదర్శననే కనబర్చాయి. ఈ సంఖ్య అతి తక్కువగా 9 శాతంగానే ఉన్నది. ఈ పార్టీలకు చెందిన 1,060 మంది అభ్యర్థులలో 100 మంది మాత్రమే (తొమ్మిది శాతం) డిపాజిట్లు కోల్పోయారు. 2009 సార్వత్రిక ఎన్నికలు మాత్రం ఇందుకు విరుద్ధంగా ఉన్నాయి. జాతీయ పార్టీల అభ్యర్థులలో దాదాపు ప్రతి రెండో అభ్యర్థి డిపాజిట్లు కోల్పోయారు. ఈ ఎన్నికల్లో జాతీయ పార్టీలకు చెందిన 1,623 మంది అభ్యర్థుల్లో 779 మంది డిపాజిట్లు దక్కించుకోలేదు.

'ప్రజలకు రాజకీయాలపై ఆసక్తి'

ఢిల్లీ యూనివర్శిటీలోని జీసస్ అండ్ మేరీ కాలేజ్‌లోని పొలిటికల్ సైన్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ సుశీల రామస్వామి మాట్లాడుతూ... భారత్‌లో రాజకీయ కార్యకలాపాలు చాలా ప్రాథమికమైనవిగా భావించబడుతున్నందున చాలా మంది అభ్యర్థులు సెక్యూరిటీ డిపాజిట్ కోల్పోయినప్పటికీ ఎన్నికలలో పోటీ చేస్తారనీ, ప్రజలు రాజకీయాలపై చాలా ఆసక్తిని కలిగి ఉంటారని అన్నారు. మరికొందరు, వారు తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి ఇష్టపడతారని తెలిపారు.

భారత్‌లో 18వ లోక్‌సభకు ఎన్నికల షెడ్యూల్ ఇప్పటికే విడుదలైన విషయం తెలిసిందే. ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికల ప్రక్రియ ఏప్రిల్ 19 నుంచి ఏడు దశల్లో(ఏప్రిల్ 26, మే 7, మే 13, మే 20, మే 25, జూన్ 1 తేదీలలో) జరగనున్నాయి. జూన్ 4 న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఈ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే, కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ, ఆప్ వంటి పలు పార్టీల కూటమి 'ఇండియా' మధ్య ప్రధాన పోటీ ఉండనున్నదని ఎన్నికల విశ్లేషకులు చెప్తున్నారు.

సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష వాయిదా

న్యూఢిల్లీ: యుపిపిఎస్‌సి సివిల్ సర్వీసెస్, ఫారెస్ట్ సర్వీస్ స్క్రీనింగ్ పరీక్షలు సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వాయిదా పడ్డాయి. అఖిల భారత సర్వీసుల్లో ఉద్యోగాల భర్తీకి నిర్వహించే ఈ పరీక్షలకు సంబంధించిన ప్రిలిమినరీ పరీక్ష మే 26న జరగాల్సివుంది. అయితే ఎన్నికల నేపథ్యంలో వాయిదా వేస్తున్నట్లు యుపిపిఎస్‌సి ప్రకటించింది. ఈ రెండు పరీక్షలను జూన్ 16న నిర్వహించనున్నట్లు తెలిపింది. సివిల్ సర్వీసెస్‌లో 1,056 ఉద్యోగాలు, ఫారెస్ట్ సర్వీసుల్లో 150 పోస్టుల భర్తీకి ఫిబ్రవరి 14న యుపిపిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే.

ఇసుక అక్రమ రవాణా

- యథేచ్ఛగా తరలింపు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- రెచ్చిపోతున్న ఇసుక మాఫియా



ప్రజాశక్తి - మక్కువ
పార్వతీపురం మన్యం జిల్లా మక్కువమండలంలోని సువర్ణముఖి నది గర్భంలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాకు అడ్డే లేకుండా పోతుంది. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటికీ ఇసుకాసురులు ఇష్టారాజ్యంగా ఏ విధమైన అనుమతుల్లేకుండానే ఇసుక అక్రమ రవాణా చేస్తున్నా అడ్డుకోవాల్సిన అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

మండలంలోని దేవంశిర్లాం సమీపాన ఇసుకరీచ్ ఉంది.ప్రభుత్వ అనుమతితో ఇసుకను తోలుకునేందుకు ట్రాక్టర్లకు అవకాశం కల్పించారు. అయితే ఈ రీచ్‌కు అనుమతులు తీసుకున్నామంటూ అక్రమంగా కొత్తవలస ఎగువ భాగం నుండి వెంకట బైరిపురం, దేవరశిర్లాం ఎత్తిపోతల పథకాల వరకు సువర్ణముఖి నది గర్భమంతా యథేచ్ఛగా ఇసుకను దోచేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే గుడిలకు, గోపురాలకంటూ అబద్దాలు చెబుతూ తప్పించుకుంటున్నారు. ఇక్కడి నుంచి పార్వతీపురం జిల్లా కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాలకు ప్రధాన రహదారి గుండా అక్రమంగా ఇసుక రవాణా సాగుతూనే ఉంది. ఆనకట్టలు, ఎత్తిపోతల పథకాలు సమీపాల్లోని నదుల్లో ఇసుక తీయకూడదన్న నిబంధన ఉన్నప్పటికీ ఇసుక మాఫియా వీటిని బేఖాతర చేస్తూ అక్రమంగా తరలించకపోతున్నా అధికారులు, పోలీసులెవరూ పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు

అతడే సూత్రధారి..?

సువర్ణముఖి నదిలో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణా మాఫియాగా ఏర్పడ్డానికి సుమారు నాలుగు గ్రామాలకు చెందిన ట్రాక్టర్ యజమానులను ఏకం చేస్తూ మండలంలోని ఓ వ్యక్తి మాఫియాకు సూత్రధారిగా వ్యవహరిస్తున్నాడని పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మూడు ట్రాక్టర్లకు యాజమానిగా వ్యవహరిస్తున్న ఆ వ్యక్తి మిగతా వారిని కూడా తనకు అనువుగా కలుపుకొని ఈ దందాలో వారిని భాగస్తులుగా చేస్తున్నాడని వివిధ శాఖల అధికారులు కూడా ఆయన ద్వారా ముడుపులు అందుతున్నాయని ఆరోపణలు మండలంలో వ్యాపించాయి.


రీచ్ వైపు చూస్తే డ్యామ్‌లో పడేస్తా?

ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న ప్రాంతం వైపు వార్తాసేకరణకు ఏ ఒక్క విలేకరి వచ్చినా, అటువైపు కన్నెత్తి చూసినా ఆనకట్టలో పడేస్తామని మాఫియాకు చెందిన వ్యక్తి బెదిరింపు చర్యలకు పాల్పడుతూ, మరోవైపు తన అనుకూల వ్యక్తులతో ప్రచారం ముమ్మరం చేశాడు. ఇసుక మాఫియాకు అడ్డే లేదన్నట్లు ఈ ప్రచారంతో మరింత బలం చేకూర్చేలా ఉందని, ఇలాంటి బెదిరింపులకు దిగడం వెనుక బలమైన వ్యక్తులు అండదండలు పుష్కలంగా ఉన్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మండలంలోని వెంకటబైరిపురం ఎత్తిపోతల పథకం సమీపానున్న మడతోట రేవు ఇసుక రీచ్‌ది మరో కథ. ఇక్కడ నుంచి నాటు బండ్ల ద్వారా ఇసుకను సుమారు 100 మీటర్ల వరకు తోట వద్దకు ఇసుకను డంపు చేసి అక్కడ నుండి నేరుగా ట్రాక్టర్ల ద్వారా అక్రమ రవాణా చేస్తున్నారు. నాటు బండ్ల యజమానులకు ఒక ట్రాక్టర్ ఇసుకను నింపేందుకు సుమారు రూ.800 అందజేస్తారు. ఎలాంటి పనుల్లేకపోవడంతో తాము ఇసుకను తరలించుకుంటూ జీవనం సాగిస్తున్నామని బండ్ల యజమానులు విలేకరులకు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి ఇసుక అక్రమ దందాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఎప్పటికీ అంతుచిక్కని రహస్యమే !

- ఆ నాలుగు వేల కోట్ల రూపాయలు ఏమయ్యాయి?
- కొన్నది ఎవరు? ఏ పార్టీకి చేరాయి?
- వెల్లడించని ఎస్‌బిఐ, ఇసి
- వివరాలపై ఆసక్తి చూపని సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ : ఆరు సంవత్సరాలుగా గుప్పిట మూసిన రహస్యాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. సుప్రీంకోర్టు ఆదేశాల పుణ్యమా అని ఎన్నికల బాండ్లకు సంబంధించిన సమాచారం దఫదఫాలుగా వెలుగులోకి వస్తోంది. అయితే ఈ సమాచారం పాక్షికమే. గందరగోళాన్ని కూడా సృష్టిస్తోంది. ఎందుకంటే 2019 ఏప్రిల్ 12వ తేదీకి ముందు నాలుగు వేల కోట్ల రూపాయల విలువ కలిగిన బాండ్ల లావాదేవీలు జరిగాయి. ఆ వివరాలు ఎప్పటికీ తెలిసే అవకాశం లేదు. సుప్రీంకోర్టు కూడా ఆ సమాచారాన్ని కోరడం లేదు. ఈ నెల 14, 17 తేదీలలో ఎన్నికల కమిషన్ కొంత సమాచారాన్ని అందించింది. ఈ నెల 21న మరిన్ని వివరాలు రాబోతున్నాయి. అయితే ఈ వివరాలన్నీ 2019 ఏప్రిల్ 12వ తేదీ నుండి ఈ ఏడాది జనవరి వరకూ జరిగిన లావాదేవీలకు సంబంధించినవే.

రెండు జాబితాలలో ఏముంది?

ఈ నెల 14న ఎన్నికల కమిషన్ రెండు జాబితాలను తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసింది. 2019 ఏప్రిల్ 12వ తేదీ నుండి ఈ ఏడాది జనవరి వరకూ బాండ్లను కొనుగోలు చేసిన వారి వివరాలు తొలి జాబితాలో ఉన్నాయి. బాండును కొన్న తేదీ, దాని విలువ కూడా అందులో ఉంది. అత్యధికంగా బాండ్లను కొనుగోలు చేసింది ఓ లాటరీ కంపెనీ. మౌలిక సదుపాయాల కంపెనీలు, ఫార్మా కంపెనీలు కూడా ప్రధాన దాతలే. రిలయన్స్‌తో సంబంధమున్న సంస్థలు కూడా బాండ్లు కొనుగోలు చేశాయి. ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థల దాడుల తర్వాత 21 కంపెనీలు బాండ్లను కొనుగోలు చేసినట్లు ఈ జాబితా ద్వారా అర్థమవుతోంది.

ఇక రెండో జాబితాలో... రాజకీయ పార్టీలు ఏ తేదీన, ఎంత విలువ కలిగిన బాండ్లను నగదుగా మార్చుకున్నదీ తెలియజేశారు. వివిధ రాజకీయ పార్టీలకు రూ.16,492 కోట్ల మేర విరాళాలు అందగా వాటిలో ఒక్క బిజెపి ఖాతాకే రూ.8,250 కోట్లు చేరాయి. అయితే ఈ జాబితాలలో బాండ్లపై ఉండే యూనిక్ కోడ్ నెంబర్లు కన్పించలేదు. అదే విధంగా 2019 ఏప్రిల్ 12వ తేదీకి ముందు కొనుగోలు చేసిన బాండ్ల వివరాలు కూడా లేవు.

దాతల వివరాలు ఇచ్చిన పార్టీలు ఇవే

ఎన్నికల కమిషన్ ఈ నెల 17న అందజేసిన సమాచారంలో మాత్రం 2019 ఏప్రిల్ 12వ తేదీకి ముందు కొనుగోలు చేసిన బాండ్లకు సంబంధించి కొన్ని వివరాలు కన్పించాయి. 2019–2023 మధ్య వివిధ రాజకీయ పార్టీలు తనకు అందించిన నివేదికలను ఈసీ అప్‌లోడ్ చేసింది. ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే పలు పార్టీలు తాము ఏ తేదీన, ఎంత విలువ కలిగిన బాండ్లను నగదుగా మార్చుకున్నదీ ఇసికి తెలియజేశాయి. డిఎంకె, అన్నా డిఎంకె, జెడిఎస్ మాత్రమే దాతల పేర్లను వెల్లడించాయి. డిఎంకెకు లాటరీ కంపెనీ ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ అత్యధికంగా విరాళం అందించింది. 2018లో జరిగిన కర్నాటక శాసనసభ ఎన్నికలకు ముందు జెడిఎస్‌కు ఇన్ఫోసిస్ కంపెనీ విరాళం ఇచ్చింది. ఆమ్‌ఆద్మీ, కాంగ్రెస్ పార్టీలు మాత్రం 2019లో తమకు విరాళాలు ఇచ్చిన దాతల పేర్లు మాత్రమే బయటపెట్టాయి.

యూనిక్ కోడ్ తెలిస్తే...

ఎస్‌బిఐ నుండి ఇంకా ఎన్నికల కమిషన్‌కు అందాల్సిన సమాచారం చాలానే ఉంది. ముఖ్యంగా బాండ్ల యూనిక్ కోడ్లు తెలియాల్సి ఉంది. సుప్రీంకోర్టు తాజా ఆదేశాల మేరకు ఈ వివరాలన్నీ ఈ నెల 21న బయటపడే అవకాశం ఉంది. బాండ్ కోడ్ తెలిస్తే దానిని ఎవరు కొనుగోలు చేశారు? ఎవరికి అందజేశారు? ఏ పార్టీ దానిని నగదుగా మార్చుకుంది? వంటి ప్రశ్నలకు సమాధానాలు లభిస్తాయి. దాతలు, పార్టీల మధ్య క్విడ్‌ప్రోకో సంబంధాలు కూడా బయటపడతాయి.

బిజెపి జేబులోకే..

కోడ్ తెలిసినప్పటికీ 2018 మార్చి, 2019 ఏప్రిల్ మధ్య కొనుగోలు చేసిన బాండ్ల సమాచారం మాత్రం అంతుచిక్కని రహస్యంగానే మిగిలిపోతుంది. 2019 ఏప్రిల్ 12వ తేదీకి ముందు జరిగిన లావాదేవీల సమాచారం బయటపెట్టాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. కానీ ఆ సమయంలో కొనుగోలు చేసిన బాండ్ల విలువ అక్షరాలా నాలుగు వేల కోట్ల రూపాయలు. లోక్‌సభ ఎన్నికలకు ముందు చేతులు మారిన ఆ సొమ్ములో అధిక భాగం బిజెపి జేబులోకే చేరిందన్నది నిర్వివాదాంశం.

బిజెపికి ఒకే రోజు రూ.200 కోట్లు విరాళం

- అంతా ఒకే సంస్థ నుంచి
- రిలయన్స్‌తో 'క్విక్ సప్లయ్ చెయిన్'కు సంబంధాలు
- 'ది క్వింట్' పరిశోధనలో వెలుగులోకి

న్యూఢిల్లీ : ఐదు రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరగడానికి కొద్ది నెలల ముందు 2022 జనవరిలో ఒకే రోజు, ఒకే కంపెనీ బిజెపికి రూ.200 కోట్ల విరాళం అందించింది. ఈ నెల 17న ఎన్నికల కమిషన్ తన వెబ్‌సైటులో అప్‌లోడ్ చేసిన వివరాల ఆధారంగా ఈ విషయం బయటపడింది. తనకు విరాళం ఇచ్చిన దాతల పేర్లను ఎన్నికల కమిషన్‌కు బిజెపి వెల్లడించలేదు. కానీ బాండ్లు కొనుగోలు చేసిన తేదీని, వాటిని ఏ నగరంలో కొనుగోలు చేశారు అనే సమాచారాన్ని తెలిపింది. 2022 జనవరి ఐదవ తేదీన ఒక్కోటి కోటి రూపాయల విలువైన రెండు వందల బాండ్లను ముంబయిలో కొనుగోలు చేసి, బిజెపికి విరాళంగా అందించారు.

'ది క్వింట్' అనే న్యూస్ పోర్టల్ ఆ విరాళానికి సంబంధించిన పత్రాలను అధ్యయనం చేసింది. ముంబయికి చెందిన క్విక్ సప్లయ్ చెయిన్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీ మాత్రమే 2022 జనవరి 5వ తేదీన రూ.200 కోట్ల విలువైన బాండ్లను కొనుగోలు చేసిందని తేల్చింది. ఈ కంపెనీకి రిలయన్స్‌తో సంబంధాలు ఉన్నాయి. ఆ తేదీన మరే ఇతర కంపెనీ అంత విలువైన బాండ్లను కొనుగోలు చేయలేదని గత వారం ఎస్‌బిఐ విడుదల చేసిన జాబితాను బట్టి కూడా తెలుస్తోంది. ఆ తేదీన ముంబయికే చెందిన రెండు కంపెనీలు రూ.7 కోట్లు, రూ.25 కోట్ల విలువైన బాండ్లను కొనుగోలు చేశాయి.

క్విక్ సప్లయ్ చెయిన్ ప్రైవేట్ లిమిటెడ్ జనవరి 10న రూ.10 కోట్ల విలువైన బాండ్లను కొన్నది. రాష్ట్రాలలో శాసనసభ ఎన్నికలు జరగడానికి ముందు ఈ కంపెనీ మూడు సార్లు బాండ్లను కొనుగోలు చేయడం గమనార్హం. 2022 నవంబర్ 11న ఈ కంపెనీ రూ.125 కోట్ల బాండ్లను కొనుగోలు చేసింది. ఈ పద్దు బీజేపీ రికార్డులలోనూ కన్పించింది. 2023 నవంబర్ 17న ఈ సంస్థ మరో రూ.50 కోట్ల బాండ్లను కొన్నది. క్విక్ సప్లయ్ చెయిన్ కంపెనీ గిడ్డంగులు, స్టోరేజీ యూనిట్లను నిర్మిస్తుంది. దీనిలో డైరెక్టర్‌గా ఉన్న తపస్ మిత్రా పలు రిలయన్స్ గ్రూపు సంస్థల్లో కూడా డైరెక్టర్‌గా పనిచేశారు.

ఎన్‌సిపి అభ్యర్థులందరికీ 'బూర' గుర్తు

న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌సిపి (శరద్ పవార్) అభ్యర్థులందరూ ఒకే గుర్తుపై పోటీ చేయనున్నారు. ఎన్‌సిపిలో చీలిక తీసుకొచ్చిన అజిత్ పవార్ గ్రూపునే ఎన్‌సిపిగా గుర్తించి, 'గడియారం' గుర్తును కూడా ఆ గ్రూపునకే కేటాయించిన ఎన్నికల సంఘం శరద్ పవార్ గ్రూపునకు 'బూర ఊదుతున్న వ్యక్తి' గుర్తు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గడియారం గుర్తును ఎన్‌సిపి (అజిత్ గ్రూపు) ఉపయోగించకుండా నిరోధించాలని శరద్ పవార్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే అందుకు నిరాకరించిన ధర్మాసనం ఈ ఎన్నికల్లో ఎన్‌సిపి (శరద్ పవార్) అభ్యర్థులందరూ ఒకే గుర్తు (బూరు ఊదుతున్న వ్యక్తి) వినియోగించుకునేందుకు అనుమతులు జారీ చేసింది. ఈ గుర్తును ఇతర పార్టీలకు, అభ్యర్థులకు కేటాయించకుండా చర్యలు తీసుకోవాలని, ఎన్‌సిపి (శరద్ పవార్)కు మాత్రమే కేటాయించాలని ధర్మాసనం ఎన్నికల సంఘానికి ఆదేశాలు జారీ చేసింది.

చంద్రబాబు బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టిడిపి అధినేత ఎన్ చంద్రబాబు నాయుడు బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబుకు హైకోర్టు బెయిల్ మంజూరు చేయడాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో ఎపి సిఐడి దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. అయితే ధర్మాసనం మధ్యాహ్నం ఒంటి గంట వరకే జరిగింది. ధర్మాసనం ముగిసే సమయంలో ఈ కేసు విచారణకు వచ్చింది. సమయం లేకపోవడంతో వాయిదా వేశారు. వచ్చే వారం హోలీ సెలవు ఉండటంతో ఏప్రిల్ 9, ఏప్రిల్ 16 తేదీల్లో ఒకదాన్ని చెప్పాలని న్యాయవాదులను ధర్మాసనం కోరింది. దీంతో చంద్రబాబు తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా ఏప్రిల్ 16కు విచారణ వాయిదా వేయాలని అన్నారు. దీనికి సిఐడి తరపున సీనియర్ న్యాయవాది రంజిత్ కుమార్ అంగీకరించారు. దీంతో తదుపరి విచారణను ఏప్రిల్ 16న చేపట్టనున్నట్లు ధర్మాసనం తెలిపింది.

తొలి దశకు నేడు నోటిఫికేషన్

న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికల్లో తొలిదశకు సంబంధించిన నోటిఫికేషన్ బుధవారం విడుదల కానుంది. తొలి విడతలో మొత్తం 102 స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. అత్యధికంగా తమిళనాడులో 39 స్థానాలకు ఒకే విడతలో పోలింగ్ ప్రక్రియ చేపట్టనున్నారు. రాష్ట్రాలవారీగా ఎన్నికలు జరిగే లోక్‌సభ స్థానాలు : తమిళనాడు (39), రాజస్థాన్ (12), ఉత్తర్‌ప్రదేశ్ (8), మధ్యప్రదేశ్ (6), అస్సాం (5), మహారాష్ట్ర (5), ఉత్తరాఖండ్ (5), బీహార్ (4), పశ్చిమ బెంగాల్ (3), మణిపూర్ (2), అరుణాచల్ ప్రదేశ్ (2), మేఘాలయ (2), ఛత్తీస్‌గఢ్ (1), మిజోరం (1), నాగాలాండ్ (1), సిక్కిం (1), త్రిపుర (1), అండమాన్ నికోబార్ (1), జమ్ముకాశ్మీర్ (1), లక్షద్వీప్ (1), పుదుచ్చేరి (1).

రఫాలో కొనసాగుతన్న ఇజ్రాయిల్ దాష్టీకాలు

గాజా : రఫా నగరంలో ఇజ్రాయిల్ బలగాలు జరుపుతున్న విధ్వంసక చర్యలను, కార్యకలాపాలను పాలస్తీనా విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్రంగా ఖండించింది. అక్కడ బాంబు దాడులు ఉధృతమయ్యాయని, ఒక పద్ధతి ప్రకారం విధ్వంసక చర్యలను చేపడుతున్నారని పేర్కొంది. అంతర్జాతీయంగా విమర్శలు, ప్రతిస్పందనలు ఎదురవకుండా వుండేందుకు మూడోకంటికి తెలియకుండా రఫా నగర విధ్వంసాన్ని ఇజ్రాయిల్ ప్రారంభించిందని పాలస్తీనా విమర్శించింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. రాఫా నగరంలో ధ్వంసమైన ప్రాంతాలు, నివాస భవనాలను చూస్తే ఈ విషయం స్పష్టమవుతోందని పేర్కొంది. కాగా గాజా యుద్ధంలో 31,819మంది మరణించగా, 73,934మంది గాయపడ్డారని పాలస్తీనా ఆరోగ్య శాఖ గణాంకాలు పేర్కొన్నాయి.

రుణాల ఊబి నుంచి రైతును గట్టెక్కించాలి

- భూమి, నీరు హక్కులు కల్పించాలి
- పటిష్టంగా 'ఉపాధి' అమల్జేయాలి
- కిసాన్ మజ్దూర్ కమిషన్ ప్రతిపాదన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



సమావేశంలో మాట్లాడుతున్న పి సాయినాథ్, వేదికపై హన్నన్ మొల్లా, అశోక్ ధావలే, బి వెంకట్, విజు కృష్ణన్, కృష్ణప్రసాద్ తదితరులు

రైతులు, కౌలు రైతులను రుణాల ఊబి నుంచి గట్టెక్కించాలని, వ్యవసాయ కార్మికులకు ఉపాధి భద్రతను కల్పించాలని, ప్రజలందరికీ డిజిటల్ చిక్కుల్లేని సార్వత్రిక ప్రజా పంపిణీ వ్యవస్థను తీర్చిదిద్దాలని 'నేషన్ ఫర్ ఫార్మర్స్' ఏర్పాటు చేసిన కిసాన్–మజ్దూర్ కమిషన్ కోరింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అన్నదాతలు, వ్యవసాయ కార్మికులు, మహిళలు, సామాన్య ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చ జరగాల్సిన ఆవశ్యకతను ఉద్ఘాటించింది. గ్రామీణ భారతావని, వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై కార్మిక, కర్షక సంఘాల ప్రతినిధులతో కూడిన 'కిసాన్ – మజ్దూర్ కమిషన్' పరిశోధన చేసి 'వ్యవసాయం, అనుబంధ రంగాల అజెండా–2024' పేరిట ఒక నివేదికను విడుదల చేసింది. మంగళవారం నాడిక్కడ ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా (పిసిఐ)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ మేరకు నిర్వహించిన కార్యాక్రమంలో ప్రఖ్యాత గ్రామీణ పాత్రికేయులు పి సాయినాథ్ కీలక ప్రసంగం చేశారు. రైతులకు మద్దతు ధరను నిర్ధారిస్తూ ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ నివేదికను చెత్తబుట్టలో పడేసి..ఎన్నికల వేళ భారతరత్న ప్రకటించిందని సాయినాథ్ విమర్శించారు. రైతు పండించిన పంటలన్నిటికీ కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) దక్కేలా చట్టం రూపొందించినప్పుడే స్వామినాథన్‌కు అసలైన గౌరవం దక్కినట్టు అని ఆయన అన్నారు. పంజాబ్–హర్యానా సరిహద్దుల్లో మోడీ సర్కార్ రైతులపై డ్రోన్లలతో దాడులు చేయించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశానికి అన్నంపెట్టే రైతన్నలపై మోడీ ప్రభుత్వం పోరాడుతోందన్నారు. అన్నదాతల ఆదాయాలు పడిపోయాయని, సుమారు లక్ష మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో అఖిల భారత కిసాన్ సభ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు అశోక్ ధావలే, విజుకృష్ణన్, ఉపాధ్యక్షులు హన్నన్ మొల్లా, కోశాధికారి పి కృష్ణప్రసాద్, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధానకార్యదర్శి బి వెంకట్, అఖిల భారత కిసాన్ ఖేత్ మజ్దూర్ సంఘటన్ జాతీయ అధ్యక్షులు సత్యవాన్ తదితరులు పాల్గొన్నారు.

కిసాన్-మజ్దూర్ కమిషన్ ప్రతిపాదనలు

- రైతులను అప్పుల నుంచి విముక్తి చేయాలి.
- డిజిటల్ చిక్కులు లేకుండా పేదలందరికీ సార్వత్రిక ప్రజా పంపిణీ ద్వారా నిత్యావసర సరుకులు అందించాలి.
- ప్రభుత్వ రంగ విద్యా, వైద్య వ్యవస్థలను బలోపేతం చేయాలి.
- దేశంలో భూపరిశీలన ఇంకా పూర్తి కాలేదు..దీనిని వెంటనే పూర్తి చేయాలి.
- అన్నదాతలకు భూమి, నీరు తదితర మౌలిక సదుపాయాలపై హక్కులు కల్పించాలి
- కౌలుదారుల జాబితాను తయారు చేసి వారికి కేంద్ర పథకాలు అమల్జేయాలి
- మహిళా రైతులను గుర్తించి భూమిపై హక్కు కల్పించాలి.
- అటవీ చట్టాలకు తీసుకొచ్చిన కార్పొరేట్ అనుకూల సవరణలను ఉపసంహరించుకోవాలి
- గిరిజన రైతులకు రక్షణ కల్పించాలి
- ఉపాధి హామీ పథకం కింద 200 రోజుల పని దినాలు కల్పించాలి.

విదేశీయులకూ మోడీ మెసేజ్‌లు

- ఎన్నికల వేళ హద్దుల్లేని ప్రధాని ప్రచారం

న్యూఢిల్లీ : ఎన్నికల వేళ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రచారం దేశ సరిహద్దులు దాటిపోతోంది. 'వికసిత్ భారత్ సంపర్క్' పేరిట వాట్సాప్‌లో ప్రధానమంత్రి లేఖ రూపంలో వస్తున్న మేస్సేజ్‌లతో ప్రజలు విస్మయానికి గురౌతున్నారు. విదేశాల్లో ఉన్నవారికీ ఈ తరహా సందేశాలు వెళ్తున్నాయి. తన లేఖకు సమాధానం ఇవ్వాలని కూడా కోరడం విశేషం. ఇదంతా బిజెపి ప్రచార వ్యూహం తప్ప మరోటి కాదు. వాట్సాప్‌లో వస్తున్న లేఖ ఇలా ఉంది..'గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం నుండి ఈ లేఖను పంపుతున్నాము. గత పది సంవత్సరాల కాలంలో భారత ప్రభుత్వం అమలు చేసిన వివిధ పథకాల ద్వారా 140 కోట్ల మందికి పైగా ప్రజలు ప్రయోజనం పొందారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా ప్రయోజనం పొందుతారు. వికసిత్ భారత్ ఆకాంక్షల సాధనకు మీ సూచనలు ఎంతో ముఖ్యం. కాబట్టి దయచేసి మీ సలహాలు, సూచనలు అందించండి' అని ఆ లేఖలో సూచించారు.

వికసిత్ భారత్, పబ్లిక్ అండ్ గవర్నమెంట్ సర్వీస్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, భారత ప్రభుత్వం, ఎలక్ట్రానిక్స్ నికేతన్, 6, సీజీఓ కాంప్లెక్స్, లోధీ రోడ్డు, న్యూఢిల్లీ చిరునామాతో ఈ సందేశాలు పంపుతున్నారు. సిటిజన్ వేదిక 'మైగవ్' ద్వారా ఈ ప్రచారం సాగుతోంది. డిజిటల్ ఇండియా కార్పొరేషన్‌లో మైగవ్ ఓ భాగం. ఇది ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ కింద పనిచేస్తున్న సంస్థ. వాట్సప్ సందేశాలను గమనించిన కాంగ్రెస్ పార్టీ ఈ వ్యవహారాన్ని మేటా వేదిక దృష్టికి తీసికెళ్లింది. సమాధానం రాకపోవడంతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. ప్రధాని నుండి వచ్చిన వాట్సప్ సందేశాలపై వ్యాఖ్యానించేందుకు ఇసి కార్యాలయం నిరాకరించింది. ప్రధాని మోడీ.. వాయుసేన విమానాలను ఇప్పటికే తన ఎన్నికల ప్రచారం కోసం వినియోగించడంపై సర్వత్రా విమర్శలు వస్తున్న సంగతి తెలిసిందే.

అది కోడ్ ఉల్లంఘనే

అయితే ప్రధాని మోడీ పేరుతో పంపుతున్న బల్క్ మెసేజ్‌లు కోడ్ ఉల్లంఘన కిందకే వస్తాయని చండీగఢ్ ఎన్నికల సిబ్బంది చెబుతున్నారు. ఈ సందేశాలపై సి – విజిల్ ద్వారా ఈ నెల 17న ఫిర్యాదు అందడంతో వారు స్పందించారు. ఈ విషయం దేశవ్యాప్త అధికార పరిధిని కలిగి ఉన్నందున చండీగఢ్ అడ్మినిస్ట్రేషన్ 'అవసరమైన చర్య' కోసం దీనిని కేంద్ర ఎన్నికల కమిషన్ ఇసిఐకి పంపించినట్లు తెలిపారు. తదుపరి చర్యలు ఇసిఐ తీసుకుంటుందని చండీగఢ్ రిటర్నింగ్ ఆఫీసర్–కమ్–డిప్యూటీ కమిషనర్ వినయ్ ప్రతాప్ సింగ్ తెలిపారు.

ఉత్తర భారత్‌లో బిజెపి గాలి లేదు

- భూపేష్ బఘేల్



న్యూఢిల్లీ : ఉత్తరభారత్‌లో బిజెపి గాలి లేదని, ఇండియా ఫోరానికే స్పష్టమైన మెజార్టీ వస్తుందని ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నాయకులు భూపేష్ బఘేల్ తెలిపారు. అయోధ్య అంశం ఈ ఎన్నికల్లో పెద్దగా ప్రభావం చూపదన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డిఎకు 400కు పైగా స్థానాలు వస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ బఘేల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇండియా ఫోరానికి ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన స్పష్టమైన మెజార్టీ వస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రస్తుత ఎన్నికలు నరేంద్ర మోడీకి, యావత్ దేశానికి జరుగుతున్న పోరాటం అని ఆయన పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని 11 లోక్‌సభ స్థానాల్లో సగానికిపైగా సీట్లను కాంగ్రెస్ సొంతం చేసుకుంటుందని తెలిపారు. ఉద్ధవ్‌థాకరే, ప్రకాష్ అంబేద్కర్ వంటి వారితో పాటు అనేక చిన్న పార్టీలు చేతులు కలపడంతో ఛత్తీస్‌గఢ్‌లో ఇండియా ఫోరం మరింత బలం పుంజుకుందన్నారు. మరోవైపు ఎన్‌డిఎ కూటమిలో విభేదాలు పెరుగుతున్నాయన్నారు. హర్యానా, బీహార్, ఉత్తరప్రదేశ్‌లో ఎన్‌డిఎలో చీలికలు మొదలయ్యాయని ఆయన పేర్కొన్నారు.

అమెరికా జోక్యం దారీ విధానాలపై క్యూబా నిరసన



హవానా : క్యూబాపై క్రూరమైన ఆర్థిక యుద్ధాన్ని కొనసాగించడం, దాంతో ప్రజల్లో సహజంగానే నెలకొనే చిరాకులను ఎగదోయడం, దేశాన్ని అస్థిరపరిచే కుట్రలను అంతకంతకూ తీవ్రతరం చేయడం వంటి అమెరికా దాష్టీకాలపై క్యూబా తన తీవ్ర నిరసన తెలియజేసింది. . క్యూబన్లలో అసమ్మతిని రెచ్చగొట్టేందుకు అమెరికా ఏటా తన బడ్జెట్‌లో వందల కోట్ల డాలర్లు వెచ్చిస్తున్నది. క్యూబా ప్రభుత్వంపై బురద చల్లేందుకు గోబెల్స్ ప్రచారాన్ని అమెరికా ప్రభుత్వం, క్యూబాలోని అమెరికన్ ఎంబసీ అదేపనిగా సాగిస్తున్నది. ఆ దేశ ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటోంది. రెండు రోజుల క్రితం తూర్పు క్యూబాలోని శాంటియాగో సిటీలో నిరసనల వెనుక అమెరికా హస్తం ఉందని జోర్గెట్ అనే సంస్థ తెలిపింది. క్యూబా అంతర్గత వ్యవహారాల్లో తలదూర్చుతున్నందుకు హవానాలోని అమెరికా దౌత్యాధికారి బెంజిమిన్ జెఫ్‌ను పిలిపించి క్యూబా ప్రభుత్వం తన నిరసన తెలిపింది. కనీస దౌత్య మర్యాదులను కూడా పాటించకుండా అమెరికా ఇదే విధంగా జోక్యం చేసుకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని క్యూబా విదేశాంగ మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. దౌత్య సంబంధాలకు సంబంధించిన వియన్నా తీర్మానాన్ని కూడా అమెరికా గౌరవించడం లేదని క్యూబా అధ్యక్షుడు డియాజ్ కానెల్ విమర్శించారు. అకస్మాత్తుగా చేపట్టిన నిరసనలను ఆసరా చేసుకుని విప్లవ ప్రతీఘాత మీడియా పెద్దయెత్తున దుష్ప్రచారానికి పూనుకుంటోందని అమెరికాలోని క్యూబా సంఘీభావ కార్యకర్తలు విమర్శించారు.

బైడెన్ నిజంగా క్యూబా ప్రజల పక్షాన నిలబడాలనుకున్నవాడైతే, క్యూబా ప్రజల మేలు నిజంగా కోరుకున్నవాడైతే ఆ దేశంపై ఆర్థిక దిగ్బంధనాన్ని వెంటనే ఎత్తేయాలని పీపుల్స్ ఫోరమ్ ఎగ్జిక్యుటివ్ డైరక్టర్ మనోలో డి లాస్ శాంటోస్ అన్నారు. ఆ సంకల్పమే ఉంటే ఒక్క కలం పోటుతో దిగ్బంధనాన్ని చిటికెలో ఎత్తేయొచ్చు, క్యూబాను ఉగ్రవాద ప్రోత్సాహక జాబితా నుంచి ఇట్టే తొలగించవచ్చు. క్యూబాను టెర్రరిస్ట్ స్పాన్సర్డ్ జాబితాలో చేర్చడం ద్వారా ఆ దేశంతో ఇతర ప్రపంచ దేశాలు ఆర్థిక లావాదేవీలు జరపకుండా అమెరికా అడ్డుకుంటున్నది. స్వేచ్ఛగా వాణిజ్యం చేసుకునేందుకు కూడా వీలు లేకుండా చేస్తున్నది.

శాంటియాగోలో నిరసనలు తలెత్తగానే హవానాలోని అమెరికా దౌత్యకార్యాలయం ఎక్స్‌లో ఒక పోస్ట్ పెడుతూ నిరసనకారుల హక్కులను కాపాడాలని మేము క్యూబన్ ప్రభుత్వాన్ని కోరుతున్నామని పేర్కొన్నారు. వాస్తవానికి శాంటియాగోలో నిరసనలు తలెత్తగానే నగర అత్యున్నత అధికారి బెట్రిజ్ జాన్సన్ ఉరుషియా ఇతర ప్రొవిన్షియల్ అధికారులతో కలసి ఆ ప్రాంతానికి వెళ్లి ఆందోళనకారులతో మాట్లాడారు. వారి సమస్యలను ఓపికగా విన్నారు. అమెరికాలో నిరసనకారులపై అక్కడి ప్రభుత్వం వ్యవహరించిన దానికి పూర్తి భిన్నంగా క్యూబా ప్రభుత్వం వ్యవహరించింది.

గాజాలో కాల్పుల విరమణ పాటించాలని కోరుతూ వందలు, వేల సంఖ్యలో అమెరికా అంతటా ప్రజలు నిరసన ర్యాలీలు నిర్వహిస్తే, వాటిని అమెరికా ఫెడరల్, స్థానిక పోలీసులు తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించారు. నిరసనలను అణచివేసేందుకు యత్నించారు. నిరసకారుల మానవ హక్కులను కాలరాశారు.

నిరసనలు నిజమే కానీ..

'నిజమే ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలు, ఆందోళనలు చేస్తున్నారు. అయితే ఎలాంటి హింసకు పాల్పడకుండా శాంతియుతంగా ఈ నిరసనలు సాగుతున్నాయి. మా పోలీసు అధికారుల ఫోటోలను ఎవరైనా చూసినట్లైతే రక్షణ కవచాలు లేకుండా, హెల్మెట్లు లేకుండా, కనీసం బాష్పవాయు గోళాలను, జల ఫిరంగులను ప్రయోగించే పరికరాలు లేకుండా ప్రజల వద్దకు వెళుతున్నారు. హింసకు పాల్పడే వారికి, అలాగే అధికారులు దృష్టి పెట్టాలని కోరుకునే వారికి మధ్య గల తేడాను కూడా మీరు గమనించాల్సి వుంటుంది.' అని ఆయన పేర్కొన్నారు.

రాందేవ్ బాబా కోర్టుకు రావాల్సిందే

- అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు
- తప్పుడు ప్రకటనలపై విచారణ

న్యూఢిల్లీ : ప్రముఖ కార్పొరేట్ వ్యాపారి, యోగా గురు రాందేవ్ బాబాకు సుప్రీంకోర్టు మరోమారు షాక్ ఇచ్చింది. తదుపరి విచారణకు స్వయంగా ఆయన హాజరు కావాలని మంగళవారం అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ప్రజలను తప్పుదోవ పట్టించేలా పతంజలి ఆయుర్వేదంపై వాణిజ్య ప్రకటనలు జారీ చేసినందుకు తాము జారీ చేసిన షోకాజ్ కంటెప్ట్ పిటిషన్‌కు వివరణ ఇవ్వడానికి వ్యక్తిగతంగా హాజరు కావాలని న్యాయమూర్తులు హిమాకోహ్లీ, అహ్సనుద్దీన్ అమానుల్లాలతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. డ్రగ్స్ అండ్ రెమెడీక్స్ యాక్ట్ 1954లోని 3,4 సెక్షన్లను రాందేవ్ బాబాతో పాటు పతంజలి ఆయుర్వేద్ సిఇఒ ఆచార్య బాలకృష్ణ ఉల్లంఘించినట్లు ప్రాథమిక సాక్ష్యాధారాలు లభించడంతో అత్యున్నత న్యాయస్థానం సీరియస్ అయ్యింది.

ఆధునిక వైద్య విధానాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ 2022లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) పిటిషన్ దాఖలు చేసింది. అన్ని రకాల వ్యాధుల నివారణకు పతంజలి ఆయుర్వేద మందులు పని చేస్తాయంటూ దేశవ్యాప్తంగా వాణిజ్య ప్రకటనలు జారీ చేయొద్దని రాందేవ్ బాబాను ఇంతకుముందు విచారణలో అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో ఎటువంటి ప్రకటనలు చేయొద్దని గతేడాది నవంబర్ 21న తీవ్రంగా హెచ్చరించింది. ఈ అంశంలో రూ.1 కోటి జరిమానా కూడా విధించింది.

ఇకపై ఎలాంటి ఉల్లంఘనలూ జరగవంటూ అప్పట్లో పతాంజలి కోర్టుకు హామీ ఇచ్చింది. దీన్ని మళ్ళీ విస్మరించడంతో ఐఎంఎ తిరిగి కోర్టు దృష్టికి తీసుకొచ్చింది. కంపెనీ ఉత్పత్తుల ప్రచారం, వాటి సామర్థ్యానికి సంబంధించిన ప్రకటనల విషయంలో కోర్టుకు ఇచ్చిన హామీని ఉల్లంఘించడంపై ఇటీవలి విచారణలోనూ న్యాయమూర్తులు హిమా కోహ్లీ, అమనుల్లాతో కూడిన ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రజలను తప్పుదోవ పట్టించినందుకు పతంజలి ఆయుర్వేద్ సంస్థపై ఏం చర్యలు తీసుకున్నారని తాజా విచారణలో కేంద్ర ప్రభుత్వాన్ని న్యాయస్థానం ప్రశ్నించింది. కాగా.. రాందేవ్ బాబా, ఆచార్య బాలకృష్ణ ఏ రోజున హాజరు కావాలనేది కోర్టు ప్రకటించలేదు. తదుపరి విచారణ ఎప్పుడనేది వెల్లడి కావాల్సి ఉంది.

కోవిడ్ టీకాపై బోల్సనారో తప్పుడు సమాచారం

- పోలీసు అధికారుల అభిశంసన




బ్రసీలియా : కోవిడ్ మహమ్మారి వేళ టీకాల డేటాపై బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జేర్ బోల్సనారో తప్పుడు సమాచారం ఇచ్చారంటూ బ్రెజిల్ ఫెడరల్ పోలీసులు అభిశంసించారు. ఆనాడు అధ్యక్షుడిగా వున్న బోల్సనారో, ఆయన 12 ఏళ్ళ కుమార్తె, ఆయన సన్నిహితుల్లో మరికొంతమంది కోవిడ్ వ్యాక్సిన్ తీసుకున్నట్లు పబ్లిక్ హెల్త్ డేటాబేస్‌లో తప్పుడు సమాచారాన్ని వుంచారంటూ బోల్సనారోతో సహా మరో 16 మందిపై పోలీసు విభాగం తీవ్రంగా విమర్శలు చేసింది. ఇందుకు సంబంధించి పోలీసుల అభిశంసన పత్రాన్ని సుప్రీం కోర్టు మంగళవారం విడుదల చేసింది. కోవిడ్ వ్యాక్సిన్లకు వ్యతిరేకంగా గళం వినిపించిన కొద్ది మంది నేతల్లో బోల్సనారో ఒకరు. ఆయన బాహాటంగానే కోవిడ్ ఆంక్షలను ఉల్లంఘిస్తూ, ప్రజలు కూడా తనను అనుసరించాలని కోరారు. అయితే సుప్రీం కోర్టులో బోల్సనారోపై అభియోగాలు నమోదు చేయడానికి ఈ పోలీసుల అభిశంసన పత్రాన్ని ఉపయోగించవచ్చా లేదా అనే అంశంపై బ్రెజిల్ ప్రాసిక్యూటర్ జనరల్ కార్యాలయం తుది నిర్ణయం తీసుకోవాల్సి వుంటుంది. కాగా దీనిపై బోల్సనారో తరపు న్యాయవాది తక్షణమే స్పందించలేదు. బ్రెజిల్ అధ్యక్షుడిగా లూలా డసిల్వా తిరిగి ఎన్నికైన రెండు మాసాల తర్వాత 2022 డిసెంబరులో అమెరికాకు వెళ్ళిపోవడానికి కాస్త ముందుగా బోల్సనారో, ఆయన సహచరులు ఆరోగ్య మంత్రిత్వ శాఖ డేటాబేస్‌లో అక్రమాలకు పాల్పడ్డారని పోలీసులు ఆరోపించారు. ఆరోగ్య డేటాలో తప్పుడు సమాచారం చొప్పించినట్లు రుజువైతే బోల్సనారోకు 12ఏళ్ళ జైలు శిక్ష విధించే అవకాశం వుందని న్యాయ నిపుణులు భావిస్తున్నారు. అమెరికాలోకి ప్రవేశించాలంటే బోల్సనారోకు వ్యాక్సినేషన్ సర్టిఫికెట్ అవసరం. ఇదిలావుండగా, 2022 ఎన్నికల ప్రచారం సందర్భంగా తన అధికారాన్ని దుర్వినియోగపరచడమే కాకుండా దేశ ఎలక్ట్రానిక్ ఓటింగ్ వ్యవస్థపై అనుమానాలు వ్యక్తం చేసినందున 2030 వరక ఆయన ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులని బ్రెజిల్ ఉన్నత ఎలక్టోరల్ కోర్టు ప్రకటించింది.



సూపర్ లార్జ్ రాకెట్ లాంచర్లతో ఉత్తర కొరియా విన్యాసాలు

- వీక్షించిన అధ్యక్షుడు కిమ్

ప్యాంగాంగ్ : ఉత్తర కొరియా కొత్తగా సమకూర్చుకున్న 'సూపర్ లార్జ్' రాకెట్ లాంచర్లతో జరిపిన విన్యాసాలను ఆ దేశాధ్యక్షుడు కిమ్ పర్యవేక్షించారు. గత రెండు మాసాల వ్యవధిలో ఉత్తర కొరియా అనేక స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. ఈ ప్రయోగాల గురించి దక్షిణ కొరియా, జపాన్‌లు వెల్లడించాయి. 23 అంగుళాల బహుళ రాకెట్ లాంచర్లతో 'వాస్తవ యుద్ధ సామర్థ్యాలను' పరీక్షించేందుకు ఈ విన్యాసాలు ఉద్దేశించబడినట్లు అధికార కొరియన్ సెంట్రల్ వార్తా సంస్థ (కెసిఎన్ఎ) తెలిపింది. లక్ష్యానికి మించి ముందుగానే నిర్దేశించుకున్న ఎత్తులో ఒక శతఘ్నిని గాల్లోనే పేల్చడాన్ని అనుకరించడం వంటివి ఈ విన్యాసాల్లో వున్నాయి. ఉత్తర కొరియా మిలటరీని పూర్తి స్థాయిలో ఆధునీకరించాలని కిమ్‌భావిస్తున్నారు. ఆ దిశగా ఇటీవలి కాలంలో తన చర్యలను ముమ్మరం చేశారు. ఈ రాకెట్ లాంచర్లతో యుద్ధ సన్నాహాల్లో కీలకమైన దాడుల ప్రయోగాలను చేస్తున్నట్లు తెలిపారు.



మీ కోసం

కాకరకాయ ముక్కలకు కొద్దిగా పెరుగు, ఉప్పు కలిపి పది నిమిషాలు నానబెట్టి వేపితే త్వరగా వేగుతాయి.

జీవన సారథం

మనకు ఎదురయ్యే ప్రతి సంఘటన ఎంతో కొంత పాఠం నేర్పుతుంది. దాన్ని గ్రహించినప్పుడే అభివృద్ధి వైపు పయనిస్తాం.

ఎవరికి వారే!



కుందేలమ్మా కుందేలు
నల్లని, తెల్లని కుందేలు
ఎర్రని కేరట్ అంటే చాలు
ఎగిరి గంతేసే కుందేలు.

తాబేలమ్మా, తాబేలు
బుడి బుడి నడకల తాబేలు
నెమ్మదిగా నడిచిన గానీ
గమ్యాన్ని చక్కగ చేరు.


చిలకమ్మ చిలకమ్మా
పచ్చని చక్కని చిలకమ్మ
కొమ్మన కూర్చుని కూసేవమ్మా
కమ్మని కబుర్లు చెప్పమ్మా!

ఉడుతా ఉడుతా చారల ఉడుత
బారెడు తోకతో పరిగిడు బుడత
కీచు కీచు మని తోకను ఊపు
స్నేహం కోసం చేతులు చాపు.

మ్యావు మ్యావు నల్లని పిల్లి
సడీ చప్పుడు చేయని బిల్లీ
పాలు పెరుగు వుండనివ్వదు.
రాక పోకలు అసలు తెలీదు.

పాప పాప చిన్నారి పాప
చదువుల తల్లి, సిరిగల మల్లి.
అమ్మా నాన్న కన్నుల పంట.
ఇంటికి దీపం ఆమె నంట!

– కూచిమంచి నాగేంద్ర
91821 27880



తేడాలు గుర్తించండి

పిల్లలూ, ఇక్కడ ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు బొమ్మల్లో 8 తేడాలు ఉన్నాయి. కనిపెట్టండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ



ఎం.భవాని,
5వ తరగతి,
గంగినేనిపాలెం.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఎండల్లో దండెత్తే ఆరోగ్య సమస్యలు

వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా శరీరంలో అనేక మార్పులు సంభవించి చివరకు అనారోగ్యానికి దారి తీయొచ్చు. తలనొప్పి, చర్మంపై దద్దుర్లు, వడదెబ్బ, మీజిల్స్, కామెర్లు వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎండాకాలంలో తలెత్తుతాయి. ఎండల ఉధృతి ఉండే మార్చి - జూన్ నెలల మధ్య కొన్ని రకాల వైరస్‌ల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. వీటి పట్ల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.



వేసవిలో కలిగే అనారోగ్యాలు

వడదెబ్బ : ఎండలో ఎక్కువగా తిరిగినా, నీరు తక్కువగా తీసుకున్నా వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది. శరీర ఉష్ణోగ్రత 104 డిగ్రీల కంటే ఎక్కువగా ఉన్నా, అయోమయం, గుండె వేగంగా కొట్టుకోవడం, శ్వాస తీసుకోవటంలో ఇబ్బంది, చెమట పట్టకపోవటం, కాళ్ళూ చేతుల నొప్పులు, శరీరం తిమ్మిరి, వాంతులు, తలనొప్పి, స్పృహ కోల్పోవటం వంటివి వడదెబ్బ లక్షణాలు. వడదెబ్బ తగిలిన వ్యక్తి శరీరాన్ని చల్లబర్చాలి. తడిగుడ్డతో శరీరమంతా తుడవాలి. నీళ్ల తాగించి వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లటం ఉత్తమం.

వేసవిలో అధిక ఉష్ణోగ్రతల ప్రభావంతో డీహైడ్రేషన్‌కు గురయ్యే అవకాశం ఉంటుంది. ఈ సమస్య ఎదురుకాకుండా ఉండాలంటే తరచూ నీటిని తీసుకోవాలి. నిమ్మరసం, కొబ్బరినీరు, గ్లూకోజ్ డి వంటివి తీసుకోవాలి. ఇంట్లో ఎలక్ట్రోరల్ పౌడర్ లేదా ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచుకోవాలి. అవి అందుబాటులో లేకపోతే చక్కెర, ఉప్పు కలిపిన నీరు తీసుకోవొచ్చు.

అతిసారం : ఎండవేడి కారణంగా ఆహారం త్వరగా పాడైపోతుంది. అలాంటి ఆహారం తీసుకుంటే విరోచనాలు సాధారణం. కలుషిత ఆహారం తినటం, మద్యపాన అలవాట్లు డయేరియాకు దారి తీస్తాయి. అతిసారం నుంచి దూరంగా ఉండటానికి నీటిని మరిగించిన తర్వాత మాత్రమే తాగటం అలవాటుగా చేసుకోవాలి. కూరగాయలను ముక్కలుగా చేయటానికి ముందు, తర్వాత వాటిని బాగా కడగాలి.

చికెన్‌పాక్స్ : చికెన్ పాక్స్ (అమ్మోరు) వేసవి వ్యాధుల్లో ఒకటి. ఇది అధిక జ్వరంతో శరీరంపై ఎరుపురంగులో ఉండే చిన్న దద్దుర్ల రూపంలో ప్రారంభమవుతుంది. పిల్లల్లో, తక్కువ రోగ నిరోధకశక్తి ఉన్న వారిలో సాధారణంగా కనిపిస్తుంది. ఇది అంటువ్యాధి. అందువల్ల అప్రమత్తంగా ఉండాలి.

తట్టు : మీజిల్స్‌కు కారణమయ్యే పారామిక్సో వైరస్ వేసవిలో వేగంగా పెరుగుతుంది. దీని ప్రారంభ లక్షణాలు దగ్గు, అధిక జ్వరం, గొంతునొప్పి, కళ్లు ఎర్రబడటం, తరువాతి దశలో చిన్న తెల్లటి మచ్చలు ఏర్పడతాయి. మీజిల్స్ దద్దుర్లు శరీరం అంతటా కనిపిస్తాయి. ఈ లక్షణాలు కనపడ్డ వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

చర్మ సమస్యలు : వేసవిలో సూర్యుడి నుంచి విడుదలయ్యే అతినీలలోహిత కిరణాలు వల్ల చర్మంలోని కణాలు దెబ్బతింటాయి. ఎండలో ఎక్కువగా తిరిగితే చర్మం కమిలిపోతుంది. అధిక తేమ, వేడి కారణంగా చర్మంపై ఏర్పడే ఎరుపు దద్దుర్లు, స్వేద గ్రంథులు మూసుకుపోవటం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. చెమట వల్ల మచ్చులు, దురద మంట వస్తుంది. వేసవిలో తప్పకుండా సన్‌స్క్రీన్ లోషన్లు ఉపయోగించాలి. ఎండలకు శరీరం ఫోకస్ కాకుండా చూసుకోవాలి.

కామెర్లు : ప్రధానంగా కలుషితమైన ఆహారం, నీటి వినియోగం వల్ల వస్తుంది. సకాలంలో చికిత్స చేయకపోతే ఈ వ్యాధి కాలేయం పనితీరును ప్రభావితం చేస్తుంది.

టైఫాయిడ్ : అపరిశుభ్ర ఆహారం, కలుషిత నీరు తీసుకోవటం వల్ల టైఫాయిడ్ జ్వరం వస్తుంది. జ్వరంతోపాటు తలనొప్పి, నీరసంగా ఎక్కువగా ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. టైఫాయిడ్ వస్తే బలహీనత, ఆకలిలేకపోవటం, కడుపులో నొప్పి, అధిక జ్వరం వంటి లక్షణాలు కన్పిస్తాయి.

గవదబిళ్ళలు : వేసవిలో ప్రబలే అంటు వ్యాధి ఇది. ఇది సోకిన వ్యక్తి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు వైరస్ వ్యాపిస్తుంది. లాలాజల గ్రంథివాపు, కండరాల నొప్పి, జ్వరం, తలనొప్పి, ఆకలి లేకపోవటం, బలహీనత వంటి లక్షణాలు కన్పిస్తాయి.


విషాహారం : వేసవిలో అధిక వేడికారణంగా ఆహారం త్వరగా పాడవుతుంది. అలాంటి ఆహారం తీసుకోవటం వల్ల ఫుడ్ పాయిజనింగ్ అయ్యే ప్రమాదం ఉంది. ఆహారం చెడిపోకుండా చూసుకోవాలి.

ఈ జాగ్రత్తలు తీసుకోండి...



ఎండాకాలంలో వడగాల్పులు అనేక ఇబ్బందులకు గురిచేస్తాయి. అందువల్ల కొన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవటం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

- దాహం వేసినా, వేయకున్నా గంటకొకసారి మంచినీటిని తాగుతుండాలి. అప్పుడప్పుడూ మజ్జిగ, పండ్ల రసాలను ఎక్కువగా తీసుకోవాలి.
- శీతల పానీయాలను ఎక్కువగా తీసుకోకూడదు. వాటికి వీలైనంత దూరంగా ఉండాలి. వాటిల్లోని రసాయనాల వల్ల బరువు పెరగటంతోపాటు జీర్ణ సంబంధ సమస్యలూ ఎదురుకావొచ్చు.
- మసాలా పదార్థాలకు వీలైనంత దూరంగా ఉండాలి. ఆకుకూరలు, మల్లంగి, బీట్‌రూట్, సొరకాయ, టమోటా, దోసకాయ ఇలాంటివి ఎక్కువగా తీసుకోవాలి
- డ్రైఫ్రూట్స్ తగ్గించి వీలైనంతవరకూ తాజా పండ్లు తీసుకోవాలి.
- పెరుగు, మజ్జిగ వంటివి ఎక్కువగా తీసుకోవాలి
- ఇంట్లో తయారుచేసుకునే ప్రతి పానీయంలోనూ సబ్జా గింజలను నానబెట్టి వాడితే మంచిది.
- పండ్ల రసాలు కూడా అప్పటికప్పుడు తాజాగా చేసుకోవాలి. చక్కెర శాతాన్ని వీలైనంతవరకూ తగ్గించాలి.
- నిమ్మరసం, కొబ్బరి నీళ్ల, పుదీనా రసం, పల్చని మజ్జిగ వంటివి ఎక్కువగా తీసుకుంటే శరీరానికి తేమ అందుతుంది. డీహైడ్రేషన్ సమస్య కూడా ఎదురుకాదు.
- ఎక్కువగా నూనె ఉండే ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి. కుదిరితే ఈకాలంలో పూర్తిగా మానేయటం మంచిది.
- మధ్యాహ్నం సమయంలో వీలైనంత వరకూ బయటకు వెళ్లకుండా ఉండాలి
- కాటన్ దుస్తులు ధరించాలి
- ఎండకు బయటకు వెళ్లినప్పుడు సన్ స్క్రీన్ లోషన్ రాసుకోవటం మంచిది
- నలుపు రంగు గొడుగులను వాడకూడదు
- వృద్ధులు, పిల్లలు, ఐదేళ్లలోపు వారు ఎక్కువగా వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది.
- అనారోగ్య సమస్యలతో ఉన్న వారు మందులు వాడి ఎండలో పనిచేస్తే వడదెబ్బ తగులుతుంది
- రక్షిత మంచినీటినే తాగాలి. కలుషిత నీటిని తాగొద్దు.
- మద్యం సేవించొద్దు
- ఉదయం 10లోపు మధ్యాహ్నం 3 గంటల తర్వాత బయట పనులు చేయటం మంచిది
- గృహాల్లో మంచి గాలి వెలుతురు వచ్చేలా ఏర్పాటుచేసుకోవాలి.



ఉస్తాద్ టీజర్

పవన్ కళ్యాణ్ ప్రధాన పాత్రలో, హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్' తాజాగా ఈ చిత్రం నుండి 'భగత్' స్ బ్లేజ్' అంటూ ఓ వీడియోను చిత్రబృందం విడుదలచేసింది. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలో శ్రీ లీల హీరోయిన్‌గా నటిస్తున్నారు.

మురళీమోహన్‌కు ఘనసత్కారం



సీనియర్ నటుడు మాగంటి మురళీమోహన్‌కు హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా ఘన సత్కారం జరిగింది. తెలుగు చలన చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఫిలిం అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, తెలుగు సినిమా వేదిక సంస్థలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. సంస్థ అధ్యక్ష కార్యదర్శులు చైతన్య జంగా, వీస్ విజయ వర్మ పాకలపాటి, నిర్మాతల మండలి అధ్యక్షుడు దామోదరప్రసాద్, సెక్రటరీ ప్రసన్నకుమార్, వ్యాపార వేత్త కోగంటి సత్యం, మరో 20 మంది యువ కథానాయకుల సమక్షంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ అట్లూరి పూర్ణచంద్రరావు చేతులమీదుగా 33వ ఏట కళామతల్లి ఆశీస్సులు పొందిన తాను నటునిగా, వ్యాపారవేత్తగా విజయవంతంగా రాణించానన్నారు. ఈ క్రమంలో తనకు తోడుగా నిలిచిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో తెలుగు దర్శకుల సంఘం అధ్యక్షుడిగా వీరశంకర్, తెలంగాణా మూవీ టెలివిజన్ అండ్ డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్ అధ్యక్షుడిగా శుభోదయం సుబ్బారావు ఎన్నికయ్యారు. ఆయా నూతన కార్యవర్గాలను మురళీమోహన్ ఘనంగా సత్కరించారు.

పోస్ట్ ప్రొడక్షన్స్‌లో 'సిటడెల్'




వరుణ్ ధావన్, సమంత జంటగా నటిస్తున్న యాక్షన్ థ్రిల్లింగ్ వెబ్‌సిరీస్ 'సిటడెల్'కు రాజ్ అండ్ డీకే దర్శకత్వం వహిస్తున్నారు. షూటింగ్ పూర్తికావటంతో ఈ సిరీస్‌కు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా స్ట్రీమింగ్‌కు తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా ముంబై వేదికగా ప్రైమ్ వీడియో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో 'సిటడెల్: హనీ–బన్నీ' అనే టైటిల్‌ను ఖరారుచేశారు. ఎప్పటి నుంచి స్ట్రీమింగ్‌కు తీసుకొస్తారనే విషయాన్ని మాత్రం ఇంకా ప్రకటించలేదు. కేకే మేనన్, సిమ్రన్, సోహమ్ మజుందార్ తదితరులు కీలకపాత్రలు పోషించారు. 'ఫ్యామిలీ మ్యాన్ 2'లో నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో అదరగొట్టిన సమంత 'సిటడెల్' కోసం ప్రత్యేకంగా మార్షల్ ఆర్ట్స్‌లోనూ శిక్షణ తీసుకున్నారు. సిటాడెల్ మాతృకలో ప్రియాంక చోప్రా, రిచర్డ్ మ్యాడెన్ నటించారు.




'ఇసైజ్ఞాని'లో ధనుష్

సంగీత దర్శకుడు ఇళయరాజా జీవిత చరిత్ర 'ఇసైజ్ఞాని' పేరుతో సినిమాగా రానుంది. ధనుష్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని మెర్క్యూరీ గ్రూప్, కనెక్ట్ మీడియా సంస్థలు నిర్మించనున్నాయి. బుధవారంనాడు ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. వచ్చే ఏడాది ఈ సినిమా విడుదల చేయాలని చిత్రబృందం ప్రణాళిక రూపొందించింది. బాలీవుడ్‌లో ధనుష్, అమితాబచ్చన్ నటించి 'షమితాబ్' చిత్రానికి ఆర్.బాల్కి దర్శకత్వం వహించిన విషయం తెలిసిందే. తొలుత బాల్కి దర్శకత్వం వహిస్తారని భావించినా ఆ తర్వాత అరుణ్ మాథేశ్వరన్‌ను ఎంపిక చేసినట్లుగా సమాచారం. 7 వేలకు పైగా పాటలకు ఇళయరాజా సంగీతం అందించారు. ఆయన పేరును చిరస్థాయిగా గుర్తుంచుకునేలా 'ఇసైజ్ఞాని'గా బయోపిక్‌కు పేరు ఖరారు చేశారు.

ఆర్కా మీడియాలో రెండు ప్రాజెక్టులు..



'ఫహద్ ఫాజిల్' ప్రధాన పాత్రలో రెండు ప్రాజెక్టులు తెరకెక్కుతున్నాయి. ఎస్.ఎస్.రాజమౌళి సమర్పణలో ఆర్కా మీడియా ఈ కొత్త సినిమాలను ప్రకటించింది. మంగళవారం ఈ సినిమాలకు సంబంధించిన టైటిల్స్‌తో పాటు, పోస్టర్‌లను కూడా షేర్ చేశారు. 'ఆక్సిజన్' పేరుతో రూపొందబోయే సినిమాకు సిద్ధార్థ్ నాదెళ్ల దర్శకుడిగా పరిచయం కాబోతున్నారు. ఇద్దరు స్నేహితుల మధ్య జరిగే ఆసక్తికర కథతో ఈ మూవీ రాబోతోంది. శోభ యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని, కార్తికేయలు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. అలాగే శశాంక్ యేలేటి దర్శకత్వంలో పట్టాలెక్కనున్న మరో చిత్రం 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్'. ఫన్, థ్రిల్, ఎమోషన్స్‌తో కూడిన కథగా దీన్ని తీర్చిదిద్దబోతున్నారు.



ఆ పేరు ఉన్న వాళ్లకు ఉచితం..

పార్వతీశం నటిస్తున్న 'మార్కెట్ మహాలక్ష్మి' చిత్రాన్ని వీఎస్ ముఖేశ్ తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాతో ప్రణీకాన్వికా హీరోయిన్‌గా పరిచయం కానున్నారు. హర్ష వర్ధన్, ముక్కు అవినాశ్, మహబూబ్ బాషా తదితరులు ఈ సినిమాలో ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. మార్చి 29న ఈ చిత్రం రిలీజ్ కానుంది. ప్రమోషన్లలో భాగంగా తాజాగా చిత్రబృందం ఓ ప్రకటన చేసింది. మహాలక్ష్మి పేరుతో ఉన్న వారికి తమ సినిమా టికెట్లను ఉచితంగా ఇవ్వనున్నట్లు వెల్లడించారు. మొత్తం 200 టికెట్లను ఇలా ఉచితంగా ఇవ్వనున్నట్లు చిత్ర బృందం తెలిపింది. ఈ మేరకు సోషల్ మీడియాలో ఒక వీడియోను రిలీజ్ చేసింది.




ముంబయికి ఎదురుదెబ్బ

తొలి లీగ్ మ్యాచ్‌లకు సూర్యకుమార్ కష్టమే..!

ముంబయి: ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్–17 మరో రెండు రోజుల్లో ప్రారంభం కానుండగా.. అన్ని ఫ్రాంచైజీలు ఆటగాళ్ల ఫిట్‌నెస్‌పై ప్రధానంగా దృష్టి సారించాయి. ఆటగాళ్లు గాయాలబారిన పడకుండా ఉండేందుకు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. నెట్ ప్రాక్టీస్‌లో ఓవైపు ఆటగాళ్ల చెమటలు చిందిస్తున్నా.. స్టార్ ఆటగాళ్లకు కొద్దిసేపు ప్రాక్టీస్‌కు మాత్రమే నిమగ్నం చేస్తున్నాయి. ఈ క్రమంలో ఐదుసార్లు ఐపిఎల్ టైటిల్‌ను ముద్దాడిన ముంబయి ఇండియన్స్ జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ బ్యాటర్, మిస్టర్ 360డిగ్రీస్ సూర్యకుమార్ యాదవ్ ఫిట్‌నెస్ సాధించడంలో విఫలమైనట్లు బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీ(ఎన్‌సిఎ) మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. గత డిసెంబర్‌లో దక్షిణాఫ్రికా పర్యటన నుంచి గాయం కారణంగా స్వదేశానికి తిరిగొచ్చి చికిత్స చేయించుకున్న సూర్యకుమార్.. ఇంకా ఫిట్‌నెస్ సాధించలేదని ఆ ప్రకటనలో తెలిపింది. దీంతో సూర్య ఐపిఎల్ తొలి లీగ్ రెండు లేదా మూడు వారాలు దూరమయ్యే అవకాశం ఎక్కువగా ఉంది. ముంబయి మిడిలార్డర్‌లో కీలక బ్యాటర్ అయిన సూర్యకుమార్ దూరమైతే ఆ జట్టుకు కష్టాలు తప్పవు.

మంధాన బృందానికి గార్డ్ ఆఫ్ హానర్...

రాయల్ చాలెంజర్స్ బెంగళూరుకు తొలి ట్రోఫీని అందించిన అమ్మాయిల జట్టుకు పురుషుల జట్టు 'గార్డ్ ఆఫ్ హానర్'తో ఘన స్వాగతం పలికింది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా జరుగుతున్న 'ఆర్సీబీ అన్ బాక్స్' ఈవెంట్ ఇందుకు వేదికైంది. ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యుపిఎల్) 2024 టైటిల్ విజేతగా నిలిచిన స్మృతి మంధాన జట్టు సభ్యులు కూడా ఈ కార్యక్రమానికి హాజరు కాగా.. ట్రోఫీతో వాళ్ల స్టేడియంలో సందడి చేశారు. డబ్ల్యుపిఎల్ టైటిల్‌తో వచ్చిన మంధాన జట్టుకు కోహ్లీ, డుప్లెసిస్, గ్లెన్ మ్యాక్స్‌వెల్ వంటి దిగ్గజ క్రికెటర్లు చప్పట్లతో 'గార్డ్ ఆఫ్ హానర్' ఇచ్చారు. ఢిల్లీ నుంచి నేరుగా బెంగళూరుకు వచ్చిన ఆర్సీబీ అమ్మాయిలు.. డబ్ల్యుపిఎల్ చాంపియన్స్–2024 అని రాసి ఉన్న టీషర్ట్స్‌ను ధరించారు. ఆర్సీబీ చరిత్రలో తొలి ట్రోఫీ నెగ్గిన ఆ జట్టు.. గార్డ్ ఆఫ్ హానర్ అందుకున్న తర్వాత చిన్నస్వామి స్టేడియం అంతా కలియతిరిగారు. ప్రస్తుతం బెంగళూరులో జరుగుతున్న ఆర్సీబీ అన్‌బాక్స్ ఈవెంట్‌లో మహిళల జట్టుకు సత్కారంతో పాటు రాబోయే సీజన్‌లో పురుషుల జట్టు వేసుకోబోయే జెర్సీని రిలీజ్ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో అలన్ వాకర్, రఘు దీక్షిత్, నీతి మోహన్ సెలబ్రిటీలు పాల్గొన్నారు.



డబ్ల్యుపిఎల్ టైటిల్‌ను సాధించిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు 'గార్డ్ ఆఫ్ ఆనర్'

మళ్లీ కౌంటీల్లో ఆడనున్న ఉనాద్కట్



లండన్: 32ఏళ్ల జయదేవ్ ఉనాద్కట్‌కు జాక్‌పాట్ దక్కింది. ఈ ఏడాది మరోదఫా కౌంటీల్లో ఆడేందుకు సస్సెక్స్ క్లబ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాడు. గత ఏడాది సస్సెక్స్ తరఫున ఆడిన ఉనాద్కట్.. డివిజన్–2 మ్యాచుల్లో 24.18 యావరేజ్‌తో 11 వికెట్లు పడగొట్టాడు. అతడు ప్రాతినిధ్యం వహించిన క్లబ్ మూడోస్థానంలో నిలిచింది. 2023 డిసెంబర్‌లో వెస్టిండీస్‌తో జరిగిన రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో ఆడేందుకు భారత్‌కు వచ్చేశాడు. సస్సెక్స్ క్లబ్ ప్రధాన కోచ్ పార్ట్రేస్ మాట్లాడుతూ.. ఉనాద్కట్ గత సీజన్‌లో అద్భుత బౌలింగ్‌తో అలరించాడని, దీంతో అతడ్ని ఈ సీజన్‌లోనూ తమ క్లబ్ తరఫున ఆడేందుకు ఒప్పందం చేసుకొన్నట్లు చెప్పుకొచ్చాడు. ఇకఉనాద్కట్ ప్రాతినిధ్యం వహించిన సౌరాష్ట్ర జట్టు 2019–20 సీజన్‌లో తొలిసారి రంజీట్రోఫీ టైటిల్‌ను చేజిక్కించుకొంది.



ఐర్లాండ్‌తో జరిగిన మూడో, చివరి టి20లో ఆఫ్ఘనిస్తాన్ జట్టు 57పరుగుల తేడాతో నెగ్గి సిరీస్‌ను 2–1తో కైవసం చేసుకుంది. షార్జా క్రికెట్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆఫ్ఘనిస్తాన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 156పరుగులు చేయగా.. ఛేదనలో ఐర్లాండ్ జట్టు 17.2ఓవర్లలో 98పరుగులకే ఆలౌటైంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ జద్రాన్‌కు సిరీస్ రషీద్ ఖాన్‌కు దక్కాయి.



పాకిస్తాన్ సూపర్ లీగ్ (పిఎస్ఎల్) 2024 సీజన్ టైటిల్‌ను ఇస్లామాబాద్ యునైటెడ్ జట్టు మరో దఫా చేజిక్కించుకుంది. ముల్తాన్ సుల్తాన్స్‌తో జరిగిన ఉత్కంఠ ఫైనల్లో ఇస్లామాబాద్ 2 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆఖరి బంతికి నసీమ్ షా తమ్ముడు హునైన్ షా ఫోర్ కొట్టి మ్యాచ్‌ను ముగించాడు. ప్లేయర్ ఆఫ్ ది ఇమాద్ వాసీంకు, సిరీస్ షాదాబ్ ఖాన్‌కు లభించాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68